www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 17-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 1 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: నవమి మ. 3.15 తదుపరి దశమి; నక్షత్రం: ఆశ్లేష పూర్తి; వర్జ్యం: రా. 7.29-9.16; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.39; అమృతఘడియలు: ఉ. 6.10-7.57; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



వైభవంగా ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలన

● టార్చ్ రిలే ఆరంభం ● 100 రోజుల కౌంట్‌డౌన్

ఒలింపియా (గ్రీస్): ఒలింపిక్స్ క్రీడల పుట్టినిల్లు గ్రీస్‌లోని ప్రాచీన ఒలింపియాలో.. పారిస్ విశ్వక్రీడాజ్యోతిని ప్రజ్వలన చేశారు. సంప్రదాయం ప్రకారం మతాధికారి పాత్రను పోషించిన గ్రీస్ నటి మేరీ మినా ఒలింపిక్ టార్చ్‌ను వెలిగించింది. మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉండడంతో పారాబోలిక్ మిర్రర్ నుంచికాకుండా ముందు రోజు రిహార్సల్ సందర్భంగా ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన అగ్ని నుంచి జ్యోతిని వెలిగించింది. తర్వాత ఈ జ్యోతిని తొలి టార్చ్ బేరర్‌గా వ్యవహరించిన టోక్యో క్రీడల స్వర్ణ విజేత అయిన గ్రీస్ రోయర్ స్టెఫనోస్ డౌస్కోకు అందించింది. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని వీక్షించడానికి భారీ సంఖ్యలో వీక్షకులు హాజరయ్యారు. కాగా 11 రోజులపాటు గ్రీస్‌లో ఒలింపిక్ టార్చ్ రిలే జరగనుంది. ఆ తర్వాత ఓడలో పారిస్‌కు పయనం కానుంది. అయితే, ఒలింపిక్స్ ఆరంభోత్సవాన్ని స్టేడియంలో కాకుండా సెన్ నదిలో నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేస్తున్నారు. కాగా జులై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరిగే ఈ పోటీల 100 రోజుల కౌంట్‌డౌన్‌కు పారిస్ సిద్ధమైంది. నేటినుంచి ఈ క్రీడలకు ఇంకా 100 రోజుల సమయం ఉంది.

కాంస్య పోరులో ఓడిన రోహిత్

బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత గ్రీకో రోమన్ రెజ్లర్ రోహిత్ దహియా కాంస్య పతక పోరులో పరాజయం పాలయ్యాడు. మంగళవారం జరిగిన 82 కిలోల విభాగం బౌట్‌లో వరల్డ్ నెంబర్ వన్ రసులోవ్‌తో తలపడిన రోహిత్ పోరాడి ఓడాడు.

భళిరా..బట్లర్

సూపర్ సెంచరీతో సత్తా చాటిన జోస్
కోల్‌కతాకు నిరాశ
నరైన్ శతకం వృథా

224 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన రాజస్థాన్



కోల్‌కతా: ఐపీఎల్ తాజా సీజన్‌లో మరో అదిరిపోయే మ్యాచ్. 224 పరుగుల భారీ ఛేదనలో వరుసగా వికెట్లు నేలకూలుతున్నా.. ఓపెనర్ జోష్ బట్లర్ (60 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సర్లతో 107 నాటౌట్) వీరోచిత పోరాటం అబ్బురపరిచింది. ఒంట్లో నిస్సత్తువ ఆవరిస్తున్నా.. తుదికంటా నిలిచి, టెయిలెండర్ల అండతోనే అసాధ్యమనుకున్న విజయాన్ని రాజస్థాన్ రాయల్స్ ఖాతాలో వేశాడు బట్లర్. దీంతో ఈడెన్ గార్డెన్స్‌లో హ్యాట్రిక్ గెలుపు ఖాయమనుకున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ షాక్‌లో మునిగింది. 2 వికెట్ల తేడాతో గెలిచిన ఆర్‌ఆర్ పట్టికలో అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకుంది. అటు టీ20 కెరీర్‌లో తొలి సెంచరీ సాధించిన సునీల్ నరైన్ (56 బంతుల్లో 13 ఫోర్లు, 6 సిక్సర్లతో 109) షో వృథా అయ్యింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్లకు 223 పరుగులు చేసింది. రఘువంశీ (18 బంతుల్లో 5 ఫోర్లతో 30) రాణించాడు. అవేశ్, కుల్దీప్ సేన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 224 పరుగులు చేసి నెగ్గింది. రియాన్ పరాగ్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 34), పొవెల్ (13 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 26) కీలక ఇన్నింగ్స్ ఆడారు. నరైన్, వరుణ్, హర్షిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బట్లర్ నిలిచాడు.

ఆఖర్లో మలుపు: భారీ ఛేదనలో రాజస్థాన్ అదరగొడుతూ కేకేఆర్‌కు విఁంచిన వేగంతో ఇన్నింగ్స్ ఆరంభమైంది. అయితే వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన వేళ ఓటమి ఖాయమనిపించింది. కానీ పట్టువదలని బట్లర్ మాత్రం ఆఖరి వరకు పోరాడి గెలిపించగా, పరాగ్ సహకరించాడు. ధనాధన్ ఇన్నింగ్స్‌తో జైస్వాల్ (19) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగినా మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిశాడు. ఇక కెప్టెన్ సంజూ శాంసన్ (12) స్వల్ప స్కోరుకే ఐదో ఓవర్‌లో వెనుదిరిగాడు. అయితే ఆరో ఓవర్‌లో రియాన్ 4,6,4.. బట్లర్ సిక్సర్‌తో 23 పరుగులు రావడంతో పవర్‌ప్లేలో ఆర్‌ఆర్ 76/2 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. అలాగే మరో 6,4తో జోరు చూపిన పరాగ్‌ను హర్షిత్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 50 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. పరాగ్ ఉన్నంత సేపు విజయం వైపు సాగిన జట్టు ఆ తర్వాత లయ తప్పింది. ధ్రువ్ జురెల్ (2) ఇలా వచ్చి అలా వెళ్లాడు. 8.2 ఓవర్లలోనే వంద పరుగులు సాధించిన వేళ బాధ్యతంతా బట్లర్‌పై పడింది. అటు అశ్విన్ (8), హిట్టర్ హెట్‌మయెర్ (0)లను రెండు బంతుల్లోనే స్పిన్నర్ వరుణ్ పెవిలియన్‌కు చేర్చాడు. పరుగులు నెమ్మదించిన వేళ 15వ ఓవర్‌లో బట్లర్ నాలుగు ఫోర్లతో 17 రన్స్ అందించాడు. అయినా 11-15 ఓవర్ల మధ్య 36 పరుగులే రావడంతో ఒత్తిడి పెరిగింది. ఈ దశలో పావెల్ వరుసగా 4,6,6తో వణికించినా నరైన్‌కు చిక్కాడు. కానీ 19వ ఓవర్‌లో బట్లర్ 6,4,6తో ఒక్కసారిగా రాయల్స్ పోటీలోకొచ్చింది. ఇక 6 బంతుల్లో 9 పరుగులు కావాల్సిన వేళ బట్లర్ తొలి బంతినే సిక్సర్‌గా మలవగా, సింగిల్స్ వద్దనుకోవడంతో సమీకరణం 3 బంతుల్లో 3 రన్స్‌కు మారింది. కానీ టెన్షన్ లేకుండా చివరి రెండు బంతుల్లో కావాల్సిన పరుగులు పూర్తి చేసిన బట్లర్ మ్యాచ్‌ను ముగించాడు.

నరైన్ శతక బాదుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ నరైన్ మరోసారి విశ్వరూపం చూపాడు. బౌలర్ ఎవరైనా మైదానం నలువైపులా చక్కటి షాట్లతో ఆకట్టుకుంటూ జట్టుకు భారీ స్కోరందించాడు. అతడికి యువ బ్యాటర్ రఘువంశీ చక్కగా సహకరించాడు. అయితే తొలి నాలుగు ఓవర్లలో రాజస్థాన్ బౌలర్లు ప్రభావం చూపడంతో 26 పరుగులే రాగా, మరో ఓపెనర్ సాల్ట్ (10) వికెట్‌ను సైతం కోల్పోయింది. కానీ ఐదో ఓవర్‌లో రఘువంశీ మూడు ఫోర్లతో 14 పరుగులు రాబట్టి పరుగుల వేగానికి తెర లేపాడు. దీన్ని నరైన్ కొనసాగిస్తూ తర్వాతి ఓవర్‌లోనే 6,4తో 16 రన్స్ సమకూర్చడంతో పవర్‌ప్లేలో కేకేఆర్ స్కోరు 56/1కి చేరుకుంది. ఇక ఆ తర్వాత నరైన్ దూకుడు మరింతగా పెరిగింది. ప్రతీ బౌలర్‌ను బాదేస్తూ సునాయాసంగా బౌండరీలు రాబట్టడంతో ఓవర్‌కు పది రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. అటు 29 బంతుల్లోనే సునీల్ ఫిఫ్టీ కూడా పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరి ఆటతీరుకు పది ఓవర్లలోనే జట్టు స్కోరు వందకి చేరింది. అయితే 11వ ఓవర్‌లో రఘువంశీని కుల్దీప్ సేన్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 43 బంతుల్లో 85 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు నరైన్ మాత్రం 12వ ఓవర్‌లో 6,4,4తో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయాస్ (11)ను స్పిన్నర్ చాహల్ ఎల్బీ చేయడంతో హిట్టింగ్ కోసం రస్సెల్‌ను ముందుగానే బరిలోకి దించారు. అయితే అతను షాట్లు ఆడడంలో ఇబ్బంది పడ్డాడు. మరో ఎండ్‌లో నరైన్ బ్యాట్‌కు పనిచెబుతూ 16వ ఓవర్‌లో వరుసగా 6,4,6,4 బాదగా 49 బంతుల్లోనే తొలి శతకాన్ని అందుకున్నాడు. డెత్ ఓవర్లలో ఆర్‌ఆర్ బౌలర్లు చకచకా వికెట్లు తీసి ఫర్వాలేదనిపించారు. 17వ ఓవర్‌లో రస్సెల్‌ను అవేశ్, ఆ తర్వాతి ఓవర్‌లో పేసర్ బౌల్ట్ చక్కటి యార్కర్‌తో నరైన్‌ను బౌల్డ్ చేశాడు. కానీ 19వ ఓవర్‌లో రింకూ (9 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 20 నాటౌట్) 6,4.. వెంకటేశ్ (8) ఫోర్‌తో 16 రన్స్ వచ్చాయి. ఆఖరి ఓవర్‌లో వెంకటేశ్ అవుట్ కాగా, కోల్‌కతా తొమ్మిది రన్స్‌తోనే సంతృప్తి చెందింది.



నరైన్‌కు ఇది టీ20 కెరీర్‌లోనే తొలి సెంచరీ

1

గతంలో (2020లో పంజాబ్‌పై) తమ పేరిటే ఉన్న రికార్డు ఛేదనను సమం చేసిన రాజస్థాన్.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
గుజరాత్	6	3	3	0	6	-0.637
పంజాబ్	6	2	4	0	4	-0.218
ముంబై	6	2	4	0	4	-0.234
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌కు మ్యాక్స్‌వెల్ దూరం



బెంగళూరు: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఐపీఎల్ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించాడు. మానసికంగా, శారీరకంగా విశ్రాంతి తీసుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపాడు. ఈ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో అతను చేసింది కేవలం 32 పరుగులే. ఇందులో మూడు డకౌట్లున్నాయి. అందుకే సోమవారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా మాక్సీ ఆడలేదు. తన స్థానంలో మరో ఆటగాడిని తీసుకోవాలని కెప్టెన్ డుప్లెసికి చెప్పాడట. అయితే గత నవంబరు నుంచి మ్యాక్సీ ఆడిన 17 అంతర్జాతీయ టీ20ల్లో 552 పరుగులతో భీకర ఫామ్‌లోనే ఉన్నా, ఐపీఎల్‌లో మాత్రం ఘోరంగా విఫలమయ్యాడు.

పాండ్యాపై కీలక నిర్ణయం!

రోహిత్, ద్రవిడ్, అగార్కర్ భేటీ

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనే భారత జట్టు ఎంపికపై సెలెక్టర్లు సమాలోచనలు ఆరంభించినట్టు సమాచారం. ఇటీవలే బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కోచ్ రాహుల్ ద్రవిడ్‌లతో రోహిత్ శర్మ సమావేశమైనట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా విషయంలో కీలక నిర్ణయం తీసుకొన్నారట. ఐపీఎల్‌లో ఎలా బౌలింగ్ చేస్తాడనే దానిపైనే పాండ్యాకు జట్టులో చోటు కల్పించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. పాండ్యా.. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో 11 ఓవర్లు వేసి మూడు వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.

గుజరాత్ X ఢిల్లీ

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
361 పరుగులు	12 వికెట్లు

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి అండ్ బి) అవేశ్ 10, నరైన్ (బి) బౌల్ట్ 109, రఘువంశీ (సి) అశ్విన్ (బి) కుల్దీప్ సేన్ 30, శ్రేయాస్ (ఎల్బీ) చాహల్ 11, రస్సెల్ (సి) జురెల్ (బి) అవేశ్ 13, రింకూ (నాటౌట్) 20, వెంకటేశ్ (సి) జురెల్ (బి) కుల్దీప్ సేన్ 8, రమణ్‌దీప్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 20 ఓవర్లలో 223/6; వికెట్ల పతనం:** 1-21, 2-106, 3-133, 4-184, 5-195, 6-215; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-31-1, అవేశ్ ఖాన్ 4-0-35-2, కుల్దీప్ సేన్ 4-0-46-2, చాహల్ 4-0-54-1, అశ్విన్ 4-0-49-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) వెంకటేశ్ (బి) అరోరా 19, బట్లర్ (నాటౌట్) 107, శాంసన్ (సి) నరైన్ (బి) హర్షిత్ 12, రియాన్ (సి) రస్సెల్ (బి) హర్షిత్ 34, ధ్రువ్ జురెల్ (ఎల్బీ) నరైన్ 2, అశ్విన్ (సి) రఘువంశీ (బి) వరుణ్ 8, హెట్‌మయెర్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 0, పావెల్ (ఎల్బీ) నరైన్ 26, బౌల్ట్ (రనౌట్) 0, అవేశ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 20 ఓవర్లలో 224/8; వికెట్ల పతనం:** 1-22, 2-47, 3-97, 4-100, 5-121, 6-121, 7-178, 8-186; **బౌలింగ్:** స్టార్క్ 4-0-50-0, వైభవ్ అరోరా 3-0-45-1, హర్షిత్ 4-0-45-2, నరైన్ 4-0-30-2, వరుణ్ 4-0-36-2, రస్సెల్ 1-0-17-0.

రెండో స్థానానికి గుకేశ్



టొరొంటో: క్యాండిడేట్స్ చెస్‌లో నెపోమ్నియాచి (రష్యా)తో జరిగిన పదో రౌండ్ గేమ్‌ను భారత జీఎం గుకేశ్ డ్రా చేసుకున్నాడు. ఈ రౌండ్ అనంతరం ఇరువురు 6 పాయింట్లతో సమానంగా నిలిచినా, మెరుగైన టైబ్రేక్ స్కోరుతో నెపో టాప్‌లో, గుకేశ్ రెండో స్థానంలో ఉన్నారు. ప్రజ్ఞానంద-విదిత్, హంపి-టాన్ జాంగీ (చైనా) మధ్య గేమ్‌లు డ్రాగా ముగియగా, సాలిమోవా (బల్గేరియా) చేతిలో వైశాలి ఓటమిపాలైంది. ప్రజ్ఞానంద 5వ, విదిత్ 6వ స్థానంలో.. మహిళల్లో హంపి 5వ వైశాలి, 8వ స్థానాల్లో కొనసాగుతున్నారు.

బిజినెస్

వడ్డీ రేట్ల తగ్గింపు ఇప్పట్లో లేనట్టే

మోర్గాన్ స్టాన్లీ ఇండియా

న్యూఢిల్లీ: దేశంలో కీలక వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. అసలు ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రెపో రేటును ప్రస్తుత 6.5 శాతం నుంచి తగ్గించే అవకాశమే లేదని బ్రోకరేజీ సంస్థ మోరాన్ స్టాన్లీ ఇండియా తన తాజా నివేదికలో తెలిపింది. జీడీపీ వృద్ధి రేటు జోరు మీద ఉండడం, అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడ్ రిజర్వ్' జూన్‌లో కూడా కీలక వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం లేకపోవడం ఇందుకు ప్రధాన కారణమని మోర్గాన్ స్టాన్లీ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త ఉపాసన చక్ర, ఆర్థికవేత్త బనీ గంబీర్ తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ రెండు కారణాలతో ప్రస్తుత అధిక రెపో రేటు కొనసాగించడమే మేలని ఆర్‌బీఐ భావిస్తున్నట్టు వీరు తెలిపారు. అమెరికాలోనూ ప్రస్తుతం ద్రవ్యోల్బణం అధికంగా ఉండటంతో పాటు వృద్ధి రేటు కూడా అధికంగా ఉన్న విషయాన్ని వారు గుర్తు చేశారు.

ఈ ఏడాది వృద్ధి 6.8 శాతం

అంచనాలు పెంచిన ఐఎంఎఫ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) 2024 సంవత్సరంలో భారత వృద్ధి రేటు అంచనాను జనవరిలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచింది. వస్తు సేవలకు అంతర్గత డిమాండ్ బలంగా ఉండడంతో పాటు పనిచేసే వయసులోని జనాభా పెరగడం ఇందుకు కారణమని తాజా నివేదికలో తెలిపింది. ఈ వృద్ధి రేటుతో భారత్ ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని కూడా పేర్కొంది. చైనా వృద్ధి 4.6 శాతంగా అంచనా వేసింది. అయితే వర్ధమాన ఆసియా ఆర్థిక వ్యవస్థల్లో వృద్ధి రేటు 2023 సంవత్సరంలోని 5.6 శాతం నుంచి ఈ ఏడాది 5.2 శాతానికి, 2025 నాటికి 4.9 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. ప్రపంచ వృద్ధి కూడా 2023 నాటి 3.2 శాతం స్థాయిలోనే కొనసాగవచ్చని పేర్కొంది.

రెండేళ్లలో రూ.1,000 కోట్ల టర్నోవర్

ది స్లీప్ కంపెనీ టార్గెట్

హైదరాబాద్: కంఫర్ట్- టెక్ బ్రాండ్, స్లీపింగ్ సొల్యూషన్స్ సంస్థ ది స్లీప్ కంపెనీ.. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమవుతోంది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా కంపెనీ హైదరాబాద్‌లో 75వ స్టోర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ది స్లీప్ కంపెనీ సహ వ్యవస్థాపకురాలు ప్రియాంక సలోట్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది కాలంలో మొత్తం స్టోర్ల సంఖ్యను 200కు చేర్చాలని నిర్ణయించినట్లు చెప్పారు. మెట్రో నగరాలతో పాటు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఈ స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 12 స్టోర్లను నిర్వహిస్తోందని, ఇందులో 8 స్టోర్లు హైదరాబాద్‌లో ఉండగా మిగిలిన స్టోర్లు విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, వరంగల్ నగరాల్లో ఉన్నాయన్నారు. విస్తరణలో భాగంగా వచ్చే ఏడాది మార్చి నాటికి తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 16 స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రియాంక వెల్లడించారు. దేశీయ మ్యాట్రెసెస్ మార్కెట్ రూ.16,000 కోట్లుగా ఉండగా అందులో బ్రాండెడ్ కంపెనీల వాటా రూ.6,000 కోట్లుగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.360 కోట్లుగా ఉందని, వచ్చే రెండేళ్ల కాలంలో ఇది రూ.1,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు ప్రియాంక తెలిపారు. కాగా కంపెనీ మొత్తం రెవెన్యూలో తెలుగు రాష్ట్రాల వాటా 15 శాతంగా ఉందని పేర్కొన్నారు.

కిమ్స్ అనుబంధ సంస్థకు ఐటీ నోటీస్

రూ.307 కోట్లు చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్: కిమ్స్ హాస్పిటల్ అనుబంధ సంస్థ స్పాన్‌వీ మెడిసెర్చ్ లైఫ్‌సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆదాయ పను (ఐటీ) శాఖ నుంచి రూ.306.97 కోట్ల పన్ను చెల్లింపు కోసం డిమాండ్ నోటీసు అందింది. 2022-23 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి ఈ డిమాండ్ నోటీస్ అందుకున్నట్లు కిమ్స్ తెలిపింది. సంబంధిత అసెస్‌మెంట్ ఇయర్‌లో కంపెనీ అందుకున్న షేర్ క్యాపిటల్, షేర్ ప్రీమియం వివరాలు, అన్‌సెక్యూర్డ్ లోన్ చెల్లింపు వివరాలు సరిగా సమర్పించక పోవడంతో ఈ నోటీస్ అందినట్లు కిమ్స్ హాస్పిటల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఆ అసెస్‌మెంట్ ఇయర్‌లో స్పాన్‌వీ తమ అనుబంధ సంస్థ కాకపోవడంతో, ఈ పన్ను డిమాండ్ నోటీస్ ప్రభావం తమపై ఏ మాత్రం పడదని కిమ్స్ హాస్పిటల్ తెలిపింది.

22న మోదీతో మస్క్ భేటీ!

అనంతరం టెస్లా ఎంట్రీపై ప్రకటన



న్యూఢిల్లీ: ఈ నెల 21న భారత్‌కు రానున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్.. ఆ మరుసటి రోజున (22) ప్రధాని మోదీతో భేటీ కానున్నారని సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. అనంతరం తన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా భారత ప్రవేశంపై మస్క్ అధికారిక ప్రకటన చేయవచ్చన్నారు. అయితే, టెస్లా ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేయబోతున్నదన్న విషయంపై స్పష్టత రాకపోవచ్చన్నారు. ఎందుకంటే, ఈ విషయాన్ని ప్రకటించేందుకు టెస్లా బోర్డు అనుమతి అవసరం. అది ఇప్పటికిప్పుడే సాధ్యపడకపోవచ్చని సీనియర్ అధికారి పేర్కొన్నారు.

టెస్లా వంటి అంతర్జాతీయ ఈవీ కంపెనీలకు మార్గం సుగమం చేసేందుకు గత నెలలో కేంద్ర ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని ప్రకటించింది. కనీసం 50 కోట్ల డాలర్ల (సుమారు రూ.4,150 కోట్లు) పెట్టుబడితో భారత్‌లో ఈవీల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే గ్లోబల్ కంపెనీలకు ప్రభుత్వం దిగుమతి సుంకం రాయితీలు కల్పించనుంది. కంపెనీకి అనుమతి మంజూరు చేసిన తేదీ నుంచి ఐదేళ్ల వరకు 35,000 డాలర్లు (రూ.29 లక్షలు) అంతకు పైగా విలువ చేసే కార్లను 15 శాతం కస్టమ్స్ సుంకం చెల్లించి దిగుమతి చేసుకునేందుకు అనుమతించనున్నారు. ప్రస్తుతం కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ) కార్ల దిగుమతిపై చెల్లించాల్సిన కస్టమ్స్ సుంకం.. ఇంజన్ సైజు, ధర, బీమా, రవాణా విలువ ఆధారంగా 70-100 శాతం స్థాయిలో ఉంది.

పరిశీలనలో స్టార్‌లింక్ దరఖాస్తు

టెస్లాతో పాటు తన శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సర్వీస్ కంపెనీ స్టార్‌లింక్ సేవల ప్రారంభంపైనా మస్క్ ప్రకటన చేయవచ్చన్న అంచనాలున్నాయి. భారత్‌లో శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ స్టార్‌లింక్ సమర్పించిన దరఖాస్తు ప్రస్తుతం పరిశీలన దశలో ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కంపెనీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో పాటు ఇతర ఆర్థిక ప్రతిపాదనలు టెలికాం, సమాచార సేవల శాఖ నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని, ప్రస్తుతం భద్రత పరమైన అంశంపై గృహ మంత్రిత్వ శాఖ సమీక్ష జరుగుతోందన్నారు. మస్క్ భారత పర్యటనకు ముందే (ఈ వారాంతంలోగా) స్టార్‌లింక్‌కు అనుమతి మంజూరు చేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి. దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న తరుణంలో.. మళ్లీ ఎన్‌డీయేనే అధికారం రావచ్చన్న అంచనాలున్న నేపథ్యంలో మస్క్ భారత పర్యటన రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

'టాటా'తో టెస్లా డీల్

సెమీకండక్టర్ల (చిప్‌లు) సమీకరణ కోసం టాటా ఎలక్ట్రానిక్స్‌తో టెస్లా వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ రెండు కంపెనీల మధ్య ఒప్పందం కొన్ని నెలల క్రితమే జరిగిందని, టెస్లా తన సరఫరాదారుల వివరాలను రహస్యంగా ఉంచుతుందని ఓ ఆంగ్ల దిన పత్రిక కథనం పేర్కొంది. కొవిడ్ సంక్షోభం తర్వాత కార్ల తయారీకి అవసరమైన విడిభాగాలు, ఇతర పరికరాల సమీకరణ విషయంలో టెస్లా వ్యూహాన్ని మార్చుకుంది. కేవలం చైనాపైనే ఆధారపడకుండా ఇతర దేశాల కంపెనీల నుంచీ వీటిని సమీకరిస్తోంది. అందులో భాగంగానే టాటా ఎలక్ట్రానిక్స్‌తో ఒప్పందం జరిగినట్లు సమాచారం. కాగా, టెస్లాకు భారత్‌లో ఇప్పటికే కనీసం 8 మంది సరఫరాదారులున్నారని, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్, సుప్రజిత్ ఇంజనీరింగ్, సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్, వర్రోక్ ఇంజనీరింగ్, బాష్ లిమిటెడ్, హిండాల్కో ఇండస్ట్రీస్, గుడ్‌లక్ ఇండియా, వాలియంట్ కమ్యూనికేషన్స్ ఈ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. భారత సరఫరాదారుల నుంచి టెస్లా ఏటా 100-200 కోట్ల డాలర్ల విలువైన వాహన పరికరాలు, ఇతర ఉత్పత్తులను సేకరిస్తోందన్న అంచనాలున్నాయి.

సరికొత్త కార్టన్ ప్యాక్స్‌లో 'హెరిటేజ్' ఉత్పత్తులు

హైదరాబాద్: హెరిటేజ్ ఫుడ్స్ పానీయాలు సరికొత్త కార్టన్ ప్యాక్స్‌లో లభించనున్నాయి. ఇందుకోసం కంపెనీ ఎస్ఐజీ అనే కంపెనీకి చెందిన అధునాతన టెక్నాలజీని అందుకుంటోంది. ఇప్పటికే ఈ టెక్నాలజీ మెషిన్లను హెరిటేజ్ ఫుడ్స్ తన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ప్లాంట్‌లో ఉపయోగిస్తోంది. ఈ అధునాతన మెషిన్ సాయంతో గంటకు 12,000 ప్యాక్స్‌లో పానీయాలు నింపవచ్చు. ఒకేసారి వివిధ రకాల సైజుల ప్యాక్స్‌లో పానీయాలు నింపడం ఈ మెషిన్ ప్రత్యేకత. ఈ మెషిన్ ద్వారా నింపే ప్యాక్స్‌లో సూక్ష్మ జీవులుగానీ, క్రిమి కీటకాలుగానీ చొరబడలేవని హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది.

కీపాయింట్ టెక్నాలజీ ప్రాడక్ట్‌కు పేటెంట్

హైదరాబాద్: కీపాయింట్ టెక్నాలజీస్ కంపెనీ అభివృద్ధి చేసిన కాంటెక్స్చువల్ డిస్కవరీ టెక్నాలజీకి భారత పేటెంట్ కార్యాలయం (ఐపీఓ) పేటెంట్ మంజూరు చేసింది. ఇది తమ కంపెనీ చరిత్రలో ప్రధాన మైలురాయి అని కంపెనీ తెలిపింది. కీపాయింట్ టెక్నాలజీస్ ఇప్పటికే కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ఎన్ఎల్‌పీ, ఇన్‌పుట్, లాంగ్వేజ్ టెక్నాలజీ రంగాల కోసం అనేక పేటెంటెడ్ ప్రాడక్ట్‌లను అభివృద్ధి చేసింది.

'అవేరా' ఈవీ చార్జింగ్ స్టేషన్లు

విజయవాడ (ఆంధ్రజ్యోతి): విజయవాడ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రికల్ స్కూటర్ల (ఈవీ) తయారీ సంస్థ 'అవేరా' దేశవ్యాప్తంగా చార్జింగ్ స్టేషన్స్‌ను ఏర్పాటు చేసేందుకు రెడీ అవుతోంది. ఇందుకోసం చైనాకు చెందిన ఫ్రాంక్ మోరీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. చైనాలో జరుగుతున్న కాంటన్ ఫెయిర్-2024లో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు అవేరా ఎండీ, ఆకుల వెంకట రమణ, సీఈఓ చాందినీ చందన తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఈ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,130 ▲	67,950 ▲	90,500 ▲
ముంబై	73,302 ▲	67,145 ▲	83,213 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ

హైదరాబాద్	405	విజయవాడ	404
చిత్తూరు	483	విశాఖపట్నం	419
గోదావరి	404	వరంగల్	407

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	128	గోదావరి	129
వరంగల్	128	విజయవాడ	129
కరీంనగర్	128	గుంటూరు	129
మహబూబ్‌నగర్	128	ఒంగోలు	129
కర్నూలు	128	చిత్తూరు	132
విశాఖపట్నం	116		

3 రోజుల్లో రూ. 8 లక్షల కోట్లు ఫట్

- భారీగా తరిగిన మార్కెట్ సంపద
- సెన్సెక్స్ మరో 456 పాయింట్లు డౌన్

ముంబై: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రెండ్ నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. ఐటీ షేర్లలో అమ్మకాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా మంగళవారం సెన్సెక్స్ మరో 456.10 పాయింట్లు క్షీణించి 72,943.68 వద్దకు జారుకుంది. ఒకదశలో సూచీ 714.75 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, చివర్లో మళ్లీ కోలుకుంది. నిఫ్టీ విషయానికొస్తే, 124.60 పాయింట్ల నష్టంతో 22,147.90 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 23 నష్టపోగా.. ఇన్ఫోసిస్ షేరు 3.65 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని ఐటీ, టెక్ సూచీలు రెండు శాతానికి పైగా క్షీణించాయి. కాగా, గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,094.47 పాయింట్లు (2.79 శాతం) నష్టపోయింది. దాంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3 రోజుల్లో రూ.7.93 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.394.26 లక్షల కోట్లకు (4.75 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఐపీఓకు నెఫ్రో కేర్: హెచ్‌డీఎఫ్‌సీ మాజీ చైర్మన్ దీపక్ పరేఖ్ సహా పలువురు కార్పొరేట్ ప్రముఖుల పెట్టుబడులు కలిగిన కిడ్నీ సంరక్షణ సేవల సంస్థ నెఫ్రో కేర్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకోసం ఎన్ఎస్ఈలోని స్మాల్, మీడియం కంపెనీ లిస్టింగ్ వేదికైన ఎన్ఎస్ఈ ఎమర్జ్‌కు ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా 45.84 లక్షల తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులతో కోల్‌కతాలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

రికార్డు కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ విలువ రికార్డు కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు క్షీణించి 83.61 వద్ద ముగిసింది. ఈ మార్చి 22న కూడా డాలర్-రూపీ మారకం రేటు ఇదే స్థాయి వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా మిగతా కరెన్సీలతోనూ పోల్చినా డాలర్ బలపడటంతోపాటు అంతర్జాతీయ ప్రతికూలతలు, మన ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడం వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి.

నేడు మార్కెట్లకు సెలవు


శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం (17వ తేదీ) స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. మళ్లీ గురువారం (18న) మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 17-4-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇదీ.. రాముడంటే!
ధర్మం, న్యాయం, కరుణ, స్వీయ నియంత్రణ, మాటకు కట్టుబడటం, ధైర్యం, పరాక్రమం, విలువలు

ఇదీ రామరాజ్యం
సత్యం, సత్వర న్యాయం, వివక్షకు తావులేని సమానత్వం, క్రమశిక్షణ, సుఖ సంతోషాలు

(రేపటి నుంచి 'ఆంధ్రజ్యోతి' ఎన్నికల ప్రత్యేక కథనాలు)



రాముడు చూపిన బాట!

మాట కోసం రాజ్యాన్నే త్యజించేంత ధర్మాత్ముడు...
సతి కోసం ఒక యుద్ధం చేసేంత సత్యసంధుడు...
కోట్లలో ఒక్కడు ఏదో వాగాడని వదిలేయకుండా.. ఆ ఒక్కడి మాటకూ విలువనిచ్చిన విశిష్టమైన పాలకుడు!
ప్రజా బాంధవుడు... ఆదర్శ పాలకుడు! ఇన్ని సులక్షణాల సుగుణాభి రాముడి కథ విన్నాం! చేసిన ప్రమాణాలు విడచిపెట్టి... కాసుల కోసం విలువలు వదిలిపెట్టి... కక్షలే లక్ష్యంగా గురిపెట్టి... స్వార్థం కోసం రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసే నేటి పాలకులనూ చూస్తున్నాం! కలి కాలంలో పాలకులే పాతకులవుతారని ఊహించాడు కాబోలు... వివిధ సందర్భాల్లో పాలకులు, పాలన ఎలా ఉండాలో ఆ రాముడే స్వయంగా త్రేతా యుగంలో వివరించాడు. సుగ్రీవుడికి, భరతుడికీ ధర్మ పాలన గురించి వివరించాడు. ఆ రాముడి మాటలను ఈ 'నవమి' నాడు గుర్తుతెచ్చుకుందాం! సరైన పాలకుడినే ఎన్నుకుందాం!

* రాజ్యం తనదే అయినప్పటికీ... 'ఇష్టారాజ్యం' కుదరదు. పాలకుడికి ఉండాల్సిన ప్రధాన లక్షణాలు.. ధర్మ రక్షణ, సత్యపాలన! తాను ధర్మాన్ని పాటించాలి. ప్రజలనూ ధర్మ మార్గంలో నడిపించాలి.
* రాజుకు అహంకారం ఉండకూడదు. అబద్ధాలు ఆడకూడదు. సంయమనంతో మెలగాలి. కాలయాపన కూడదు. అజ్ఞానులకు ప్రాధాన్యమిచ్చి వారి సలహాలు వినడం సరికాదు. అసమర్థులు, వ్యామోహపరులు, అవినీతిపరులను మంత్రులుగా నియమించుకోకూడదు.
* విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు సత్వరం చక్కదిద్దడం పాలకుల విధి. వ్యాపారాలు, వృత్తులను ప్రోత్సహించాలి.
* ప్రజలను బాధించి పన్నులు వసూలు చేయకూడదు. దయ, ధర్మంతో ఆలోచించి పన్నులు వేయాలి.
* ప్రజలకు అందుబాటులో ఉండాలి. పారదర్శకత పాటించాలి. పాలకుడిగా తాను జరిపే చర్చలు, తీసుకునే నిర్ణయాలను ప్రజలకు తెలియజేయాలి.

జగన్ సేవలో జవహర్!



ఈసీ ఆదేశాలు, కేంద్రం ఉత్తర్వులూ బేఖాతర్

- అంతా మా ఇష్టమంటున్న సీఎస్ జవహర్ రెడ్డి
- 'రెవెన్యూ ఇంటెలిజెన్స్'కు రాజేశ్వర్ రెడ్డే కావాలట
- ఆయనను వెనక్కి పంపాలని కేంద్రం ఆదేశాలు
- 'కీలక సమయం'లో కష్టమంటూ జవహర్ జవాబు
- సచివాలయ ఉద్యోగ నేత వెంకట్రామిరెడ్డికి రక్షణ
- పొలిటికల్ ప్రచారం చేస్తూ దొరికిపోయినా అంతే
- సస్పెండ్ చేయాలని ఈ నెల 8న ఈసీ ఆదేశం
- ఫైలు తొక్కిపెట్టిన సీఎస్ జవహర్ రెడ్డి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందంటే.. ఈసీ చెప్పినట్లు వినాల్సిందే. ఈసీ ఆదేశాలు పాటించాల్సిందే. కేంద్రం సూచనలు, ఉత్తర్వులను అమలు చేయాల్సిందే. కానీ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి తీరే వేరు! ఆయన ఇప్పటికీ జగన్నామ స్మరణ చేస్తూనే ఉన్నారు. గీత దాటి మరీ జగన్ సేవ చేస్తున్న 'అక్రమార్కులను' కాపాడుతున్నారు. 'మనోడైతే చాలు, వైసీపీకి రాజకీయంగా పనికొస్తారనుకుంటే చాలు'... వారి మీద ఈగ కూడా వాలనివ్వడం లేదు. ఆదేశాలిచ్చింది ఈసీ అయినా.. కేంద్రం అయినా.. రాష్ట్రంలో ఉన్న వైసీపీ బాస్ ఆదేశాలే తనకు శిరోధార్యమన్నట్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. విపక్ష నేతల వ్యాపారాలే లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్న రాష్ట్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ స్పెషల్ కమిషనర్ చిలకల రాజేశ్వర్ రెడ్డి డిప్యూటేషన్‌ను రద్దు చేసి, తిరిగి తమ సేవలకు పంపించాలని కేంద్రం ఆదేశించినా సీఎస్

మిగతా 9వ పేజీలో...

'మద్యం మాస్టర్' వాసుదేవరెడ్డిపై వేటు!



- బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీపై ఈసీ చర్యలు
- డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి రప్పించిన జగన్
- గడువు ముగిసినా కొనసాగింపు
- మద్యం సేల్స్ బాధ్యతలు అప్పగింత
- డిస్టిలరీలు, డిపోలు, షాపులపై అజమాయిషీ
- తొలి నుంచీ వైసీపీ సేవలోనే
- ఎన్నికల వేళ మరింత బరితెగింపు
- అధికార పార్టీకి అడిగినంత మద్యం
- ఈసీకి ఫిర్యాదులతో తప్పించాలని ఆదేశాలు

9

సలహాదారులకూ కోడ్ వర్తిస్తుంది

- నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ

11

టీడీపీ కూటమికి 20 ఎంపీ సీట్లు!

- ఇందులో బీజేపీకి 5 దక్కే చాన్సు
- వైసీపీకి 5 స్థానాలకు మించి రావు
- ఏబీపీ-సీవోటర్ సర్వే

12

రేపటి నుంచే నామినేషన్లు

రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జారీకానున్న నోటిఫికేషన్



11

జగన్‌కు ఏమని చెప్పావ్ అవినాశ్?



- వివేకాది గుండెపోటు అని చెప్పావా?
- హత్యకు గురయ్యారని చెప్పావా?
- అక్కడి దృశ్యం చూస్తే గుండెపోటు కాదని తెలుస్తుంది
- హత్య అంటే డీజీపీని జగన్ అలర్ట్ చేయాలి కదా!
- మీ ఫోన్ తీసుకెళ్లి సీబీఐకి ఇవ్వండి.. కడిగిన ముత్యంలా బయటకు వస్తారు కదా!
- వివేకా గురించి ఏనాడైనా మంచిగా రాశారా?.. అన్ని ఆధారాలూ ఉన్నాయి
- రాజకీయంగా అడ్డుకోవడంవల్లే దర్యాప్తులో జాప్యం.. వైఎస్ సునీత ధ్వజం

12

గులకరాయి కేసులో హైడ్రామా!

పోలీసుల అదుపులో ఐదుగురు మైనర్లు

- ఒకరు దాడి చేశారు.. మిగతా నలుగురు పక్కన ఉన్నారు.. పోలీసుల లీకులు
- అధికారికంగా సమాచారమివ్వని వైనం.. రోడ్డెక్కి తల్లిదండ్రుల నిరసనలు
- మా బిడ్డలకు ఏ పాపమూ తెలియదు.. జెండాలు పట్టుకుంటే 200 ఇస్తామన్నారు
- నేతల మాటలు విని పిల్లలనూ తీసుకెళ్లాం.. మైనర్ల తల్లిదండ్రుల వెల్లడి
- కేసులు పెడతామని పోలీసుల బెదిరింపులు.. దీంతో ఆందోళన విరమణ
- మరో 'కోడి కత్తి' కేసుగా మారుస్తారేమోనని అనుమానం

విజయవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గులకరాయి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. నిందితుల ఆచూకీ, ఘటనకు సంబంధించిన వీడియోలు అందజేసిన వారికి రూ.2 లక్షల నజరానాను ప్రకటించిన మర్నాడే కేసుతో సంబంధం ఉందంటూ బెజవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని వడ్డెర కాలనీకి చెందిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మైనర్లే. వయసు 15-17 ఏళ్ల మధ్య ఉంటుంది. వీరిలో

మిగతా 11వ పేజీలో...



వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఏడాదిన్నర జైలు

దళితుల శిరోముండనం కేసులో 27 ఏళ్ల తర్వాత ప్రత్యేక కోర్టు తీర్పు

- మరో ఎనిమిది మందికి కూడా 18 నెలల జైలుశిక్ష
- రూ.42 వేల చొప్పున జరిమానా
- బాధితులకు లక్షన్నర చొప్పున పరిహారానికి ఆదేశం
- తాత్కాలిక బెయిల్.. హైకోర్టులో అప్పీలు చేస్తాం: తోట
- శిరోముండనం కేసులో అడుగడుగునా సంచలనాలే!

9

జమ కాని 'జగనన్న విద్యాదీవెన'..

విద్యార్థిని తల్లి ఆత్మహత్యాయత్నం

- హాల్ టికెట్ ఇవ్వని కళాశాల యాజమాన్యం
- మెడకు చున్నీ బిగించుకుని కళాశాల వరండాలోనే అఘాయిత్యం.. అడ్డుకున్న విద్యార్థులు, సిబ్బంది
- విశాఖ పీఎం పాలెంలో సంఘటన

10

మీరు అమాయకులేం కాదు

- వారం రోజుల్లో బహిరంగ క్షమాపణలు చెప్పండి
- రాందేవ్ బాబా, బాలకృష్ణపై సుప్రీం మళ్లీ ఆగ్రహం

10

ఇక.. ఎండ ప్రచండమే!

మరో నాలుగు రోజులు తీవ్ర వడగాడ్పులు

8

అనన్య ప్రతిభ

సివిల్స్‌లో మూడో ర్యాంకు సాధించిన తెలుగు బిడ్డ

- స్వీయ సన్నద్ధత, తొలి ప్రయత్నంలోనే సత్తా చాటిన పాలమూరు యువతి
- టాప్ 10లో ఆరు ర్యాంకులు మహిళలవే.. సాయికిరణ్‌కు 27, జాహ్నవికి 50వ ర్యాంకు
- తెలుగు రాష్ట్రాలకు చెందిన 40 మందికిపైగా ఎంపిక.. ఏపీ డిప్యూటీ కలెక్టర్‌కు 198వ ర్యాంకు
- టాపర్.. ఉత్తరప్రదేశ్ యువకుడు శ్రీవాత్సవ.. రెండోస్థానంలో ఒడిశా యువకుడు అనిమేష్
- కేరళకు చెందిన సిద్ధార్థ్‌కు నాలుగో ర్యాంకు.. యూపీఎస్సీ ప్రకటన.. 1,016 మంది ఎంపిక
- రోజుకు 12 నుంచి 14 గంటలు చదివా.. నా చిన్ననాటి కల నెరవేరింది: అనన్య

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అఖిల భారత సర్వీసుల్లో నియామకాలకు నిర్వహించిన సివిల్స్‌లో తెలుగు బిడ్డ దోనూరు అనన్యరెడ్డి సత్తా చాటారు. జాతీయ స్థాయిలో మెరిశారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన దోనూరు అనన్యరెడ్డి మూడో ర్యాంకు సొంతం చేసుకున్నారు. అంతేకాదు, అనన్యరెడ్డి స్వీయ సన్నద్ధతతో తొలి ప్రయత్నంలోనే ఈ ర్యాంక్ సాధించడం విశేషం. ఇక, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ 27, కేఎన్ చందన జాహ్నవి 50, జనగామ జిల్లా యువకుడు మెరుగు కౌశిక్ 82వ ర్యాంకులు సాధించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసిన సివిల్స్-23 తుది ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 40 మందిపైగా అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ప్రత్యూష 198వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్య శ్రీవాత్సవ సివిల్స్ టాపర్‌గా నిలిచారు. అనిమేశ్ ప్రధాన్(ఒడిశా) 2వ, పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్(కేరళ) 4వ, రుహానీ(హరియాణ) 5వ ర్యాంకు సాధించారు. సృష్టి దబాస్(ఢిల్లీ) 6వ, అన్మోల్‌రాథోడ్(కశ్మీర్) 7వ, ఆశిష్ కుమార్(8), నౌషీన్(9), ఐశ్వర్యం ప్రజాపతి(10) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. టాప్-10లో

మిగతా 8వ పేజీలో...


అనన్య (3వ ర్యాంక్)

సివిల్స్‌లో స్వీయ కృషి!

- ఇంట్లోనే చదివి ర్యాంకు కొట్టిన పలువురు రాష్ట్ర అభ్యర్థులు
- మెకానిక్ కుమారుడికి 202వ ర్యాంకు

8

సీఐ అవమానించడంతో.. ఉద్యోగానికి రాజీనామా



- నాలుగో ప్రయత్నంలో 780వ ర్యాంక్
- కానిస్టేబుల్ ఉదయకృష్ణారెడ్డి విజయగాథ


శంకర్‌రావు (ఫైల్)


అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన అటవీ ప్రాంతం


గాయపడిన పోలీస్

అబూజ్‌మడ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

29 మంది నక్సల్స్ మృతి

నక్సల్స్ చరిత్రలోనే భారీ ప్రాణనష్టం!

- మృతుల్లో డీవీసీఎం నేత శంకర్‌రావు.. ఆయన భార్య సుమన కూడా!
- శంకర్‌రావుపై రూ.10 లక్షల రివార్డు.. ఆయన స్వస్థలం భూపాలపల్లి జిల్లా
- మావోయిస్టులు వినోద్ బాష్టే, లలిత, మాధవి, రాజు మృతదేహాల గుర్తింపు
- వీరిపైనా 10 లక్షల రివార్డులు.. నక్సల్స్ కాల్పుల్లో ఇద్దరు పోలీసులకు గాయాలు
- హెలికాప్టర్‌లో రాయ్‌పూర్ ఆస్పత్రికి.. ఆపరేషన్‌కు తెలుగు అధికారి నేతృత్వం
- ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ తుపాకులు సీజ్.. ఎన్నికల్లో విధ్వంసానికి కుట్రలు
- సకాలంలో సమాచారం, కూంబింగ్.. మృతదేహాలను ఇంకా తరలించాల్సి ఉంది
- భారీ ఎన్‌కౌంటర్ వివరాలు వెల్లడించిన కాంకేర్ సీనియర్ ఎస్పీ కల్యాణ్
- నెల వ్యవధిలో 54 మంది నక్సల్స్.. గడిచిన మూడున్నర నెలల్లో 79 మంది మృతి

చర్ల, ఏప్రిల్ 16: దండకారణ్యం మరోమారు నెత్తురోడింది. ఒకప్పుడు గూగుల్ మూడోకంటికి కూడా అందని విధంగా.. నక్సల్స్‌కు కంచుకోటగా ఉన్న అబూజ్‌మడ్‌లో మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు ఉన్నారు. ఆయన భార్య, ఆదిలాబాద్ జిల్లా హత్నూర్‌కు చెందిన దాసర్వార్ సుమన అలియాస్ రజిత కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్‌కుమార్, కాంకేర్ సీనియర్ ఎస్పీ

మిగతా 10వ పేజీలో...

మూసివేత దిశగా విశాఖ ఉక్కు!

- రెండు కోక్ ఓవెన్లలో జీరో ఉత్పత్తి.. 3 బ్లాస్ట్ ఫర్నేసుల్లో 2 మూసివేత
- రోజుకు 20 వేల టన్నుల ఉత్పత్తి.. ఇప్పుడు అవుతున్నది 5 వేల టన్నులే
- రెండు రోజుల్లో బొగ్గు సరఫరా కాకపోతే ప్లాంటు మూతే
- అదానీ గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన ఫలితం

9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గుట్టువిప్పింది ఎవరు?

ఎన్నికలబాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యతిరేకమైనదిగా ప్రకటించి, రద్దుచేసిన తరువాత, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ పథకాన్ని వెనకేసుకొస్తూ వ్యాఖ్యానించడం ఇది రెండోసారి. సుప్రీంకోర్టులో వాదోపవాదాలు సాగుతున్నప్పుడూ, చివరకు తీర్పు వెలువడిన తరువాత కూడా బీజేపీ నాయకులు ఈ పథకాన్ని మించినదేదీలేదని అంటూనే ఉన్నారు. తీర్పువచ్చిన రోజు రవిశంకర్ ప్రసాద్ విలేఖరులతో చేసిన వ్యాఖ్యలు వినగానే విపక్షకాంగ్రెస్‌కు అనుమానం వచ్చి, కొత్త కుట్రలకు తెరదీయకండి అని హెచ్చరించింది కూడా. అయినా కూడా అనంతరం ఆ దిశగా కొన్ని ప్రయత్నాలు జరిగిన మాట అటుంచితే, నితిన్‌గడ్కరీ, అమిత్‌షా ఇత్యాది మంత్రుల వరుసలోనే ప్రధానమంత్రి కూడా రద్దయిన ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని మెచ్చుకుంటూ రెండు ఇంటర్వ్యూల్లో సుప్రీం కోర్టు తీర్పును పరోక్షంగా తప్పుబట్టారు. దేశాన్ని మళ్ళీ నల్లధనంలోకి నెట్టేశామని వాపోయారు, రాబోయేరోజుల్లో ప్రతీ ఒక్కరూ పశ్చాత్తాపపడాల్సి వస్తుందని శపించారు.

రేపటిరోజుల్లో నిజాయితీగా, గుండెలమీద చేయివేసుకొని ఆలోచిస్తే, ఈ పథకం రద్దయినందుకు ఈ దేశంలోని ప్రతీ ఒక్కరూ ఎంతో బాధపడేరోజులు వస్తాయట. ప్రతిపక్షాలను అడ్డుపెట్టుకొని ఈ పథకం రద్దుమీద ఆయన చేసిన విమర్శలన్నీ ఒక విధంగా సుప్రీంకోర్టును దృష్టిలో పెట్టుకొని చేసినవే. ఎన్నికలబాండ్లు ఉన్నందువల్లనే డబ్బు ఎవరినుంచి ఎవరికి చేరుతున్నదో తెలుస్తున్నదని, అవి లేనప్పుడు ధనప్రవాహం గతిని ఎవరైనా తేల్చిచెప్పగలరా? అని ఆయన మొన్న ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో ఓ ప్రశ్న వేశారు. గతంలో ఒక తమిళచానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సైతం ఆయన తాను ఈ బాండ్ల పథకాన్ని తెచ్చినందువల్లనే రాజకీయ విరాళాల మూలాలు, ముచ్చట్లు తెలుస్తున్నాయని అన్నారు. కానీ, ఆ గుట్టు విప్పింది సుప్రీంకోర్టే తప్ప, తాను తెచ్చిన పథకం దాతలు స్వీకర్తల వివరాలు రహస్యంగా ఉంచేందుకే తయారైందని ఆయనకు మాత్రం తెలియదా? ప్రజలకే కాదు, చివరకు ఎన్నికల సంఘానికి కూడా దాతల వివరాలు రహస్యమే. బాండ్లు అమ్మిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను బాండ్ల వివరాలు చెప్పాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశిస్తే, అది చివరివరకూ గుట్టు విప్పకుండా విఫలయత్నాలు చేసిన విషయం తెలిసిందే. బ్యాంకును, ఎన్నికల సంఘాన్ని ముడిపెట్టి, సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరికలతో వెంటపడితే తప్ప రహస్యం బద్దలై ఆ వివరాలు ప్రజాక్షేత్రంలోకి ప్రవహించలేదు.

ఎన్నికల బాండ్ల రూపకల్పనలోనే పారదర్శకు పాతరేశారు, గోప్యతకు పెద్దపీటవేశారు. అందుకే, గత ఆరేళ్ళకాలంలో ఏ పార్టీకి ఏ దాత ఎంతిచ్చాడన్న కనీసం ఒక్క లావాదేవీ కూడా ఈ దేశ ప్రజలకు తెలియలేదు. ఈ రాజకోట రహస్యాన్ని బద్దలు కొట్టేందుకు ఆర్టీఐ ద్వారా ప్రయత్నించినా విఫలమయ్యేట్టుగా విధానం రూపుదిద్దుకుంది. పాలకపక్షం నేతలు ఈ పథకాన్ని ప్రశంసిస్తూ, సమర్థించుకుంటూ చేసిన వ్యాఖ్యలన్నీ అసత్యాలు, అర్ధసత్యాలే. ఈ పథకం లేకపోవడంతో ఇకమీదట రాజకీయ విరాళాల్లో నల్లధనం ప్రవహించేస్తుందని మోదీ, అమిత్‌షాలు తెగవాపోతున్నారు. కానీ, అంతవరకూ రాతకోతలు, చిట్టాపద్దులు, బ్యాంకు లావాదేవీలతో అత్యంత పారదర్శకంగా ఉన్న 2013నాటి 'ఎలక్టోరల్ ట్రస్ట్' విధానం స్థానంలోకి ఈ బాండ్లు వచ్చిన తరువాతే, నల్లధనం తెల్లరంగుపులుముకొని, అడ్డుతోవలో రాజకీయపార్టీల ఖజానాల్లోకి చేరుకుంది. స్వదేశీ, విదేశీ కంపెనీలన్న తేడాలేకుండా, వాటి ఆదాయ వ్యయాలతోనూ లాభనష్టాలతోనూ నిమిత్తం లేకుండా ఎంతైనా దానం చేయగలిగే వెసులుబాటు ఇచ్చి మరీ రహస్యంగా విరాళాలు గుంజుకున్నారు. పన్నెండు లక్షల లాభాన్ని ఆర్జించిన ఒక కంపెనీ కేవలం రెండునెలల్లో 195కోట్లు కేంద్రంలోని అధికారపక్షానికి విరాళం ఇవ్వడం, ఒక లాటరీ నిర్వహణ సంస్థ, ఒక గేమింగ్ సంస్థ తమ వార్షికలాభానికి ఐదేసి, పదేసిరెట్లు దానం చేయడం, బాండ్లు కొన్నవారు ఈడీ బడితెపూజలనుంచి బయటపడటం వంటి చాలా రహస్యాలు సుప్రీంకోర్టు చొరవతోనే దేశప్రజలకు తెలిసొచ్చింది. ఎన్నికల వేళ ఈ బాండ్ల బాగోతం అధికారపక్షం పరువు తీసింది. ప్రపంచంలోనే అతిపెద్ద దోపిడీపథకం అని విపక్షాలు చేస్తున్న విమర్శలను అటుంచితే, ఈ పథకం ద్వారా జరిగిన క్విడ్‌ప్రోకో బాగోతాలన్నింటి మీదా సర్వోన్నత న్యాయస్థానం ఒక సమగ్రవిచారణకు ఆదేశించడం అత్యావశ్యకం.

భారత్‌కు గల్ఫ్ మీదుగా ఐరోపాకు చేరడం ఎంత ముఖ్యమో, ఆఫ్ఘానిస్తాన్, ఇరాన్, మాజీ సోవియట్ దేశాల మీదుగా ఐరోపాకు వెళ్లడమూ అంతే ముఖ్యం. ఇరాన్‌పై ఉన్న ఆంక్షలు, గల్ఫ్ దేశాలతో స్నేహ బంధం కారణంగా ఈ అంతర్జాతీయ రవాణా మార్గం విషయంలో ముందుకు వెళ్ళలేకపోతుంది. ఈ మార్గం విషయంలో పూర్తి పురోగతి సాధించినప్పుడే పాకిస్థాన్‌ను ఏకాకిని చేయడంలో భారత్ సఫలమవుతుంది.

ఇరాన్‌తో మైత్రి భారత్‌కు ముఖ్యం


ఇజ్రాయెల్‌పై ఇరాన్ సైనిక దాడులతో మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు మొదలయ్యాయి. సువిశాల అరబ్ ప్రపంచం చుట్టుపక్కల తన అనుబంధ లేదా ప్రాయోజిత సాయుధ దళాల ద్వారా షియా ఇరాన్ విస్తరిస్తున్న తీరు సున్నీ అరబ్బు వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. మధ్య ప్రాచ్య ముస్లిం దేశాల మధ్య జరుగుతోన్న ఈ ప్రచ్ఛన్న యుద్ధ ప్రభావం ఆ ప్రాంతం పైనే కాకుండా భారత్ సహా అనేక దేశాలపై పడడమే ఇప్పుడు ప్రపంచానికి కలవరం కలిగిస్తున్న అంశం.

ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగడానికి భారత్ ఉవ్విళ్లూరుతున్నది. భారత్ ఆకాంక్ష నెరవేరాలంటే మధ్యప్రాచ్య అరబ్బు ప్రపంచంలో సుస్థిర శాంతి నెలకొనాల్సిన అవసరం ఉన్నది. షియా పార్శీ ఇరాన్, సున్నీ అరబ్బు గల్ఫ్ దేశాల మధ్య ఉద్రిక్తతలు ఒక్క భారతదేశానికే కాకుండా ఐరోపా, అమెరికాల వాణిజ్యాభివృద్ధికి విఘాతం కలిగించేవిగా ఉన్నాయి. ఐరోపా నుంచి భారత్, ఇతర ఆసియా దేశాలకు జరిగే ఎగుమతులు దిగుమతులు అన్నీ కూడ ఈ ప్రాంతంలోని సముద్రజలాల ద్వారా జరుగుతాయి. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి ఫ్రాన్స్‌కు ఎగుమతయ్యే ఔషధాలు లేదా గుజరాత్ నుంచి బ్రిటన్‌కు ఎగుమతయ్యే రసాయనాలతో అరబ్బు దేశాలకు ఎలాంటి సంబంధం లేకున్నా వాటిని రవాణా చేసే నౌకలన్నీ కూడ అరబ్బు దేశాల తీరాల గుండా వెళతాయి. అలనాటి కాలంలో స్వామి వివేకానంద, మహాత్మాగాంధీలు ఇదే మార్గాన బ్రిటన్, అమెరికా దేశాలకు వెళ్ళారనేది ఇక్కడ గమనార్హం.

ఐరోపా మధ్యధరా సముద్రం నుంచి ఈజిప్టు, సూడాన్, సౌదీ అరేబియా, యమన్, ఇథియోపియా దేశాల ఎర్ర సముద్రం

గల్ఫ్ లేఖ

మీదుగా అరేబియా, హిందూ మహాసముద్రాల ద్వారా భారత్‌కు, అటు నుంచి ఇతర ఆసియా దేశాలకు నౌకాయానం జరుగుతుంది. ప్రపంచ వాణిజ్య లావాదేవీలకు కీలకమైన ఈ మార్గంలో ఏ రకమైన ఉద్రిక్తత చెలరేగినా సరఫరా వ్యవస్థకు విఘాతం కలగడమే కాకుండా గల్ఫ్ దేశాల నుంచి రవాణా అయ్యే చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీనివల్ల భారత్‌తో సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు అతలాకుతలమవుతాయి. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న నౌకలపై ఇరాన్ సమర్థక హూతీ సాయుధ దళాలు చేస్తున్న దాడుల కారణాన ఇప్పటికే ప్రపంచ నౌకాయానంలో అనిశ్చిత



పరిస్థితి నెలకొని ఉన్నది. మరో వైపు నౌకాయాన వ్యయం పెరిగి ధరల హెచ్చుదలకు దారి తీస్తోంది.

ఇప్పటి వరకు అరేబియా సముద్ర తీరంలో చాల ఇరుకైన జలసంధిలో ఇరాన్‌కు భౌగోళిక అనుకూలత ఉండగా హూతీ దళాల ద్వారా ఎర్రసముద్రంలో సైతం నౌకలపై దాడులు చేసే సామర్థ్యం ఆ దేశానికి సమకూరింది. ఇది సహజంగా ఆందోళన కలిగించే అంశం. కౌటిల్యుడు 'అర్థశాస్త్రం'లో బోధించినట్లుగా సముద్రాలపై పట్టు ఉన్న వారికే ప్రపంచంపై ఆధిపత్యం ఎక్కువగా ఉంటుంది. అందుకే నౌకా యానంపై పట్టు కలిగిన పోర్చుగీసు, ఫ్రాన్స్ ఆ తర్వాత బ్రిటన్ తమ సామ్రాజ్య వాద విస్తరణలో సఫలీకృతమయ్యాయి. కొరకరాని కొయ్యగా మారిన ఇరాన్ ఈ రకంగా నౌకాయానంపై పట్టు బిగిస్తుండడానికి తోడుగా సైనికంగా అత్యంత శక్తిమంతమైన ఇజ్రాయెల్‌తో ఢీ కొనడానికి చేస్తోన్న హెచ్చరికలు సహజంగానే మధ్య ప్రాచ్యంలో అలజడిని రేపుతున్నాయి.

భారతదేశం, మధ్యప్రాచ్య అరబ్బు, ఇజ్రాయెల్ దేశాలతో సహ ఐరోపాను కలుపుతూ తలపెట్టిన నూతన రవాణా మార్గం ఒకటి భారత్ దశ, దిశను మార్చివేయగలదు. రైలు, రోడ్డు, నౌకాయానం ద్వారా ఈ దేశాల మధ్య దూరం తగ్గిస్తూ వాణిజ్యావకాశాలను పెంపొందించే ఈ బృహత్తర పథకాన్ని అమలుపరిచేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలు చాల వరకు సఫలీకృతమయ్యాయి. మోదీ విదేశాంగ విధాన విజయగాథలో ఈ కారిడార్ అగ్రగణ్యమైంది. అదానీ గ్రూప్ ఆధ్వర్యంలోని గుజరాత్‌లో అరేబియా సముద్ర తీరంలోని ఓడరేవుల నుంచి నేరుగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా మీదుగా విశాల ఐరోపా ఖండానికి సులభతరమైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అందరు ఆర్థికంగా బలోపేతం కావాలనేది ఈ పథకం ఉద్దేశ్యం. చైనా సిల్కు రూట్‌కు ప్రత్యామ్నాయంగా ఇది ఉపయోగపడే అవకాశాలు ఉండడంతో అమెరికా కూడా ఈ అంతర్జాతీయ రవాణా మార్గానికి సానుకూలంగా ఉంది.

మధ్య ప్రాచ్య ప్రాంతంలో వివాదాలకు కేంద్రబిందువు అయిన ఇరాన్ కూడ భౌగోళికంగా ఐరోపాకు సమీపంలో ఉంది. పాకిస్థాన్, చైనా సహాయంతో ఇది సిల్క్ రూట్‌లో నల్లసముద్రం మీదుగా నేరుగా రష్యాకు చేరుకోగలుగుతుంది. భారత్‌కు గల్ఫ్ మీదుగా ఐరోపాకు చేరడం ఎంత ముఖ్యమో, ఆఫ్ఘానిస్తాన్, ఇరాన్, మాజీ సోవియట్ దేశాల మీదుగా ఐరోపాకు వెళ్ళే మార్గం కూడా అంతే ముఖ్యం. ఈ అంతర్జాతీయ రవాణా మార్గంపై భారత్‌కు ప్రత్యేక ఆసక్తి ఉన్నది. అయితే ఇరాన్‌పై ఉన్న ఆంక్షలు, అమెరికా దౌత్యం, గల్ఫ్ దేశాలతో స్నేహ బంధం కారణంగా సిల్క్ రూట్‌కు ప్రత్యామ్నాయమైన ఈ అంతర్జాతీయ రవాణా మార్గం విషయంలో ముందుకు వెళ్ళలేకపోతుంది. ఈ మార్గం విషయంలో పూర్తి పురోగతి సాధించినప్పుడే పాకిస్థాన్‌ను పూర్తిగా ఏకాకిని చేయడంలో భారత్ సఫలమవుతుంది. ఈ కారణంగానే ఇరాన్‌తో పటిష్ట మిత్రత్వాన్ని భారత్ కోరుకొంటుంది. గల్ఫ్, అమెరికా, ఇజ్రాయెల్‌ల పట్ల తన వైఖరి ఎలా ఉన్నా ఇరాన్ విషయంలో మాత్రం భారత్ సదా ఆచితూచి అడుగులు వేస్తోంది. ఆ మాటకొస్తే అనేక దేశాలు సైతం అటువంటి వైఖరినే అవలంబించడం గమనార్హం. తాజాగా ఇరాన్ – ఇజ్రాయెల్ ఉద్రిక్తతల మధ్య కూడ నేరుగా ఒక పక్షం వైపు మొగ్గకుండా భారత్ వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తుంది. మధ్య ప్రాచ్య పరిణామాలు భారత్‌కు దౌత్యపరంగా ఒక సంక్లిష్ట పరిస్థితిని కల్పించాయనడంలో సందేహం లేదు.

▪ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

మోదీ పాలనలో అంతా సుభిక్షమేనా?



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

భారతదేశం 2047 నాటికి ప్రపంచంలో అమెరికాను సైతం తలదన్ని అగ్ర రాజ్యంగా మారడం ఖాయమని, ఈ లక్ష్యం సాధించేందుకు తాను ఒక్క క్షణం కూడా వృథా చేయదలుచుకోలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. 'మోదీకా గ్యారంటీ' పేరుతో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తూ ఆయన చేసిన ప్రసంగం విన్నవారెవరికైనా ఆయన ఆత్మవిశ్వాసం అబ్బురం కలిగిస్తుంది. కవర్ పేజీపై 'మోదీ కా గ్యారంటీ' క్రింద 'ఫిర్ ఏక్ బార్ మోదీ కా సర్కార్' (మరోసారి మోదీ ప్రభుత్వం) అన్న వాక్యాలతో ప్రింట్ చేసిన ఈ మేనిఫెస్టోలో మోదీ అన్న పదంతో పాటు అడుగడుగునా నరేంద్రమోదీ ఛాయా చిత్రాలు మనను అలరిస్తాయి. గ్యాస్ సిలిండర్‌లను మహిళలకు ఇస్తున్నట్లు, వృద్ధులను అలింగనం చేసుకుంటున్నట్లు, ఆడపిల్లలను దీవిస్తున్నట్లు, యువకులతో మాట్లాడుతున్నట్లు, మెట్రో రైలులో ప్రయాణిస్తున్నట్లు, ఆవులను నిమురుతున్నట్లు, విదేశీ నేతలతో చెట్టపట్టాలేసుకున్నట్లు, పార్లమెంట్‌లో రాజదండంతో నమస్కరిస్తున్నట్లు, పట్టుపంచెలతో తిరుగాడుతున్నట్లు ఊర్ధ్వ పుండ్రాలతో వెలిగిపోతున్నట్లు రకరకాల మోదీలు, రకరకాల హావభావాలతో ఎంతో హృద్యంగా మనకు దర్శనం ఇస్తారు. ఏ పేజి తిప్పినా ప్రతి వాగ్దానం ముందు మోదీ గ్యారంటీ అన్న పదాలను చేర్చారు.

ఎవరు అవునన్నా, కాదన్నా 1951లో ఏర్పడిన జనసంఘ్, 1980లో రూపాంతరం చెందిన భారతీయ జనతా పార్టీలు రెండూ ఏడు దశాబ్దాలకు పైగా కొనసాగిన తమ అస్తిత్వాన్ని ఇవాళ నరేంద్రమోదీ అనే మహా అస్తిత్వంలో విలీనం చేసినట్లు కనపడుతోంది. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, ప్రేమ్‌నాథ్ డోగ్రా, డిపి ఘోష్, బలరాజ్ మధోక్, దీనదయాళ్ ఉపాధ్యాయ, నానాజీ దేశ్ ముఖ్, కుశాభావ్ థాక్రే, అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వాణీ మొదలైన నాయకుల చారిత్రక పరంపర ఇవాళ ఒక మహా కేంద్ర బిందువు వద్ద ఆగిపోయినట్లు కనిపిస్తోంది. ఆ బిందువు ఎవరో కాదు నరేంద్రమోదీ. ప్రజలకు వాగ్దానాలను నెరవేరుస్తామన్న నమ్మకం కలిగించడం కోసమే 'మోదీ కా గ్యారంటీ' అన్న పదాలను ఉపయోగించామని ప్రధానమంత్రి చెప్పుకున్నారు. అంటే పార్టీ పేరు కన్నా తన పేరుకే ఎక్కువ విలువ ఉన్నట్లు ఆయన భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఇక్కడే మోదీ ఆత్మవిశ్వాసం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఏ దేవుడూ మనకు ఫలానా మేలు చేస్తానని వాగ్దానం చేయడు. కాని దేవుడి దగ్గరకు వెళితే తమకు మంచే జరుగుతుందని ఈ దేశంలో కోట్లాది ప్రజలు విశ్వసిస్తారు మోదీ కూడా ఆ విశ్వాసాన్ని మనకు కలుగచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దేవుడు కాకపోయినా దైవాంశ సంభూతుడు అనే అభిప్రాయాన్ని కలుగ చేస్తున్నారు. మోదీని విశ్వసిస్తే భారతదేశం భూతల స్వర్గంగా మారుతుందని, ఒక అందమైన కలల సామ్రాజ్యంగా మారుతుందని, ఆకలి దప్పులు లేని సమాజం ఏర్పడుతుందని, అంతటా అభివృద్ధి, సంపద విలసిల్లుతాయని, మోదీ అనే శక్తి ముందు పాకిస్థాన్, చైనాతో పాటు పలు దేశాలు మోకరిల్లుతాయని, ఎలాంటి ఉగ్రవాదమైనా తోకముడుస్తుందని, అవినీతిని పూర్తిగా రూపుమాపేందుకు ఆయన కంకణం కట్టుకున్నారని నమ్మించేందుకు అనేక గ్యారంటీలు ఇస్తున్నారు. ఈ గ్యారంటీలను మనస్ఫూర్తిగా నమ్మి 400కు పైగా సీట్లతో తనకు పట్టాభిషేకం చేస్తారని మోదీ స్వయంగా విశ్వసిస్తున్నారు. పార్లమెంట్ భవనాన్ని, అయోధ్యలో రామమందిరాన్ని తానొక్కడే ఆవిష్కరించినట్లు ఈ దేశంలో బీజేపీని తానొక్కడే గెలిపించగలనని ఆయన భావిస్తున్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లి ఈవీఎంలో బటన్ నొక్కే ప్రతి వ్యక్తి మనసులో తానే మెదలాలని ఆయన ఆశిస్తున్నారు.

ఎలాగూ ఎన్నికల సమయంలో తప్పదు కాబట్టి మొక్కుబడిగా బీజేపీ కూడా ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించింది కాని కళ్ల ముందు మోదీ లాంటి మహావ్యక్తి ఉండగా వేరే మేనిఫెస్టోను ఆవిష్కరించాల్సిన అవసరం లేదు. అందువల్లే బీజేపీ మేనిఫెస్టోలో పెద్ద ఆర్భాటాలు లేవు. వివాదాస్పద, భావోద్వేగ అంశాలు లేవు. గత మేనిఫెస్టోలో చెప్పినట్లు జాతీయ పౌరుల రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి అక్రమంగా వలస వచ్చిన వారిని ఏరి పారేస్తామన్న వాగ్దానం లేదు. ధరలను తగ్గిస్తామని, రైతుల ఆదాయం ఫలానా సంవత్సరానికల్లా రెట్టింపు చేస్తామన్న అలవిమాలిన హామీలూ లేవు. మథుర, కాశీ వంటి వాటి జోలికి పోలేదు. రైతులకు మద్దతు ధరపై చట్టబద్ధత కల్పిస్తామని, యువకులకు శిక్షణతో పాటు భృతి కల్పిస్తామని, ప్రతి పేద మహిళకూ రూ. లక్ష నగదు ఇస్తామని, ఖాళీలుగా ఉన్న ప్రభుత్వ పోస్టులను భర్తీ చేస్తామని, కులజనగణన జరిపి అన్ని వర్గాలకు సరైన సామాజిక న్యాయం చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లాంటివేవీ బీజేపీలో మనకు కనపడవు. అసలు అలాంటి హామీలు ఇవ్వాల్సిన అవసరమే లేదని బీజేపీ భావిస్తున్నట్లు కనపడుతోంది, అంతేకాదు, ఎన్నికల సంస్కరణలు, పోలీసు సంస్కరణలు, న్యాయవ్యవస్థకు చెందిన సంస్కరణలు వంటి బృహత్తర ఆలోచనలు చేయాల్సిన అవసరం లేదని బీజేపీ భావిస్తోంది. ఉమ్మడి పౌర స్మృతి ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో అమలు చేస్తున్నారు కనుక బీజేపీ ఈ స్మృతిని అమలు చేస్తుందన్న విషయంలో ఎవరికీ సందేహం లేదు. మొత్తంగా 78 పేజీల మేనిఫెస్టోలో చాలా వాగ్దానాలు పాతవే. ఈ మేనిఫెస్టోను చదివిన వారికి మోదీ రాజ్యంలో అంతా సుభిక్షంగా సంతోషంగా ఉన్నట్లు బీజేపీ బలవంతంగా విశ్వసిస్తున్నట్లు అర్థమవుతుంది. అందువల్ల కొత్తగా ఏమీ చేయనవసరం లేదని, ఇదే వేగంతో పనిచేసి దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చగల శక్తి మోదీకే ఉన్నట్లు బీజేపీ నేతలు విశ్వసించకతప్పడం లేదు.

తాను చేస్తున్న పనులన్నీ సరైనవేనని ఒక నాయకుడు భావిస్తున్నారంటే ఆయనకు తనపై తనకే తిరుగులేని నమ్మకం ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ దేశంలో ప్రతిపక్ష నేతలందర్నీ అవినీతిపరులుగా చిత్రించి ఈడీ, సీబీఐ సంస్థలు జైళ్లలో వేయడాన్ని సరైన చర్యగానే ఆయన భావిస్తున్నారు. అవినీతిపై పోరాటం చేస్తున్నానని చెప్పుకుంటున్నారు. ఈడీ, సీబీఐలు తాను చెప్పినట్లు నడుచుకుంటున్నాయన్న ఆరోపణలను ఆయన తాజాగా ఒక సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొట్టి పారేశారు. ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సేకరించడం రాజ్యాంగ వ్యతిరేకమని, అక్రమమని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తే అది న్యాయపూరితమేనని మోదీ బావిస్తున్నారు. నల్లధనాన్ని అరికట్టేందుకే తాను ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టానని ఆయన వాదిస్తున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం సవ్యంగా ఉన్నదని, ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. ఇజ్రాయిల్–హమాస్, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాలను కూడా ఉటంకించి దేశాన్ని సురక్షితంగా ఉంచగలిగిన దివ్యశక్తి తానేనని సంకేతాలు పంపుతున్నారు. తానెవర్నీ భయపెట్టడం లేదని కూడా చెప్పుకున్నారు. మోదీ తన విశ్వరూపాన్ని తానే పెంచుకుని ప్రతిపక్షాలను పిపీలికాలుగా భావిస్తున్నారు.

తాను జరిపే ఉధృత ప్రచార యుద్ధంలో ప్రతిపక్షాల హామీలు గాలికి కొట్టుకుపోతాయని, ద్రవ్యోల్బణం, అవినీతి, నల్లధనంపై తాను చెప్పే మాటల్నే జనం విశ్వసిస్తారని ఆయన అనుకుంటున్నారు. ఈ క్రమంలో తలెత్తే ప్రశ్నలకు జవాబివ్వడం అనవసరమని, అసలు తను ప్రశ్నలకే అతీతుడననేది ఆయన అభిప్రాయంలా కనపడుతోంది. మోదీ మహా బల సంపన్నుడనే సందేశం ప్రజలకు వెళ్లేందుకు, మానవమాత్రులైన ఏ ప్రతిపక్ష నేతకూ తనను ప్రశ్నించే యోగ్యతలేదని వారు భావించేలా చేసేందుకు ఆయన సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఆయనలోని గురుత్వాకర్షణ శక్తికి తిరుగులేదని బీజేపీ నేతలు సైతం భావిస్తున్నారు. అచ్ఛేదిన్ ఆయేగీ, సబ్ కా సాథ్ సబ్ కా వికాస్, హర్ హర్ మోదీ, విశ్వగురు, అమృతకాల్ అంటూ ఆయన ఇచ్చిన నినాదాలన్నీ వారు వల్లెవేస్తున్నారు.

విచిత్రమేమంటే ఏ పార్టీ ఎన్ని వాగ్దానాల వర్షం కురిపించినా అనంతపురం లాంటి కరువు ప్రాంతాల్లో యువకులు వలస వెళ్లకుండా ఉండలేరు. బిహార్‌లోని పల్లెల్లో వృద్ధులు ఢిల్లీలో పనిచేసే తమ పిల్లలు పంపించే కూలి డబ్బుల కోసం ఎదురు చూడకుండా ఉండలేరు. యూపీలో పిహెచ్‌డి చేసిన యువకులు సైతం రూ. 8 వేల జీతానికి ఏదో ఒక చిన్న ఉద్యోగం చేయక తప్పడం లేదు. ఉపాధి హామీ పథకాలు నిర్వీర్యమై కూలి గిట్టుబాటు అయ్యే పరిస్థితులు ఎక్కడా లేవు. గ్రామీణ నిరుద్యోగిత శాతం రోజురోజుకూ పెరుగుతోందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ చెబుతోంది. ప్రపంచ ఆకలి సూచికలో భారతదేశ స్థానం 111 ర్యాంకు నుంచి పడిపోవడం లేదని, అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థలో 80 కోట్ల మంది ఉచిత ఆహార ధాన్యాలపై ఆధార పడాల్సి రావడం కూడా వాస్తవాలే. ప్రతి ఏటా లక్షలాది విద్యాధికులు, వృత్తి నిపుణులు ఇతర దేశాల్లో ఉపాధి కోసం ఆశగా వెళుతున్నారు. అగ్రరాజ్యంగా మారనున్న మన భారత దేశంలో ఉపాధి కోసం వచ్చే వారెంతమంది? ఎందుకు ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఆదాయం కన్నా అప్పులు ఎక్కువై శ్రీలంక వంటి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి?

అందువల్ల మరో కొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే లోక్‌సభ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావు. ఇది మోదీ అనే మహా వ్యక్తికీ ప్రతిపక్షాలకూ మధ్య జరుగుతున్న ఒక మహా పోరాటం. మోదీ వశీకరణ శక్తికి, ప్రచార నైపుణ్యానికి, పార్టీ నేతలు, కార్యకర్తలు గత్యంతరం లేక లోబడవచ్చేమో కాని కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతదేశం మోదీ మయం కాగలుగుతుందా? ప్రజలు తమ విచక్షణా శక్తిని, వివేచనను ఉపయోగిస్తారా? వాస్తవాలకూ, ప్రచారానికీ మధ్య తేడాను గమనిస్తారా అన్న ప్రశ్నలకు ఈ ఎన్నికల ఫలితాలు సమాధానమిస్తాయి.



కొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే లోక్‌సభ ఎన్నికలు మోదీ అనే మహా వ్యక్తికీ ప్రతిపక్షాలకూ మధ్య జరుగుతున్న ఒక మహా పోరాటం. మోదీ వశీకరణ శక్తికి, ప్రచార నైపుణ్యానికి, పార్టీ నేతలు, కార్యకర్తలు గత్యంతరం లేక లోబడవచ్చేమో కాని కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతదేశం మోదీ మయం కాగలుగుతుందా? ప్రజలు తమ విచక్షణా శక్తిని, వివేచనను ఉపయోగిస్తారా? వాస్తవాలకూ, ప్రచారానికీ మధ్య తేడాను గమనిస్తారా అన్న ప్రశ్నలకు ఈ ఎన్నికల ఫలితాలు సమాధానమిస్తాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఓటమి 'సిద్ధం'గా ఉంది!



వివేకా హంతకుడతడేనని నీ చెల్లి సునీత వేలెత్తి చూపుతున్నా
ఓ జగమొండీ అవివేకీ వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు
అవినాశవాలేకు మళ్ళీ టికెట్ కట్టబెట్టి తెచ్చుకొంటివి చేటు
ఒక్క కడుపున పుట్టిన షర్మిలా ఉరుములురుముతూ
కదలి వచ్చింది కనకదుర్గయై
కడపలోనా కడప కడపా ఎక్కి దిగీ ఊరువాడా
ఎలుగెత్తి చాటుతున్నది హంతకుణ్ణి ఓడించడమే తన ధ్యేయమని
ఢంకా బజాయించి అతని ఓటమి తథ్యమని చెబుతుంటే
పంకాకు ఊపిరాడటం లేదు, నీ గద్దె గజగజ వణికి పోతున్నదిలే



జగన్ నీ లెక్కన 'లెక్క'ను చుక్కెత్తు
పోగు చేసుకున్న వాడున్నాడా ఈ జగాన
'మగన్'వైతే నీ తోడబుట్టిన చెల్లికి లెక్కాచారంగా పంచివ్వు
వంచించకు ఓటర్లను ఒట్టి బూటకం మాటలతోన
నీ ఇంటి చెల్లెళ్ల కంటినీరు తుడిచినంకనే
నా అక్క చెల్లెళ్లు అవ్వా తాతా అనే పల్లవెత్తుకో
ఇంట గెలిచి రచ్చ గెలవాలిరా నాయనా
ఊరూరా దివ్య హర్మ్యాలు కట్టుకొని
పూరి గుడిసెల మీద కురిపించకు మొసలి కన్నీరును



మళ్లీ గద్దె నెక్కడానికి రాష్ట్రాన్ని అప్పుల నిప్పుల కుంపటి చేశావే
ఖలేజా ఉంటే నీ సొంత ఖజానా నుంచి
ప్రజల సంక్షేమాలకు ఖర్చు పెట్టు
పుచ్చలపల్లి సుందరయ్యలా బీదసాదలకు పంచిపెట్టు
వావిలాలలా నిరాడంబరంగా నిజాయితీగా బతుకు
అపుడు ప్రజలు ప్రభంజనంలా కదలి వచ్చి
నీకు పట్టం కడతారురా పరమానందంతో
నీవు బతికినన్నాళ్లు నీవే ముఖ్యమంత్రి వంటారు



మీ ఇద్దరినీ తన రెండు కళ్ళలా భావించిన మీ తల్లి
ఎన్నికల్లో కత్తులు దూసుకుంటుంటే
చూడలేక కన్నతల్లి తరలిపోయింది అమెరికాకు
ఎవరు చెబుతారు 'వివేకాన్ని' పోగొట్టుకున్న నీకు
ఎవరు ఆపలేరు 'సిద్ధం'గా ఉన్న నీ ఓటమిని

– జి. చెన్నకేశవరెడ్డి

బాల సాహిత్య సమ్మేళనం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మే 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో బాల సాహిత్య సమ్మేళనం జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు, బాలల కోసం రచనలు చేస్తున్నవారు ఇందులో పాల్గొంటారు. పాఠశాల స్థాయిలో తెలుగు భాషావికాసం, బడి పిల్లల్లో రచనాభిరుచి పెంపొందించడం, పత్రికల్లో బాలల రచనలకు ప్రచురణావకాశాలు, కథలు చెప్పడంలో మెలకువలు, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్పం వంటి లలితకళల పైన ప్రాథమిక అవగాహన మొదలైన సదస్సులు, గోష్ఠులు జరుగుతాయి. శాంతా వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు, పద్మభూషణ్ పురస్కృతులు డాక్టర్ కె.ఐ వరప్రసాదరెడ్డి వారి మాతృమూర్తి శాంతమ్మ గారి సంస్మరణార్థం గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సౌజన్యం అందిస్తున్నారు. ఈ సమ్మేళనంలో ప్రతినిధులుగా పాల్గొనదలిచేవారు ఈ నెల 30వ తేదీలోగా 96037 27234 వాట్సాప్ నెంబర్‌కు వివరాలు పంపి పేర్లు నమోదు చేసుకోవాలి.

– ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య
తెలంగాణ సారస్వత పరిషత్తు

హిందూ మతాన్ని మాత్రమే మీ చరిత్ర అంగీకరించదా?

'మతాన్ని చరిత్ర అంగీకరించదు' అంటూ ఏప్రిల్ 7న కొప్పర్తి వెంకట రమణమూర్తి రాసిన వ్యాసంలో మతం చరిత్రగా, చరిత్ర మతంగా మారుతున్న నేటి పరిస్థితుల్లో చరిత్రకు మతానికి ఉండే వైవిధ్యాన్ని ప్రశ్నించి సమాధానం రాబట్టుకోవలసిన అవసరం ఉందని చెబుతూ, హిందువులకు సంబంధించిన ఆధ్యాత్మిక విషయాలను స్పృశిస్తూ, శ్రీకృష్ణుడు, శ్రీరాముని అవతార విషయాలను ప్రస్తావించారు. కానీ ఆ వ్యాసం ధోరణి చూస్తే కేవలం హిందూ మతాన్ని మాత్రమే చరిత్ర అంగీకరించదు అని చెప్పకనే చెప్పినట్లు ఉంది.

మతానికి వస్తువు దేవుడు, చరిత్రకు వస్తువు గతం – అంటే మానవునికి సంబంధించిన గతంలోని విషయాలు అని అర్థం. మతానికి వస్తువు దేవుడు అనేది క్రైస్తవం, ఇస్లాంలకు సంబంధించిన భాషణం. ముస్లింలను, క్రైస్తవులను మినహాయిస్తే (ప్రభుత్వ లెక్కల్లో చెప్పినట్లు) నానా కులాలుగా విడిపోయిన హిందువులు అనుసరించేది మతం కాదు. ఇది ఒక జీవన విధానం. ఈ జీవన విధానంలో ఏ సాంప్రదాయం, ఏ ఆచారం ఒకరి సొత్తుగా లేదు. హిందువులు అనుసరించే ఆచారాలు, సాంప్రదాయాలు ప్రార్థనా విధానాలు, ఆరాధనా పద్ధతులను లోతుగా అధ్యయనం చేసిన సుప్రీంకోర్టు హిందువులు పాటించేది ఒక జీవన విధానమే కానీ మతం కాదని తేల్చి చెప్పింది. ఇందుకు కారణం లేక పోలేదు. యజ్ఞోపవీతం ధరించి, నిత్యం నియమానుసారంగా గాయత్రీ మంత్రం జపించే బ్రాహ్మణుడికీ, కొండల్లో జీవిస్తూ కొండ దేవరను పూజించే కోయ జాతి వాడికీ ఆరాధనా విధానంలో ఎంతో వ్యత్యాసం కనబడుతుంది. అయినప్పటికీ వీళ్లిద్దరిని హిందువులుగానే ఈ దేశ ప్రభుత్వం గుర్తిస్తుంది.

చరిత్రకు మతం లేదని చెప్పడం వాస్తవమేనా? ఇది వాస్తవమైతే క్రైస్తవ మతానికి సంబంధించిన క్రీస్తును చరిత్రను లెక్కించడానికి ప్రామాణికంగా ఎందుకు తీసుకుంటున్నారు? చరిత్రకు మతం లేకపోవచ్చు, చరిత్ర తనకు తాను చెప్పుకోదు! చరిత్రను వ్యాఖ్యానించేది మానవులే కదా! చరిత్రను వ్యాఖ్యానించే వారిలో నిష్పాక్షికత లోపిస్తే ఒక మతంలోని విషయాలు మరుగునపడడమో, ఆ మతానికి దుర్వ్యాఖ్యలను జోడించడమో జరుగుతుంది కదా?

ఈ దేశ చరిత్రను రాసింది బ్రిటిష్‌వాళ్ళు. వేద సాహిత్యంలో భాగాలైన వేదాలు, ఉపనిషత్తులు, అరణ్యకాలు, బ్రాహ్మణికాలను ఆంగ్లీకరించింది పాశ్చాత్యులు. ఈ విషయంలో భారతదేశానికి సంబంధించిన సంస్కృత పండితులకు ఏ మాత్రం పాత్ర లేదు. భారత రాజ్యాంగ రచనా సభ్యులు మన దేశ రాజ్యాంగాన్ని రూపొందించడంలో అమెరికా, బ్రిటన్, రష్యా ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాల రాజ్యాంగాల లోని ముఖ్య విషయాలను తీసుకున్నారనే విషయం సత్య దూరం కాదు. మన దేశానికి సంబంధించిన వేద సాహిత్యాన్ని విశ్లేషించే వామపక్షవాదులు ఇదే తంతును అనుసరించారు. ఈ వ్యాసంలోని నేపథ్యం కూడా అదే!

చరిత్ర నిజాన్ని ఆధారాలతో సహా తెలియజేస్తుందని చెప్పడం ఎంత వరకు వాస్తవం? 1922లో హరప్పా, మొహంజోదార ప్రాంతాలలో సింధూ నాగరికత శిథిలాలు బయటపడేంత వరకు భారతదేశానికి పురాతన చరిత్ర లేదని బ్రిటిష్ చరిత్రకారులు వాదిస్తూ వచ్చారు. అంత వరకు భారతదేశ చరిత్ర గురించి చెప్పిన చారిత్రక విషయాలు అసత్యాలుగా మారిపోయాయి. 40 సంవత్సరాల క్రితం ప్లూటో సౌర కుటుంబంలో ఒక గ్రహం అని చెప్పింది చరిత్ర. ఇప్పుడు ఆ సత్యం కాస్తా అసత్యమై నిలబడింది. అంటే గతానికి అంటే చరిత్రకు సంబంధించిన విషయాలలో కొత్తవి చేరినప్పుడు పాతవి అసత్యాలుగా మిగిలిపోతాయి. ఋగ్వేద రచన క్రీస్తు పూర్వం 2000–1500 సంవత్సరాలలో జరిగి ఉండవచ్చునని, ఎవరో రస హృదయులు రాశారని చెప్పడం వాస్తవమేనా?

ఇక ఆధ్యాత్మిక సాహిత్యంలోని దేవాసుర సంఘర్షణను బ్రిటిష్‌వాళ్లు అల్లిన కట్టుకతల చరిత్ర అయిన ఆర్య ద్రావిడ వాదంతో అనుసంధానం చేయడం వ్యాసకర్త చేసిన విచిత్రమైన విన్యాసం. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మన్ జాత్యాహంకారం ఓడించబడటంతో ఆర్యులు ఒక జాతి అనే వాదం ప్రపంచంలో తిరస్కరించబడింది. కానీ భారతదేశంలోని వామపక్షవాదులు దానినే పట్టుకొని ఊగులాడుతున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఈ వాదాన్ని వదులుకుంటే వామపక్ష చరిత్రకారులకు, వామపక్ష మేధావులకు, వామపక్ష నాయకులకు మనుగడ ఉండదు.


ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనపై 1857లో భారతదేశంలో అన్ని ప్రాంతాల ఆచార సాంప్రదాయాలకు అతీతంగా తిరుగుబాటు చేశారు. దీనిని ప్రథమ భారత స్వాతంత్ర సమరం అంటారు. ఈ సమరం బ్రిటిష్ పాలకులు మేధావుల ఆలోచనలను మార్చింది. ఈ దేశంలో బ్రిటిష్ పాలనను స్థిరీకరించుకోవడానికి ఆర్య ద్రావిడ వాదాన్ని, హిందువులు ముస్లింలు వేరు వేరు జాతులవారు అనే ద్విజాతి సిద్ధాంతాన్ని (సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ చేత చెప్పించి) భారతీయుల బుర్రల్లోకి ఎక్కించారు. ముస్లిం లీగ్, ద్రవిడ పార్టీలు బ్రిటిష్ వాళ్లకు అనుకూలంగా, స్వాతంత్ర్య ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేశాయనే విషయం చాలామంది భారతీయులకు తెలియదు. వేద జ్ఞానానికి మూలపురుషుడైన వేద వ్యాసమహర్షిని 'వ్యాసుడనే ఋషి నాలుగు వేదాలను వర్గీకరించాడంట' అని వ్యంగంగా చెప్పడం వెనుక భారతీయ ఋషి పరంపర పైన వ్యాసకర్తకు ఉండే వ్యతిరేక భావన అర్థమైంది.

మతం హఠాత్తుగా మొదలవుతుందని ఒకచోట చెప్పి, మానవ నాగరికతలో ఒక పనిముట్టు, ఒక వ్యవస్థ రూపాంతరము చెందినట్లు, మత భావనలు కూడా రకరకాలు రూపాలు తీసుకుంటాయని మరో చోట చెప్పడాన్ని బట్టి వ్యాసకర్త భారతీయ సాంస్కృతిక విషయాలలోని క్లిష్టతను అర్థం చేసుకోలేదనిపిస్తోంది. అసలు మతాన్ని చరిత్ర రూపంలోకి ఎందుకు తీసుకొచ్చినట్లు? శివుడిని లింగ రూపంలో ఎందుకు ప్రతిష్టిస్తారు? దీనికి ఆధ్యాత్మికపరమైన కోణాన్ని అర్థం చేసుకోకుండా, చిత్త చాంచల్యంతో, లైంగిక పరిభాషలో విశ్లేషించడం విజ్ఞత అనిపించుకోదు.



చరిత్రకు మతం లేకపోవచ్చు. కానీ చరిత్రను వ్యాఖ్యానించేది మానవులే కదా! చరిత్రను వ్యాఖ్యానించే వారిలో నిష్పాక్షికత లోపిస్తే ఒక మతంలోని విషయాలు మరుగునపడడమో, ఆ మతానికి దుర్వ్యాఖ్యలను జోడించడమో జరుగుతుంది కదా?

▪ కొండా సుమంత్ రెడ్డి
సామాజిక విశ్లేషకులు



ఎండ

వేలవేల అద్దాలు బద్దలైనట్లు,
సముద్రాలు ఆవిరై
ఒంటి మీద ఊరుతున్నట్లు.

ఉపమానాలన్నీ పాతబడ్డ పోలికలై
తూలికల్లా ఎగిరిపోతున్నట్లు
నీడ విలువ
నీటి విలువ
చెట్ల విలువ
తెలియజెప్పే ఒక కఠోర పాఠం ఎండ.

గాలి నిశ్చేష్టితమౌతుంది
జాలి అనార్ద్రమౌతుంది
ఎండలో కాయకష్టం
మరింత భారమౌతుంది
పక్క వీధి కూడా దూరమౌతుంది.

ఎటూ తోచదు
కవిత్వం వెలువడుతుంది గాని
అది వేడిగా వుంటుంది.
చంద్రుని గురించిన పాట కూడా
చందనంలా చల్లగా వుండదు.


పిల్లి వేటకు వెళ్ళదు
కుక్క వెల్లకిలా పడుకుని
అంగలారుస్తుంది.

కట్టెల మోపు నెత్తుకొని
ఆమె చకచకా నడుస్తుంది.
అవి నెత్తి మీదనే ఎండిపోయాయి.
నాకు ఆమె తలపై
చుట్టకుదురై నలగాలని వుంది.

– డా. ఎన్.గోపి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్,
రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com





నేడు కృష్ణాకు బాబు, పవన్ రాక

- పెడన, మచిలీపట్నం బహిరంగ సభల్లో ప్రసంగించనున్న నేతలు

మచిలీపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హాజరుకానున్నారు. బుధవారం మధ్యాహ్నం 2.25 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి పెడన బైపాస్‌రోడ్డులో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు 2.40 గంటలకు వారు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి 2.55 గంటలకు పెడన బస్టాండ్ సెంటరుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు పెడన బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడుతారు. అనంతరం 4.40 గంటలకు పెడన నుంచి బయలుదేరి మచిలీపట్నం నియోజకవర్గంలోకి రోడ్డు మార్గం ద్వారా కోనేరు సెంటరుకు సాయంత్రం 5.20 గంటలకు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. రాత్రి 7.10 గంటలకు రోడ్డుమార్గం ద్వారా విజయవాడకు బయలుదేరి వెళతారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, పెడన నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని నాలుగు రోజులుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రెండు నియోజకవర్గాల్లో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు.



బీసెంట్‌రోడ్డులో చలువ పందిళ్లు

కల్యాణ వైభోగం

నగరం కల్యాణ శోభను సంతరించుకుంది. శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం జరిగే సీతారాముల కల్యాణానికి ఎక్కడికక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, పచ్చటి తోరణాలు, విద్యుద్దీప కాంతులతో బీసెంట్ రోడ్డు కల్యాణ కాంతులను ప్రసరించగా, ఏలూరు రోడ్డులోని రామాలయం ఉత్సవ వెలుగులతో మెరిసిపోయింది.



బీసెంట్‌రోడ్డులో విద్యుద్దీప కాంతులు

డబ్బుపోయె... కేసులు పెట్టే..

ఆ ఐదుగురు మైనర్లు వైసీపీ జెండాలు పట్టినవారే..





అజిత్‌సింగ్‌నగర్‌లోని రోడ్డుపై ఆందోళన చేస్తున్న వడ్డెర కాలనీవాసులు

అజిత్‌సింగ్‌నగర్‌లోని వడ్డెర కాలనీ అది. పేదవర్గానికి చెందినవారే అక్కడ అధికులు. కుటుంబమంతా ఏ ఉపాధి లభిస్తే దానికి వెళ్లిపోతారు. పురుషులు ఎక్కువగా మట్టి పనులకు వెళ్తుంటారు. ఇక్కడున్న కొంతమంది మహిళలు వీఎంసీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తుంటారు. విద్యను మధ్యలో ఆపేసిన పిల్లలనూ పనులకు పంపుతారు. అటువంటి వారు సీఎం జగన్ పర్యటనలో పాల్గొంటే నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చని భావించారు. జెండాలు పట్టుకుని ముందుకు కదిలారు. అయితే, అందుకు ప్రతిఫలం దక్కకపోగా, చిక్కులు ఎదురయ్యాయి. సీఎం జగన్‌పై రాయి దాడి చేసింది ఆ కాలనీలోని ఐదుగురు మైనర్లు అంటూ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది.

విజయవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం చేపట్టిన సీఎం జగన్ రోడ్ షోకు స్థానిక నేతలు భారీగా జనాన్ని సమీకరించారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి వైసీపీ జెండాలు పట్టుకుంటే మహిళలకు రూ.200 ఇస్తామని చెప్పారు. పురుషులకైతే రూ.200తో పాటు క్వార్టర్ మందు సీసా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ డబ్బు దేనికైనా ఉపయోగపడుతుందని పురుషులు, మహిళలు ముందుకొచ్చి జెండాలు పట్టుకున్నారు. అక్కడితో ఆగకుండా తమ పిల్లలతోనూ జెండాలు పట్టుకునేలా చేశారు. ఇదే ఇప్పుడు వారి మెడకు చుట్టుకుంది. ఇలా జెండాలు పట్టుకున్న ఐదుగురు మైనర్లు రాయి దాడిలో నిందితులుగా పేర్కొంటూ మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డబ్బులిస్తామని జనాన్ని సమీకరించిన నేతలు కొంతమందికే ఇచ్చారు. ఇంకొంతమందికి ఇస్తామన్న డబ్బు కూడా ఇవ్వలేదు. దీంతో వారు ఆ జెండాలను వడ్డెర కాలనీకి సమీపంలోనే పడేశారు.

ప్రధాన నిందితుడి పుట్టినరోజా?

సీఎం జగన్‌పై ఈనెల 13వ తేదీన అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద రాయితో దాడి జరిగింది. ఆదేరోజు ఈ ఐదుగురు మైనర్లు పుట్టినరోజు వేడుక చేసుకున్నట్టు

- డబ్బులిస్తామని తీసుకొచ్చిన నాయకులు
- కూలీ ఇవ్వకపోవడంతో జెండాలు పక్కనపడేసి వెళ్లిపోయిన బాలురు
- వారే ప్రధాన నిందితులని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మైనర్ల అరెస్టుతో రోడ్డెక్కిన వడ్డెరకాలనీ వాసులు
- తమ పిల్లలను చూపించాలంటూ తల్లిదండ్రుల ఆందోళన

చెబుతున్నారు. ఈ ఐదుగురిలో ప్రధాన నిందితుడిగా ప్రచారం జరుగుతున్న బాలుడి పుట్టినరోజును నిర్వహించినట్టు స్థానికులు చెబుతున్నారు. డాబాకొట్లు సెంటర్ దాటాక ఎడమ వైపున వడ్డెర కాలనీ ఉంది. ఆ రోజు రాత్రి 10.30 గంటల సమయంలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న బాలుడి పుట్టినరోజును జరుపుకొన్నారు. వీధిలోని రహదారిపై కేక్ కట్ చేశారు. ఆ సమయంలో పోలీసులు అక్కడికి వెళ్లారని, రోడ్డుపై ఇలాంటి వేడుకలు చేయవద్దని కేకలు వేశారని స్థానికులు అంటున్నారు. దీనికి ప్రధాన నిందితుడిగా ఉన్న బాలుడు పోలీసులతో ఆవేశపూరితంగా మాట్లాడినట్టు చెబుతున్నారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

ఐదుగురు మైనర్ల కుటుంబ సభ్యులు, కాలనీవాసులు మంగళవారం మధ్యాహ్నం రోడ్డెక్కారు. కాలనీ ఆర్చి ముందు బైఠాయించి నినాదాలు చేశారు. తమ పిల్లలను చూపించకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది ఒంటిపై పెట్రోలు పోసుకుంటామన్నారు. ఉదయం నుంచి జరిగిన పరిణామాలతో వడ్డెర కాలనీలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. డబ్బులు ఇస్తామని జెండాలు పట్టించిన నేతలు ఇప్పుడు కనీసం కనిపించకపోయే సరికి వారు రగిలిపోతున్నారు. అనుమానితులుగా స్టేషన్‌కు వెళ్లినవారు తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. కాగా, ఈ ఐదుగురు ఇళ్లకు వస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

- రూ.10 కోట్లతో రిటైర్డు హెచ్ఎం పరార్
- జంక్షన్ పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు



హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 16 : నీతిగా బతకాలని, నిజాయితీగా నడవాలని విద్యార్థులకు పాఠాలు నేర్పిన గురువు నీతి తప్పారు. డబ్బుకు ఆశపడి, జనం నుంచి చిట్స్ పేరుతో డబ్బులు వసూలు చేసి రూ.10 కోట్లు తీసుకుని తన కొడుకుతో కలిసి పరార్ అయ్యారు. ఈ ఘటన హనుమాన్ జంక్షన్‌లో మంగళవారం వెలుగుచూసింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జనార్దన్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. ఉపాధ్యాయ సంఘం నేతగా తురకా పుల్లయ్య మాస్టారుకు పేరుంది. బాపులపాడు మండలం వీరవల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ పొందారు. అతని కుమారుడు అశోక్‌రాజు స్థానిక కెఎస్ టాకీస్ రోడ్డులో లక్ష్మీవేంకటేశ్వర చిట్ ఫండ్స్ పేరుతో నెలవారీ చిట్‌లు నిర్వహించారు. 14 ఏళ్లుగా చిట్స్ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుడిగా పలుకుబడి ఉపయోగించి పుల్లయ్య తన తోటి ఉపాధ్యాయులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో చిట్‌లు కట్టించారు. చిట్‌లు కట్టిన వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేదు. చిట్స్ పాడుకున్న వారికి దాదాపు రూ.10 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కనీసం ఫోన్ కూడా తీయడం లేదు. ఈనెల 10వ తేదీ నుంచి తండ్రీకొడుకులు గ్రామం వదిలి పారిపోయారు.



వసంత, కేశినేని చిన్నిని గెలిపించాలని దళితులకు పిలుపునిస్తున్న వర్ల రామయ్య

దళిత ద్రోహి జగన్

దళిత శంఖారావ సభలో టీడీపీ నాయకులు

మైలవరం, ఏప్రిల్ 16 : ఎందరో దళితుల ఉసురుపోసుకుని, మాస్కులు ఇవ్వమని అడిగినందుకు దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను అతికిరాతకంగా పొట్టన పెట్టుకున్న దళిత ద్రోహి సీఎం జగన్ అని, దళితులంతా ఐక్యమై జగన్‌ను గద్దె దించాలని, దళితులకు మేలు కలగాలంటే చంద్రబాబు సీఎం కావాలని ఏపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థిని తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. మైలవరంలో మంగళవారం రాత్రి జరిగిన దళిత శంఖారావ సభలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు దళితులకు అనేక మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ తర్వాత అనేక రకాలుగా చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఆయనకు దళితులంటే గిట్టదని, ఏనాడైనా పక్కన కూర్చోబెట్టుకున్నాడా అని ప్రశ్నించారు. జగన్ మాయమాటలు నమ్మొద్దన్నారు. యువత, మగవారిని గంజాయికి, మద్యానికి బానిసలుగా చేసిన జగన్‌కు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మైలవరం కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్, విజయవాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి కేశినేని చిన్నిని దళితులంతా ఆదరించి మంచి మెజారిటీతో గెలిపించాలని చెప్పారు. దళితులను గౌరవించేది చంద్రబాబు మాత్రమేనని, ఆయన్ను సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలోని దళితులను ఐదేళ్ల పాటు గుండెల్లో పెట్టుకుని చూసుకున్నానని, ఇకపై కూడా అలాగే చూసుకుంటామన్నారు. ఎస్సీ సామాజిక భవనాల నిర్మాణానికి కృషి చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే దళితుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ చంద్రబాబు దళితుల అభ్యున్నతికి నిరంతరం పని చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అనేక మంది దళితులు హత్యలకు, దాడులకు గురయ్యారన్నారు. వైసీపీ పాలనలో దళితులకు రక్షణ లేదని, సంక్షేమం లేదని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు సైతం పక్కదారి పట్టాయన్నారు. దళితులకు రక్షణ, సంక్షేమ ఫలాలు అందాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతుల బాలకోటయ్య, శావల దేవదత్, జనసేన నాయకులు అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), బీజేపీ నాయకులు నూతలపాటి బాలకోటేశ్వరరావు (బాల), ఎస్సీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సభకు పెద్ద ఎత్తున హాజరైన దళితులు

రేపే నోటిఫికేషన్

ఎల్లుండి నుంచి నామినేషన్ల సందడి

- 19న కేశినేని చిన్ని నామినేషన్‌కు ఏర్పాట్లు
- దుర్గగుడి నుంచి సబ్ కలెక్టరేట్ వరకూ ర్యాలీ
- చాలామంది వైసీపీ అభ్యర్థులూ ఆ రోజే..
- 22న కూడా అధికంగానే..
- అక్రమ కేసులపై విపక్ష అభ్యర్థుల్లో ఆందోళన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో కీలక ఘట్టమైన నోటిఫికేషన్ గురువారం వెలువడనుండటంతో అభ్యర్థులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసుకునే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఆ హడావిడిలో ఉన్నారు. అధికార వైసీపీ, ప్రతిపక్ష కూటమికి చెందిన అభ్యర్థుల్లో అధికశాతం మంది ఈనెల 19న నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని చిన్ని ఆరోజే నామినేషన్ దాఖలు చేస్తారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రకాశం బ్యారేజీ వద్ద ఉన్న దర్గా నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయనతో పాటు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు చెందిన పలువురు వైసీపీ అభ్యర్థులు కూడా అదేరోజు నామినేషన్ దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక టీడీపీ అభ్యర్థుల్లో అధికశాతం మంది 22న నామినేషన్ దాఖలు చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

అనుమానాలు అనేకం..

ఈ నెల 25తో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుంది. 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 29 సాయంత్రం వరకు ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. అదేరోజు సాయంత్రం అర్హులైన అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. ఇప్పటికే అధికార వైసీపీ, ప్రధాన ప్రతిపక్ష కూటమి తమతమ అభ్యర్థులను ప్రకటించాయి. వారంతా ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోవైపు నామినేషన్ల ప్రక్రియపై టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అధికార వైసీపీ ఒత్తిళ్లకు లోనవుతున్న పలువురు అధికారులు నామినేషన్ల ప్రక్రియలో పక్షపాత ధోరణితో వ్యవహరించే అవకాశాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ఇచ్చే సమాచారంతో రిటర్నింగ్ అధికారి సంతృప్తి చెందకపోతే తిరస్కరించే అవకాశం ఉంది. అందుకే ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ ఇప్పటికే నామినేషన్లపై కసరత్తు మొదలుపెట్టారు. ప్రతిపక్ష కూటమికి చెందిన అభ్యర్థులు నామినేషన్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకునేందుకు ఒక్కో అభ్యర్థి ఇప్పటికే ఇద్దరు న్యాయవాదులను నియమించుకుని ఒకటికి రెండుసార్లు పరిశీలన చేయించుకుంటున్నారు. విపక్ష పార్టీలకు చెందిన చాలామంది అభ్యర్థులపై అధికార వైసీపీ పలు కేసులు బనాయించింది. ఈ కేసుల వివరాలపై ఇప్పటికే న్యాయస్థానాలను ఆశ్రయించి మరీ అభ్యర్థులు తమకు కావాల్సిన సమాచారం పొందారు. అయినప్పటికీ ఇంకా తమకు తెలియకుండా ఏమైనా కేసులు ఉన్నాయేమోనని వారు ఆందోళన పడుతున్నారు. వీటిని సాకుగా చూపి నామినేషన్ తిరస్కరించే అవకాశం లేకపోలేదన్నది వారి ఆందోళనకు కారణం.

విజయవాడ-హైదరాబాద్ ఎయిరిండియా కొత్త సర్వీస్

186 సీట్లతో కూడిన బోయింగ్ సర్వీసు ప్రారంభం

- హైదరాబాద్ రూట్‌లో ఇండిగోకు గట్టిపోటీ
- రోజూ ఉదయం 8.55 గంటలకు అందుబాటులో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : విజయవాడ-హైదరాబాద్ నడుమ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నూతన బోయింగ్ విమాన సర్వీసును ప్రవేశపెట్టింది. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి 186 సీట్లతో కూడిన ఈ భారీ బోయింగ్ సర్వీసు మంగళవారం ప్రారంభమైంది. ఈ విమాన సర్వీసును

- మిగతా 4లో





హైదరాబాద్‌కు నూతన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసు, (ఇన్‌సెట్‌లో) ప్రయాణికులకు బోర్డింగ్ పాస్ అందిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి

అవనిగడ్డలో బాలికపై వికృతం

- వీడియోలు తీసి భయపెట్టి మూడు రోజులపాటు లైంగిక దాడి
- కబడ్డీ శిక్షణ ముసుగులో దారుణం

అవనిగడ్డ, ఏప్రిల్ 16 : కబడ్డీలో మెలకువలు నేర్పిస్తామంటూ ఓ బాలికపై ముగ్గురు యువకులు మూడు రోజులపాటు లైంగిక దాడికి పాల్పడిన ఘటన అవనిగడ్డలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డీఎస్పీ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. అవనిగడ్డకు చెందిన బాలిక స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. పట్టణానికి చెందిన పడమటి కొండలరావు, తోకల పవన్ (ఆర్నాల్డ్), డి.విష్ణు స్థానిక క్రీడా మైదానంలో కబడ్డీ ఆడుతూ ఉంటారు. వారిలో తోకల పవన్ కబడ్డీ ఆడే పిల్లలకు శిక్షణ కూడా ఇస్తుంటాడు. ఈ తరుణంలో పదో తరగతి బాలికతో సాన్నిహిత్యం పెంచుకున్న కొండలరావు... పవన్ ద్వారా కబడ్డీలో మెలకువలు నేర్పిస్తామని నమ్మబలికి ఆమె వీడియోలు తీశారు. తమకు లొంగకుంటే వాటిని బయట పెడతామని బెదిరించారు. ముగ్గురు వేర్వేరుగా ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మూడు రోజులపాటు ఆమెను తమ గదికి పిలిపించుకుని అఘాయిత్యానికి ఒడిగట్టారు. జరిగిన ఘోరాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తమ విచారణలో తోకల పవన్, డి.విష్ణు, పడమటి కొండలరావు బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్టు తేలిందని, బాధితురాలిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి వైద్యపరీక్షలు చేయించామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.



ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న కేశినేని శివనాథ్(చిన్ని)

క్షౌరశాలలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

» నాయీబ్రాహ్మణుల సంఘం ఆత్మీయ సమావేశంలో కేశినేని చిన్ని

విద్యాధరపురం, ఏప్రిల్ 16 : వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే క్షౌరశాలలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నాయీబ్రాహ్మణుల సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివనాథ్ మాట్లాడుతూ, టీడీపీకి బీసీలు వెన్నుముక అని.. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడగానే మున్సిపల్ భవన్ హాలులో సెలూన్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. కో-ఆప్షన్ మెంబర్లుగా నాయీబ్రాహ్మణులకు అవకాశమిస్తామని, షాపుల పేరున రుణాలిప్పిస్తామని చెప్పారు. నాయీ బ్రాహ్మణులకు టీడీపీ అండగా ఉంటుందని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో కమ్యూనిటీ హాల్ కావాలని నాయీ బ్రాహ్మణులు కోరగా చిన్ని స్పందిస్తూ గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో పూర్తి చేస్తామని చెప్పారు. కొండప్రాంతంలో ఇళ్లపట్టాల సమస్యను పరిష్కారిస్తామన్నారు. నాయీ బ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతారామ్, సాధికారిక సభ్యుడు ఎస్.అప్పారావు, నాయకులు ఎస్.నాగరాజు, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, టీడీపీ నాయకులు ఎంఎస్ బేగ్, జాస్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏపాటిల్, అధికారులు

ఘనంగా రైల్వే ఆవిర్భావ దినోత్సవం

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 16: రైల్వేశాఖ ఇంకా ఎన్నో ఏళ్లపాటు ప్రయాణికులకు సంతోషకరమైన ప్రయాణాలు అందించాలని సురక్షితంగా, సమర్థవంతంగా రైల్వే వ్యవస్థగా కొనసాగాలని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. 171వ రైల్వే ఆవిర్భావ దినోత్సవం మంగళవారం స్థానిక రైల్వే డివిజన్ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు, డివిజనల్ అధికారులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరమాయన జాతీయ రవాణా సంస్థ రైల్వే చేస్తున్న కృషిని కొనియాడారు. ముంబాయి నుంచి థానే వరకు మొదటి ప్యాసింజర్ రైలు నడిచిన దగ్గర్నుంచి ఇప్పటి వరకూ సాగిన ప్రగతిని ఆయన గుర్తు చేశారు. ఏడీఆర్ఎం పి.ఈ ఏడ్విన్, కొండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యాటరింగ్ స్టాళ్లలో ఆకస్మిక తనిఖీ

స్థానిక రైల్వేస్టేషన్‌లోని క్యాటరింగ్ స్టాల్స్‌ను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. 1వ నెంబర్ ప్లాట్‌ఫారమ్ నుంచి అన్ని ప్లాట్‌ఫారాలపై ఉన్న రైలు దాబా, క్యాటరింగ్ స్టాల్స్, ఐఆర్‌సీటీసీ ఫాస్ట్‌ఫుడ్ యూనిట్లు, వాటర్ వెండింగ్ మెషీన్లను పరిశీలించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, ప్రమాణాలు, ఆహార వస్తువులపై గడువు తేదీలు పరిశీలించారు. ప్రయాణికులు, స్టాళ్లవారితో ఆయన మాట్లాడారు. డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనలు ఉన్నతంగా ఉండాలి

● కెనరాబ్యాంకు జీఎం రవివర్మ



ర్యాంప్ వాక్ చేస్తున్న విద్యార్థిని

మొగల్రాజపురం, ఏప్రిల్ 16: విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించినపుడే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని కెనరాబ్యాంకు విజయవాడ జీఎం పి.రవివర్మ అన్నారు. పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర సాయిలో మాగ్నోవా 2కే 24 ఈవెంట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, హార్డ్ వర్క్‌ను విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. కళాశాల డీన్ రాజేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమలోని నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. ఈవెంట్‌లో అబౌట్ కాలేజ్, సమ్స్ మాగ్నోవా, మాస్టర్ మైండ్స్ (యంగ్ మేనేజర్) బిజ్‌బ్లాస్ట్, బి క్విజ్, మార్కెట్ మేకర్స్, ఐపీఎల్ ఆక్షన్, రీల్ మేకర్, మిస్టర్ అండ్‌మిస్ మాగ్నోవా వంటి పోటీలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 30 కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి కేవీ రమేష్ చంద్ర, డైరెక్టర్ వేమూరి బాబురావు, ఈవెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, కె.విజయ్, డాక్టర్ శ్రీనివాసులు, పి.కిషోర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గద్దె, బొండాకు చిత్రపటాలను అందజేస్తున్న గోపాలకృష్ణ

టీడీపీతోనే తూర్పు అభివృద్ధి సాధ్యం

● టీడీపీ సీనియర్ నేత ఆళ్ల గోపాలకృష్ణారావు

పటమట, ఏప్రిల్ 16: తూర్పు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనేనని టీడీపీ సీనియర్ నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ ఘన విజయం సాధించాలని కోరుతూ హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని గద్దె రామ్మోహన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంటుపడిన అభివృద్ధి తిరిగి కొనసాగాలంటే ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలన్నారు. పార్టీ నేతలు కొరివి పార్థసారథి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర పాల్గొన్నారు.

బొండా గెలుపుతోనే సెంట్రల్ అభివృద్ధి

మొగల్రాజపురం: రాష్ట్రం, సెంట్రల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే సీఎంగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా బొండా ఉమా గెలుపుతోనే సాధ్యమని ఆళ్ల గోపాలకృష్ణ చెప్పారు. ఎన్డీయే కూటమి బలపరచిన చంద్రబాబు, బొండా ఉమా గెలుపుకోసం తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్రతో కలిసి జంక్షన్ అభయాంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేయించి ప్రసాదాలు, స్వామి శేషవస్త్రం, చిత్రపటాన్ని స్థానిక బొండా నివాసంలో ఆయనకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొండా ఉమా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంతో అభివృద్ధి చేశారని, అలాంటి అభివృద్ధే కొనసాగాలంటే బొండా ఉమాను గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ధర, బరువు ముద్రించకపోతే కేసులు!

● కంపెనీలకు తూనికలు-కొలతలశాఖ హెచ్చరిక

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంపెనీలు తమ ఉత్పత్తుల గురించి వివిధ టీవీ చానళ్లు, పత్రికల్లో ప్రకటనలు ఇచ్చే సమయంలో తాము తయారు చేసే ప్యాకేజీలపై గరిష్ఠ చిల్లర ధర(ఎంఎస్‌పీ), నికర బరువును కూడా తప్పనిసరిగా ముద్రించాలని రాష్ట్ర తూనికలు, కొలతలశాఖ స్పష్టం చేసింది. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించింది. 'గతేడాది అక్టోబరు 4న ఒక యూట్యూబ్ చానల్‌లో బ్రూ ఇన్‌స్టెంట్ కాఫీ వాణిజ్య ప్రకటన ప్రసారమైంది. అందులో ఆ ప్యాకేజీపై నికర బరువును పేర్కొనలేదు. విషయాన్ని గుర్తించిన లీగల్ మెట్రాలజీ-విశాఖపట్నం అధికారులు హిందూస్తాన్ యూనిలీవర్ కంపెనీపై చట్ట ప్రకారం కేసు నమోదు చేశారు. ఆ అడ్వర్టైజ్‌మెంట్ ప్రసారం చేసిన చానల్ ప్రైవేట్ చానల్ అని, అది తమ అధీకృత చానల్ కాదంటూ కంపెనీ ప్రతినిధులు లీగల్ మెట్రాలజీకి అప్పీలు చేసుకున్నారు. ఆ అప్పీలు పరిశీలనలో ఉంది' అని లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ వివరించారు.

కొడాలిపై సీఎం వ్యాఖ్యలు విడ్డూరం : వెనిగండ్ల

గుడివాడ, ఏప్రిల్ 16 : కొడాలి నానికి మరో అవకాశమిస్తే దగ్గరుండి పనిచేయిస్తానని సీఎం జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందని, నేటి వరకు నియోజకవర్గానికి నాని ఏమి చేయలేదని జగన్ ఒప్పుకున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం 35వ వార్డులో కొత్త చంద్రశేఖర్ ఇంటి వద్ద విలేకర్ల సమావేశంలో వెనిగండ్ల మాట్లాడుతూ, సోమవారం గుడివాడలో జరిగింది సిద్ధం సభ కాదని, విధ్వంసం సభ అని ఎద్దేవా చేశారు. జగన్ నియోజకవర్గానికి హామీల వర్షం కురిపిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూసారని, వారి ఆశలు అడియాశలు చేశారన్నారు.

సర్వం సిద్ధం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

» నామినేషన్, అఫిడవిట్ సమర్పణలో అభ్యర్థులు జాగ్రత్త వహించాలి..

» 18 నుంచి 25వ తేదీవరకు నామినేషన్ల స్వీకరణ

» 26న పరిశీలన, 29న ఉపసంహరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఇతర అధికారులు

కృష్ణలంక, ఏప్రిల్ 16 : ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికలకు ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ జరగనుందని, నామినేషన్, అఫిడవిట్‌ల సమర్పణలో జాగ్రత్త వహించాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల సమర్పణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శెలవు దినాల్లో మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా ఆర్వోల కార్యాలయాల్లోను, పార్లమెంట్ స్థానానికి కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్టు వివరించారు. అభ్యర్థి సహా ఐదుగురికి మాత్రమే ఆర్వో చాంబర్‌లోకి అనుమతి వుంటుందన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు 29వ తేదీ వరకు గడువు వుందని, ఆ తర్వాత పోటీలో నిలిచిన అభ్యర్థులను ఫారం-7ఎ ద్వారా ప్రకటించనున్నట్టు వివరించారు. జాతీయ, రాష్ట్రీయ గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్ పార్టీలు, ఇతరులను పరిగణలోనికి తీసుకొని తెలుగు అక్షర క్రమంతో బ్యాలెట్‌లో అభ్యర్థుల పేర్లను ఉంచనున్నట్టు తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థి రూ.25వేలు, అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థి రూ.10వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి వుంటుందని అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారైతే 50శాతం మేర సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి వుంటుందని కలెక్టర్ తెలిపారు.

ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

కృష్ణలంక, ఏప్రిల్ 16 : ఎన్నికల నిర్వహణలో ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మంగళవారం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో తీసుకోవాల్సిన అంశాలపై సీఈఓ ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఆర్వోల స్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అనంతరం కలెక్టర్ రిటర్నింగ్ అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ఆర్డీవోలు, ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అఫిడవిట్ (ఫారం 26) కీలకం..

నామినేషన్ పత్రాలతో పాటు (ఫారం 26) అఫిడవిట్ చాలా కీలకమని, దీని సమర్పణలో జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు. పాన్ వివరాలు, ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు స్థితి, పెండింగ్‌లో వున్న క్రిమినల్ కేసులు, నేరారోపణ కేసులు, చర, స్థిరాస్తుల తదితర వివరాలను పొందుపరచాల్సి వుంటుందని తెలిపారు. లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభకు పోటీచేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు వ్యయం చేసేందుకు అనుమతి వుందని, నామినేషన్ నుంచి వ్యయ నమోదు జరుగుతుందని వివరించారు. అభ్యర్థి రోజువారీ ఖాతాలు, నగదు రిజిస్టర్, బ్యాంకు లావాదేవీల రిజిస్టర్‌ను నామినేషన్ సమయంలో అభ్యర్థికి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి మే 11 వరకు మూడు సందర్భాల్లో ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రముఖ వార్తా పత్రికలు, చానల్‌లో క్రిమినల్ యాంటిసిడెంట్స్‌ను పబ్లిష్ చేయాల్సి వుంటుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో బి.కిరణ్ (ఐఎన్‌సీ), కె.పరమేశ్వరరావు (ఆప్), డీవీ కృష్ణ (సీపీఐ-ఎం), పీవీ శ్రీహరి (బీజేపీ), కె.వెంకటేష్ (బీఎస్‌పీ), షేక్ అబ్దుల్ సత్తార్ (వైసీపీ), వై.రామయ్య (టీడీపీ)లతో పాటు ఎన్నికల వ్యయ నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు పటిష్ట చర్యలు

కృష్ణలంక, ఏప్రిల్ 16 : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహరరెడ్డికి వివరించారు. సచివాలయం నుంచి మంగళవారం వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేఎస్ జవహరరెడ్డి సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపుతున్నామని, వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. శివారు గ్రామాలకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఉపాధి కూలీలకు షెడ్స్, తాగునీరు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జె.సునీత, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డీవీ రమణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అష్టభుజి దుర్గమ్మకు సంపెంగలతో అర్చన



వన్‌టౌన్, ఏప్రిల్ 16: ఇంద్రకీలాద్రిపై అష్టభుజి కనకదుర్గమ్మ మంగళవారం సొంపైన సువాసనల సంపెంగలతో కొలువుదీరారు. భక్తులు ఆమెను దర్శించుకుని కరుణించాలని వేడుకున్నారు. చైత్ర మాస వసంత నవరాత్రుల్లో భాగంగా దుర్గమ్మను 8వ రోజైన మంగళవారం అష్టమి తిథి సందర్భంగా లలితా సహస్రనామంతో చామంతి, సంపెంగ పూలతో అర్చించారు. చాంపేయ కుసుమ ప్రియా అటూ అమ్మవారిని కీర్తించారు. ఈవో రామారావు దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తొలుత పుష్పాలుంచిన బుట్టలను ఊరేగింపుగా మేళతాళాలు, వేదమంత్రాల మధ్య ఈవో రామారావు దంపతులు, అర్చకులు, సిబ్బంది, ఉద్యోగులు తీసుకువచ్చారు.

ఆంజనేయస్వామికి తమలపాకులతో పూజ

శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా క్షేత్రపాలకుడైన అంజనేయస్వామిని మంగళవారం తమలపాకులతో అర్చించారు. అమ్మవారి ఆలయం ఎదురుగా ధ్వజస్తంభం వద్ద మందిరంలో కొలువైన బంగారుతాపడ అంజనేయస్వామికి, ఇటు ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ సమీపంలోని మందిరంలో కొలువైన అంజనేయ స్వామికి తమలపాకులతో అర్చన చేసి సింధూరాది ద్రవ్యాలను సమర్పించారు. ఈవో రామారావు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళాలు

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి దాతలు విరాళాలు సమర్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన శ్రీ సాయి ఫణేంద్ర వర్మ, మీనా భారతి, కుటుంబసభ్యులు 1,00,116 విరాళాన్ని అందజేశారు. అలాగే నగరంలోని దేవీనగర్‌కు చెందిన ఈమని శ్రీనివాస్, జ్యోతి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దుర్గమ్మ దర్శనానంతరం వీరికి వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

జూన్ వరకు ట్యాంకర్లతో నీటి సరఫరా

● సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నింపాలి: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి అవసరాల దృష్ట్యా అన్ని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి ఉన్న ఆవాసాలకు జూన్ నెలాఖరు వరకు ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేయాలని నిర్దేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ట్యాంకర్లతో మంచినీటి సరఫరాకు జిల్లాల నుంచి వెంటనే ప్రతిపాదనలు పంపితే.. రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ కమిటీలో అనుమతులిస్తామన్నారు. నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ, ప్రకాశం బ్యారేజ్ నుంచి విడుదల చేసిన నీటితో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులన్నీ పూర్తిగా నింపి, ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,669 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు రూ.101 కోట్లతో చేపట్టిన మరమ్మతులు వారంలో పూర్తి చేయాలని, ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదించిన నీటి సంరక్షణ పనులను వెంటనే మొదలు పెట్టాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం రాష్ట్రంలో రోజుకు 240 మిలియన్ యూనిట్ల కరెంట్ డిమాండ్ ఉండగా, అందుకు తగ్గట్టు సరఫరా చేస్తున్నామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. రానున్న రోజుల్లో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

పట్టుకున్న ఇసుక లారీలు వదిలేశారు!

» పోలీసులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తోట్లవల్లూరు, ఏప్రిల్ 16 : రొయ్యూరు క్వారీలో ఈ నెల 14వ తేదీన అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను చర్యలు తీసుకోకుండా అధికారులు విడిచిపెట్టడంపై మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు దళిత నాయకుడు బండెల కోటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 2.45 గంటలకు క్వారీలోకి వచ్చి ఇసుక లోడుతో మూడు లారీలను ఎంతో సాహసం చేసి పట్టుకుని వీఆర్వో, పోలీసులకు అప్పగించామని, అయితే పోలీస్‌స్టేషన్‌కు లారీలను తీసుకెళుతున్నట్టు తమకు చెప్పి బయటకు వెళ్లాక వాటిని విడిచి పెట్టేశారని ఆరోపించారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే అవి ఖాళీ లారీలని అబద్ధం చెపుతున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కనుక ఆ అధికారులపై తగిన చర్యలు తీసుకుని, కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా ఇసుక క్వారీని నడపాలని విజ్ఞప్తి చేశామని కోటేశ్వరరావు తెలిపారు.

విజయవాడ-హైదరాబాద్ ఎయిరిండియా కొత్త సర్వీస్


(3వ పేజీ తరువాయి)

ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించి కేకును కట్ చేశారు. ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌ను అందించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రోజూ ఉదయం 8.55 గంటలకు ఈ విమానం బయల్దేరుతుంది. 10 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుంది. బోయింగ్ విమానంలో 8 బిజినెస్ క్లాస్, 178 ఎకానమీ క్లాస్ సీటింగ్ ఉంది.

ఇండిగో హవా తగ్గినట్టేనా..?

హైదరాబాద్‌కు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నూతన సర్వీసుతో ఈ మార్గంలో ఇతర విమానయాన సంస్థలతో పోటీ ప్రారంభమైంది. హైదరాబాద్ రూట్‌లో ఇప్పటి వరకు దేశీయ దిగ్గజ ప్రైవేట్ విమానయాన సంస్థ ఇండిగో ఏకచత్రాధిపత్యంతో నడిచింది. విజయవాడ నుంచి ప్రస్తుతం హైదరాబాద్‌కు 8 విమాన సర్వీసులు నడుస్తుండగా 7 సర్వీసులు ఇండిగో ఎయిర్‌లైన్స్‌వే. ఒకటి మాత్రం ఎయిరిండియాకు చెందినది. ఈ నూతన సర్వీసుతో హైదరాబాద్ రూటులో 9వ విమాన సర్వీసు మొదలైనట్టే. చార్మినార్-ఉండవల్లి కేవ్స్ పేరుతో ఈ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నడుస్తుంది. కాగా, ఈ కొత్త సర్వీసు ఇండిగోకు గట్టి పోటీ ఇవ్వనుంది. ధరలు తగ్గించే పరిస్థితి వస్తుందని భావిస్తున్నారు. ఇండిగో విమానాలన్నీ చిన్నవి కావటం, ఎయిరిండియాది భారీ బోయింగ్ కావడంతో ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది. కాగా, ఈ నూతన సర్వీసు ప్రారంభోత్సవంలో ఎయిరిండియా స్టేషన్ మేనేజర్ ఎం.పార్థసారథి, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా కూడేటి



విజయవాడ, ఏప్రిల్ 16: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా తనను నియమించినట్టు కూడేటి సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావుతో పాటు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు.



న్యాయవాదులపై ఎస్సీ, ఎస్టీ కేసులు సరికాదు

» సుంకర రాజేంద్ర ప్రసాద్

గన్నవరం, ఏప్రిల్ 16 : న్యాయవాదులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం సరికాదని ఆలిండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక రాయనగర్ కళ్యాణ మండపంలో ఐలు జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో గన్నవరంలో న్యాయవాదులపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును ఎత్తివేయాలని సదస్సు జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, న్యాయవాదులు ఓసీ, బీసీ అయినంత మాత్రాన ఎస్సీలను కులం పేరుతో తిట్టారని కేసులు పెట్టడం పద్ధతి కాదన్నారు. ఐలు యూనియన్‌లో సభ్యులుగా ఉన్నవారు సామాజిక దృక్పథం, క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలిపారు. న్యాయవాద వృత్తిని పవిత్రంగా భావిస్తామని కులాలతో సబంధం లేకుండా తమ దగ్గరకి వచ్చిన క్లైయింట్లకు న్యాయం చేస్తామన్నారు. పోలీసులు అట్రాసిటీ కేసు కట్టడం దారుణమన్నారు. వాస్తవాలు తెలుసుకుని కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఐలు రాష్ట్ర కార్యదర్శి మాధవరావు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు నిడమర్తి సౌజన్య, బడుగు బాలమ్మ, న్యాయవాది తిరివీధి వెంకయ్య, ఎం.విజయకుమార్, గన్నె వెంకట్రావు, ప్రభాకర్ చౌదరి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో వైసీపీ కార్యకర్త!

» సిద్ధం సభకు రాయితో వచ్చిన యువకుడు

» ఒన్‌టౌన్‌లో గుట్టుగా విచారణ

గుడివాడ, ఏప్రిల్ 16 : ఒక యువకుడు రాయితో గుడివాడ సిద్ధం సభలో పోలీసులకు చిక్కడం సంచలనమైంది. సోమవారం 'మేమంతా సిద్ధం' సభకు కంకిపాడు మండలం మంతెన గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కోట శరత్‌కుమార్ తోటి కార్యకర్తలతో కలిసి గుడివాడ వచ్చాడు. సభ వద్ద తనిఖీల్లో యువకుడి వద్ద రాయి గుర్తించి వెంటనే శరత్‌ను ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంతెన నుంచి సభకు బస్సుల్లో వచ్చే క్రమంలో శరత్ ఫూటుగా మద్యం సేవించి గొడవచేశాడు. ఇస్తామన్న రూ.300లు ఇవ్వాలని పట్టుపట్టాడు. అధికంగా మద్యం సేవించినందున డబ్బులివ్వబోనని వైసీపీ నాయకుడు తేల్చి చెప్పినట్టు సమాచారం. దీంతో కోపోద్రిక్తుడైన శరత్ వైసీపీ నేతతో గొడవకు దిగినట్టు సమాచారం. అనంతరం కొందరిపై శరత్ రాళ్లతో దాడి చేశాడని, మిగిలిన వారిని కొట్టేందుకు రాయిను జేబులో పెట్టుకుని వచ్చి ఉంటాడని సహచరులు చెబుతున్నారు. దీంతో తనిఖీల్లో యువకుడు రాయితో దొరికాడు. యువకుడితో పాటు అతడి కుటుంబసభ్యులు, మిత్రులను పోలీసులు విచారిస్తున్నారు. ఒన్‌టౌన్ స్టేషన్ నుంచి యువకుడిని ఎక్కడికి తరలించింది తెలియరాలేదు.

ప్రముఖ రచయిత అల్లాడి మృతి



తిరువూరు, ఏప్రిల్ 16 : పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత అల్లాడి నారాయణరావు(83) సోమవారం రాత్రి మృతి చెందారు. తన రచనల ద్వారా తెలుగుభాషకు సేవలందించారు. 'తెనాలి రామకృష్ణ, ప్రభుత్వం కళ్లుమూసుకోలేదు, ఆహుతి, కర్ణహృదయం, భరత శపథం, అశ్వద్థామహతః', తదితర రచనలతో పాటు గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8వ తరగతి తెలుగు ఉపవాచకం కోసం నారాయణరావు రాసిన 'మణిదీపాలు' ఆయనకు మంచి పేరు తెచ్చింది. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నారాయణరావు మృతిపట్ల తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్, పలువురు రచయితలు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నావాళి అర్పించడంతో పాటుగా, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు.

కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయం

» బాబు, పవన్ సభకు హాజరవుతా : వేదవ్యాస్

పెడన, ఏప్రిల్ 16 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు తెలుపుతున్నట్టు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ప్రకటించారు. పెడన టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ వేదవ్యాస్ పట్టణంలోని తోటమూల ఫంక్షన్ హాలులో అభిమానులతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు సీటు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంచి స్థానం కల్పిస్తానని చంద్రబాబు నాయుడు తనకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. బుధవారం జరగనున్న చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌ల బహిరంగ సభలో పాల్గొంటానన్నారు. రాజకీయాలను, నియోజకవర్గ ప్రజలను వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. కాగా తొలుత అభిప్రాయాలు తెలపాలని అభిమానులను వేదవ్యాస్ కోరారు. అభిప్రాయాలు తీసుకున్నాక తన నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు.

తోడుగా ఉంటుందని తెస్తే.. దోచి పెట్టింది!

» పెద్దమ్మ ఆభరణాలను మాయం చేసిన బాలిక » ప్రేమికుడి కోసం 16 తులాల బంగారు నగల తాకట్టు » యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ గిరిధర్

బౌద్ధనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు తోడుగా ఉంటుందని తీసుకొచ్చిన మరదలి కూతురు ఏకంగా యజమాని (పెద్దనాన్న) ఇంటికే కన్నం వేసింది. ప్రియుడి మోజులో పడిన బాలిక అతడి మాయమాటలను నమ్మి పెద్దమ్మ బంగారు ఆభరణాలను అప్పగించింది. 16 తులాల నగలు, రూ.15 లక్షల నగదును ఉదారంగా అందజేసి ఏమి తెలియనట్టుగా ఉంది. ఇంటి యజమాని ఫిర్యాదుతో పోలీసులు యువకుడిని అరెస్ట్ చేశారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ ఆర్.గిరిధర్, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ వెల్లడించారు. చిలకలగూడకు చెందిన శ్రీనివాసరావు ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య జగ్గయ్యపేటలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ అక్కడ తన చెల్లెలు ఇంట్లో ఉంటుంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. అయితే భార్య ఉద్యోగం కారణంగా దూరంగా ఉండడంతో ఇంట్లో పిల్లలకు తోడుగా ఉండడంతో పాటు మంచి చదువులు చదివిద్దామని భావించిన శ్రీనివాసరావు తన భార్య చెల్లెలు (మరదలు) కూతురు (13)ను కొన్ని రోజుల క్రితం నగరంలోని తన ఇంటికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆమెను స్థానికంగా ఉండే ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఎనిమిదో తరగతి చదువుతోంది. అయితే కడప జిల్లా పెంటలమర్రి మండలంలోని వేలూరుపాడు గ్రామానికి చెందిన చెప్పలి విజయ్‌కుమార్‌రెడ్డి (19) బెంగుళూరులో పీజీ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. అతడికి స్నాప్‌చాట్‌లో అర్జున్‌రెడ్డి ప్లేబాయ్ అనే పేరిట ఐడీ ఉంది. ఈ క్రమంలో సదరు బాలికకు, యువకుడికి స్నాప్‌చాట్‌లో పరిచయమైంది. విజయ్‌కుమార్‌రెడ్డి బెంగుళూర్ నుంచి అప్పుడప్పుడు నగరానికి వచ్చి బాలికను కలుసుకునేవాడు. తన తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆస్పత్రిలో చూపించాలంటే చాలా డబ్బులు అవసరమున్నాయని బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించేవాడు. ప్రియుడి మాయమాటలను నమ్మిన బాలిక పెద్దమ్మ నగలను స్నేహితురాలి సాయంతో కుదువపెట్టి పలుదపాలుగా విజయ్‌కుమార్‌రెడ్డికి రూ.1,50,000 నగదును ఫోన్‌పే ద్వారా పంపించింది. తర్వాత మరికొద్ది రోజులకు మరో 16 తులాలను యువకుడికి ఇచ్చింది. కాగా, ఏప్రిల్ రెండో తేదీన పెద్దనాన్న శ్రీనివాసరావు జేబులో ఉన్న రూ.3వేల నగదును కనిపించకపోవడంతో ఆయన అప్రమత్తమయ్యాడు. బాలికపై అనుమానమొచ్చిన శ్రీనివాసరావు జగ్గయ్యపేటలో ఉన్న తన భార్య, మరదలకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపాడు. ఈ మేరకు అతడి భార్య చిలకలగూడలోని ఇంటికి వచ్చి బంగారు ఆభరణాలను వెతకగా.. ఒక్కటి కూడా కనిపించలేదు. దీంతో శ్రీనివాసరావు తన ఇంట్లో బంగారు నగలు కనిపించడం లేదని ఏప్రిల్ 2నాడే చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రంగంలో దిగిన పోలీసులు బాలిక సెల్‌ఫోన్‌ను చెక్ చేయగా స్నాప్‌చాట్‌లో విజయ్‌కుమార్‌రెడ్డితో చాటింగ్ చేసినట్లు గుర్తించి కొన్ని ఆధారాలను సేకరించారు. అనంతరం బాలికను విచారించగా నగదు, నగలు యువకుడికి ఇచ్చినట్లు ఆమె అంగీకరించింది. సోమవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం అతడి వద్ద నుంచి రూ. 9.06 లక్షలు విలువ చేసే 16 తులాల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాలిక పంపిన డబ్బులు, బంగారు నగలను కుదువ పెట్టి తీసుకున్న డబ్బులతో విజయ్‌కుమార్‌రెడ్డి ఆన్‌లైన్ బెట్టింగ్, బైక్ రైడింగ్, ధూమపానం, మద్యం సేవిస్తూ జల్సాలు చేసేవాడని పోలీసులు తెలిపారు. విజయ్‌కుమార్‌రెడ్డిపై పోక్సోతో పాటు దొంగతనం కేసును నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.04

మత సామరస్యాన్ని కాపాడుకోవాలంటే కమ్యూనిస్టులనే గెలిపించాలి

వన్‌టౌన్, ఏప్రిల్ 16: మత సామరస్యాన్ని కాపాడుకోవాలంటే కమ్యూనిస్టులనే గెలిపించుకోవాలని పశ్చిమ ఇండియా కూటమి బలపరచిన సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన 54వ డివిజన్‌లోని వించిపేటలో ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని అటువంటి బీజేపీతో టీడీపీ-జనసేనలు పొత్తు పెట్టుకున్నాయని, మతోన్మాద బీజేపీకి వైసీపీ వంత పాడడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. విజయవాడ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని, సీపీఐ, సీపీఎం అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించాలని కోరారు. నక్కా వీరభద్రరావు, మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణరావు, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల మహిళలు హారతులు సమర్పించారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు లక్ష్యం

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గద్దె

పటమట, ఏప్రిల్ 16: చంద్రబాబు నాయుడు సీఎం కాకపోయినా ఆయనకు ఏమీ కాదని, రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోతుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 12వ డివిజన్ అయ్యప్పనగర్‌లోని గొట్టిపాటి బ్రహ్మయ్య వీధిలో మంగళవారం నివాసితులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శివనాథ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు తపన అంతా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమనేనన్నారు. జనసేన తూర్పు ఇన్‌ఛార్జి అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అండగా ఉంటున్న గద్దె రామ్మోహన్‌ను ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించాలన్నారు. బీజేపీ నాయకుడు దిలీప్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌పై ప్రధాని మోదీకి ప్రత్యేకమైన దృష్టి ఉందన్నారు. కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, శాయన బుజ్జి, జి. వెంకటేశ్వరరావు, కామినేని రవి, అబ్దుల్ కరీమ్‌లు పాల్గొన్నారు.

భారతీనగర్: అమరావతి నగరాన్ని విచ్ఛిన్నం చేసిన జగన్‌ను, ఆ పార్టీ తరుపున పోటీ చేసే ప్రతి ఒక్కరినీ ఓడించాలని గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మూడవ డివిజన్ రామచంద్రనగర్ కాలనీలోని సాయిహైట్స్, క్రైజాన్ సీతారామ్ అపార్టమెంట్ వాసులతో గద్దె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వచ్చే



కరపత్రాలు పంపిణీ చేస్తున్న గద్దె అనురాధ

ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తాడి బాబురావు, యలమంచలి రాజేంద్రప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

తూర్పు ప్రజలకు 'గద్దె' అండ

లబ్బీపేట: గత ఐదేళ్ల టీడీపీ అధికారంలో లేకపోయినా తూర్పు ప్రజలకు ఎమ్యెల్యే గద్దె రామ్మోహన్ అండగా ఉన్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. మంగళవారం 19వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలో లేకపోయినా నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండి ఏ సమస్య వచ్చినా వెంటనే అక్కడ ప్రత్యక్షమయ్యే నాయకుడు గద్దె రామ్మోహన్ అని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఎన్నికల్లో గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు.

పటమట: 11వ డివిజన్‌లోని పటమట సాయిహోటల్ నుంచి జనసేన, బీజేపీలు బలపర్చిన టీడీపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోనేరు రాజేష్, నాగేశ్వరరావు, పి. సుజాత, కె. నాగమణి, పి.దుర్గాప్రసాద్, ఎన్.ఉషారాణిలు పాల్గొన్నారు.

'గద్దె'ను బలపర్చండి: గద్దె క్రాంతి

తూర్పును అభివృద్ధి చేస్తూ నిత్యం ప్రజలకు అండగా ఉండే గద్దె రామ్మోహన్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. 10వ డివిజన్‌లో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరారు. దేవినేని అపర్ణ, గద్దె హేమాన్షు, యార్లగడ్డ కృష్ణమూర్తి, మన్నే జయప్రకాష్, పి.జగన్మోహన్‌రావు, రాజమణి, బసవేశ్వరరావులు పాల్గొన్నారు. ● తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కోరుతూ మంగళవారం యువ నాయకులు గద్దె క్రాంతికుమార్, గద్దె హేమాన్షులు 9వ డివిజన్‌లోని పటమటలంక కేశవ టవర్స్ వద్ద ఎన్నికల ప్రచారం చేశారు. కాంతి శ్రీ, సీహెచ్.లక్ష్మి, కె.భవానీ పాల్గొన్నారు.

పశ్చిమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి

చిట్టినగర్, ఏప్రిల్ 16: పశ్చిమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతోపాటు అన్ని హంగులతో నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానని, ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని పశ్చిమ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి తెలిపారు. మంగళవారం 46, 47 డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులతో కలసి సుజనా చౌదరి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని కూటమి చేపట్టనున్న అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రజలకు అందుబాటులో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తానన్నారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ సీనియర్ నేత కె.నాగుల్‌మీరా, 46, 47 డివిజన్ల అధ్యక్షులు నాగోతి రామారావు, డి. ప్రభుదాస్, టీడీపీ నాయకులు గుర్రం కొండ, బీజేపీ నగర అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, సీనియర్ నాయకులు పైలా సోమినాయుడు, బలివాడ శివకుమార్‌పట్నాయక్, భోగవల్లి శ్రీధర్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సుజనా చౌదరి, పక్కనే బుద్దా, నాగుల్‌మీరా, శ్రీరామ్

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తా

రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నవిరి మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం చిట్టినగర్ ఈద్గా మసీదులో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి మాట్లాడుతూ సమాజంలో నాయీ బ్రాహ్మణులు గౌరవంగా బతికేందుకు సొంతంగా షాపులు నిర్వహించేలా బ్యాంక్ లోన్‌లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ మిల్క్ ప్రాజెక్ట్ ప్రాంతంలో నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాగుల్‌మీరా, బీజేపీ నగర అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నాయీ బ్రాహ్మణ నాయకులు శాంతారామ్, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

చిరంజీవి అభిమానులు అండగా నిలవాలి

పశ్చిమ నియోజకవర్గ చిరంజీవి అభిమానుల సంఘం అధ్యక్షుడు పులిచేరి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం చిట్టినగర్ ఎస్‌వీ ఫంక్షన్‌లో చిరంజీవి అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి మాట్లాడుతూ కూటమి గెలుపు కోసం చిరంజీవి, పవన్ కల్యాణ్ అభిమానులు కృషి చేయాలన్నారు. బీజేపీ నగర అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన నాయకురాలు రజిని ఠాకూర్, చిరంజీవి అభిమానులు, జనసైనికులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతరాజరాజేశ్వరి పేట: పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి స్థానిక 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరిపేట ర్యాంపు నుంచి సాయిబాబా గుడి వరకు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంలో సుజనా చౌదరి మాట్లాడుతూ పాతరాజరాజేశ్వరి పేటలోని రైల్వే స్థలాల్లో అనేక ఏళ్లుగా పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారని వారి ఇళ్ల పట్టాల సమస్యను కూటమి అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. ఎన్డీఏ కూటమికి మద్దతు ఇచ్చి ఎంపీగా కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు నాగుల్‌మీరా, అడ్డూరి శ్రీరామ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 16 : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అజిత్‌సింగ్‌నగర్ అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్. రమేష్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వాంబేకాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం అపార్ట్‌మెంట్స్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ముద్రించిన కరపత్రాలను స్థానికులకు అందజేశారు.

పదిమంది పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ. 1,46,500 స్వాధీనం

పాయకాపురం, ఏప్రిల్ 16 : పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులపై నున్న రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం నున్న గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1,46,500 స్వాధీనం చేసుకున్నారు. పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





జగన్‌రెడ్డికి ఓటు అడిగే నైతిక హక్కు లేదు

● కేశినేని జానకీ లక్ష్మి



ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి, పక్కన డివిజన్ అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య

విద్యాధరపురం, ఏప్రిల్ 16: జగన్‌రెడ్డికి ఓటు అడిగే నైతిక హక్కు లేదని కేశినేని శివనాథ్(చిన్ని) సతీమణి జానకీ లక్ష్మి అన్నారు. మంగళవారం సిరిపురపు ధనలక్ష్మీతో కలిసి ఆమె 40వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ మాట తప్పాడని, ఇచ్చిన మాటను తప్పిన జగన్‌కు ఓటు అడిగే నైతిక హక్కులేదని విమర్శించారు. కేశినేని శివనాథ్, సుజనాచౌదరిల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆకుల రాజేశ్వరరావు మిల్లు రోడ్డు దగ్గర నుంచి పరిసర ప్రసాద్ హోటల్ రోడ్డు వరకు ప్రచారం సాగింది. డివిజన్ పార్టీ ప్రెసిడెంట్ పి.వి చిన్నసుబ్బయ్య, కార్యదర్శి గాదు గణేష్, సురేష్, కే.శ్రీనివాసరావు, సీహెచ్ నాగరాజు, ఎం.నారాయణ, వెంకటేశ్వర్లు, దుర్గారావు, శివాజీ, ఆదినారాయణ పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపాలి

వన్‌టౌన్: రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి ప్రజల నెత్తిమీద భారం మోపిన జగన్‌ను రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపాలని కేశినేని శివనాథ్(చిన్ని) కుమారుడు కేశినేని వెంకట్, సుజనా చౌదరి కుమారుడు యలమంచిలి కార్తీక్ అన్నారు. మంగళవారం 53వ డివిజన్‌లో వారిద్దరూ సంయుక్తంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. స్థానికులను కలిసి మాట్లాడారు. పశ్చిమ అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న సుజనా చౌదరి గుర్తు కమలంపైన, విజయవాడ ఎంపీగా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్‌కు సైకిల్‌పైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. డివిజన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మైనార్టీ నాయకుడు ఇమ్రాన్, మహిళా నాయకురాలు లక్ష్మి, మధు పాల్గొన్నారు.

కేశినేని శివనాథ్, సుజనా చౌదరిలను గెలిపించండి

పాతరాజరాజేశ్వరి పేట: 35వ డివిజన్‌లోని పెజ్జోనిపేట, బాప్టిస్ట్ నగర్‌లో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం కేశినేని శ్రీదేవి, యలమంచిలి ఉమారాణి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ ఎన్డీయే అధికారంలోకి రాగానే చంద్రబాబు ముఖ్యమంత్రిగా అమలు చేయబోయే పథకాలను ప్రజలకు వివరించారు. కేశినేని శివనాథ్, సుజనా చౌదరిలను గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ పైడిమాల సుభాషిణి, బీజేపీ మహిళా నాయకురాలు బొద్దు నాగలక్ష్మి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిరోముండనం కేసులో త్రిమూర్తులకు జైలుశిక్ష హర్షణీయం

● ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 16 : దళితులకు శిరోముండనం కేసులో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు 18 నెలలు జైలు శిక్ష పడటం హర్షణీయమని సెంట్రల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బెజ్జం జైపాల్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 29 అసెంబ్లీ ఎస్సీ రిజర్వేషన్ల నియోజకవర్గాలలో వైసీపీ అభ్యర్థులను ఓడించడానికి దళితులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. నేతలు వేల్పుల రాజేష్, గౌస్ బాషా, షబ్బీర్ పాల్గొన్నారు.



కొత్తపేట నగరాల సీతారామస్వామి దేవస్థానంలో

కల్యాణోత్సవం కరపత్రం ఆవిష్కరణ

వన్‌టౌన్, ఏప్రిల్ 16: స్థానిక కొత్తపేట సెంటర్‌లోని నగరాల సీతారామస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామస్వామివార్ల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవస్థానం కమిటీ సభ్యులు కల్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. దుక్క మురళీధర్, వెంకటి దంపతులచే కల్యాణోత్సవం, తలంబ్రాల సమర్పణ జరుగుతుందని తెలిపారు. 18 సాయంత్రం 6 గంటలకు నూరు సంవత్సరాల చరిత్ర ఉన్న దివ్య రథం ఊరేగింపు జరుగుతుందన్నారు. 20న ఉదయం 10 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం 7 గంటలకు స్వామివారి పవళింపు సేవ ఉంటుందని చెప్పారు. మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, ఈది యల్లరావు, పణుకు రమ, ఈది యల్లరాజారావు, గూడేల రామకృష్ణ పాల్గొన్నారు.

వడ్డెర సామాజికవర్గానికి టీడీపీ అండ

● బొండా ఉమా



కరపత్రాలను ఆవిష్కరించిన బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 16 : టీడీపీ జెండా వడ్డెర సామాజిక వర్గానికి అండ అని టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో మంగళవారం వడ్డెర సాధికార సమితి ఆధ్వర్యంలో టీడీపీ రూపొందించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ వడ్డెర ఓబన్న జయంతిని అధికారికంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

పాయకాపురం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు రాష్ట్రాభివృద్ధికి మలుపు అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. 64వ డివిజన్ కండ్రికలో మంగళవారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని, టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమాను గెలిపించాలని కోరారు. నేతలు సూరవరపు నాగరాజు, వింజమూరి సతీష్, పలగాని శివ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం: 60వ డివిజన్ వాంబేకాలనీలో టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొండా ఉమామహేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు.

జీతాల బకాయిలను విడుదల చేయాలి

● కార్పొరేటర్ బోయి సత్యబాబు

వన్‌టౌన్, ఏప్రిల్ 16: మునిసిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ పశ్చిమ నగర ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. కాళేశ్వరరావు మార్కెట్ మునిసిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో కార్పొరేటర్ సత్యబాబు మాట్లాడుతూ నగరంలో నాలుగువేల మంది మునిసిపల్ కార్మికులకు ఫిబ్రవరిలో రావాల్సిన హెల్త్ ఎలవెన్స్ బకాయిలు, మార్చి జీతాల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్చి జీతాలు ఇప్పటివరకు రాలేదన్నారు. ఆదివారం పూర్తి సెలవులు కూడా లేకుండా కార్మిక హక్కులను హరిస్తున్నారన్నారు. ఈ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని, జీతాలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. యూనియన్ నాయకులు ఎం.కొండ, సుబ్బారావు, రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి కాపు ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

భవానీపురం, ఏప్రిల్ 16 : పశ్చిమ పరిధిలో బుధవారం జరగనున్న కాపు ఆత్మీయ సమావేశం జయప్రదం చేయాలని జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యాధరపురం సితార సమీపంలోని ఎస్ కన్వెన్షన్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ సమావేశానికి కాపు సామాజికవర్గ నాయకులు, మహిళలు కూడా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

త్వరలోనే సెట్స్‌పైకి
అఖండ-2



'సింహ', 'లెజెండ్', 'అఖండ' సినిమాలతో బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబో హ్యాట్రిక్ హిట్స్ కొట్టింది. మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించే వీరి కలయికలో మరో చిత్రం ఎప్పుడెప్పుడా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ విషయమై బోయపాటి శ్రీను మీడియాతో మాట్లాడారు. 'అఖండ'కు సీక్వెల్ ఎప్పుడని నన్ను ఎంతో మంది అడుగుతున్నారు. ప్రస్తుతం ఎటుచూసినా ఎన్నికల హడావుడే కనిపిస్తోంది. కాబట్టి ఎన్నికలు ముగిశాక ఈ సీక్వెల్‌పై అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. వీలైనంత త్వరలో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం. 'అఖండ'లో పసిబిడ్డ, ప్రకృతి, పరమాత్మ అంశాలను చూపించాం. 'అఖండ-2'లోనూ సమాజానికి అవసరమైన మంచి సందేశాన్ని చూపించబోతున్నాం. దైవత్వం మనందరిలో ఒక భాగం. ఈ విషయాన్ని తెరపైకి తీసుకు వస్తే ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

టాలీవుడ్‌లోకి అక్షయ్



బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒక తెలుగు చిత్రంలో నటించడం ఆయనకు ఇదే మొదటిసారి. ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు వచ్చిన అక్షయ్‌కు డాక్టర్ మోహన్‌బాబు, విష్ణు స్వాగతం పలికారు. భారీ అంచనాలతో, నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే న్యూజిలాండ్‌లో రెండు భారీ షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో అక్షయ్‌కుమార్ పాల్గొనే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో రూపుదిద్దుకుంటున్న 'కన్నప్ప' చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ ఈ చిత్రానికి రచయితలు. కన్నప్ప కథను అందరికీ తెలిసే విధంగా ఇటీవల కామిక్ బుక్స్‌ను విడుదల చేయగా, వాటికి మంచి స్పందన వచ్చింది.

యాక్షన్ ఊచకోత



విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రత్నం' ఈ నెల 26న విడుదల కానుంది. హరి దర్శకత్వంలో కార్తికేయన్ సంతానం నిర్మించారు. ఈ సినిమాను సీహెచ్ సతీశ్ కుమార్, కె. రాజ్‌కుమార్ తెలుగులో విడుదల చేస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఏపీ, తమిళనాడు సరిహద్దు గొడవల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. హీరోయిన్ కోసం హీరో చేసే ఊచకోత మాస్ యాక్షన్ జానర్లు ఇష్టపడే ప్రేక్షకులను అలరిస్తుంది. యాక్షన్‌తో పాటు లవ్ సీన్లకు కూడా సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ మంచి రీరికార్డింగ్ ఇచ్చారు.





మలయాళ సినిమాపై మన కథానాయికలకు మనసైంది. ఇన్నాళ్లు పేరు, పారితోషికం లెక్కలు వారిని అటువైపు వెళ్లనివ్వలేదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. బాక్సాఫీసు దగ్గర మలయాళ సినిమా సత్తా చాటుతోంది. అందుకే ఒక్కొక్కరుగా మన హీరోయిన్లు మలయాళ చిత్ర రంగంలో కర్చీఫ్ వేస్తున్నారు. ఇప్పటికే కొందరు ఈ ఏడాది కథానాయికలుగా మలయాళ ఎంట్రీ ఇస్తుండగా మరికొందరు ప్రయాణానికి సిద్ధమవుతున్నారు.

మలయాళ సినిమాపై మనసిలాయో

దాదాపు 20 ఏళ్ల తన కెరీర్‌లో ఇప్పటివరకూ తెలుగు, తమిళ చిత్రాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారు అనుష్కశెట్టి. ఇప్పుడు ఆమె చూపు మలయాళ సినిమాపై పడింది. 'కథనార్ - ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంలో అనుష్క లీడ్‌రోల్‌లో నటిస్తున్నారు. ఆమెతో సినిమాలు చేసేందుకు తెలుగులో అగ్రహీరోలు, దర్శకులు సిద్ధంగా ఉన్నారు. అయినా ఆమె ఈ మలయాళ చిత్రానికి పచ్చజెండా ఊపారంటే ఆ సినిమాలో ఏదో ప్రత్యేకత ఉన్నట్లే. హారర్ కథాంశంతో రూపొందే ఈ చిత్రానికి రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. జయసూర్య హీరోగా నటిస్తున్నారు. 'కథనార్'ను 14 భాషల్లో విడుదల చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. మార్చిలో చిత్రీకరణ మొదలైంది. కేరళలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదలవుతుంది. తొలిభాగాన్ని ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

సాక్షి ఎంట్రీకి సిద్ధం

అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్' సినిమాతో కథానాయికగా పరిచయమయ్యారు సాక్షి వైద్య. అందగత్తెగా గుర్తింపు దక్కింది కానీ ఆ సినిమా కాస్తా బాక్సాఫీసు దగ్గర పరాజయాన్ని మూటగట్టుకోవడంతో సాక్షి కెరీర్ మందగించింది. ఆ తర్వాత వరుణ్‌తేజ్‌తో 'గాండీవధారి అర్జున' చిత్రం చేశారు. రెండో ప్రయత్నంలోనూ ఆమె ఖాతాలో హిట్ పడలేదు. ప్రస్తుతం ఆమె తెలుగులో శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. ఒకవైపు టాలీవుడ్‌లో వరుసగా చిత్రాలు చేస్తూనే మలయాళ పరిశ్రమలోనూ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు సాక్షి. 'హల్' అనే మలయాళ చిత్రంలో నటించబోతున్నట్లు ఇటీవలే సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ప్రశాంత్ విజయ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈతరం యువతను ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందుతున్న ఈ చిత్రంలో షేన్ నిగమ్ హీరో. మేలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ ఏడాది చివర్లో విడుదల చేయనున్నట్లు నిర్మాణసంస్థ జేవీజే ప్రొడక్షన్స్ తెలిపింది.

మరో ప్రయత్నం

ఆకట్టుకునే అందం, మెప్పించే అభినయం రాయ్ లక్ష్మి సొంతం. కానీ హీరోయిన్‌గా ఆమెకు దక్కాల్సినంత గుర్తింపు రాలేదు. తన రూటు మార్చి ప్రత్యేక గీతాల్లోనూ నర్తించారు రాయ్ లక్ష్మి. ఇప్పుడు ఆమె ఆరేళ్ల తర్వాత మరోసారి మలయాళ సినిమా చేస్తున్నారు. ఇందులో ఆమె ఐపీఎస్ అధికారిణి రేచల్ పున్నూస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌కు టీఎస్ సురేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది.

టోవినోతో త్రిష

20 ఏళ్లుగా కథానాయికగా మెప్పిస్తున్నారు త్రిష. అగ్రహీరోలందరితోనూ సినిమాలు చేశారు. ఇన్నేళ్లలో ఆమె నటించిన వాటిలో తెలుగు, తమిళ చిత్రాలే అధికం. ఆమె కెరీర్‌లో 'హే జూడ్' అనే ఒకే ఒక మలయాళ చిత్రంలో నటించారు. కానీ ఇప్పుడు ఆమె చేతిలో రెండు మలయాళ చిత్రాలున్నాయి. మోహన్‌లాల్ సరసన ఆమె 'రామ్' అనే చిత్రం చేస్తున్నారు. 'దృశ్యం' సిరీస్‌ను తెరకెక్కించిన జీతూ జోసెఫ్ దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్తా కీలకపాత్ర పోషిస్తున్నారు.





తెలుగు, తమిళ చిత్రాలపైనే ప్రధానంగా దృష్టి సారించారు నయనతార. షారూఖ్‌ఖాన్ 'జవాన్'తో బాలీవుడ్‌లోనూ అదిరే ఎంట్రీ ఇచ్చారు. ఎంత బిజీగా ఉన్నా కథ బాగుంటే, మలయాళంలోనూ సినిమాలు చేస్తున్నారు నయనతార. చివరగా ఆమె 2022లో 'గోల్డ్' చిత్రంలో కథానాయికగా కనిపించారు. చిన్న విరామం తర్వాత మరో మలయాళ చిత్రానికి నయన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'డియర్ స్టూడెంట్స్' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. నివిన్‌పాలీ కథానాయకుడు. సందీప్‌కుమార్, జార్జ్ ఫిలిప్‌రాయ్ దర్శకత్వం వహిస్తున్నారు.





కృతి తొలి అడుగు

'ఉప్పెన' చిత్రంతో ఒక్కసారిగా తెలుగు ప్రేక్షకుల ఫేవరేట్ హీరోయిన్‌గా మారారు కృతిశెట్టి. ఆ తర్వాత అగ్రహీరోలతో సినిమాలు చేసినా, ఆమెకు 'ఉప్పెన' స్థాయి విజయాలు దక్కలేదు. ప్రస్తుతం ఆమె శర్వానంద్ సరసన 'మనమే' అనే చిత్రం చేస్తున్నారు. టాలీవుడ్‌లో స్పీడ్ తగ్గినా కృతీ కోలీవుడ్‌లో జోరు చూపిస్తున్నారు. ఏకంగా మూడు చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి. ఇక త్వరలోనే మలయాళంలోనూ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న మలయాళ చిత్రం 'అజయంతే రణదం మోషనం'లో ఆమె కథానాయికగా నటిస్తున్నారు. టోవినో థామస్ కథానాయకుడిగా నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. జితిన్‌లాల్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేశ్ మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దీంతో పాటు ఐశ్వర్య 'హర్' అనే మలయాళ చిత్రం చేస్తున్నారు.

ఐదేళ్ల తర్వాత...

సంచలన విజయం సాధించిన మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో కుర్రకారు హృదయాల్లో చోటు దక్కించుకున్నారు అనుపమా పరమేశ్వరన్. ఆ తర్వాత మాత్రం ఆమె తెలుగు, తమిళ చిత్రాలతో బిజీ అయ్యారు. మలయాళ అమ్మాయి అయినా అక్కడ అడపా దడపా సినిమాలు చేస్తూ వచ్చారు. చివరగా ఆమె నటించిన మలయాళ చిత్రం 'మనియరాయలే అశోకన్'. ఐదేళ్ల క్రితం విడుదలైంది. ఇప్పుడు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఓ మలయాళ చిత్రం చేయబోతున్నారు అనుపమ. సురేశ్‌గోపీ హీరోగా నటిస్తున్న 'జేఎస్‌కే' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు.

తమన్నా నటించిన మలయాళ చిత్రం 'బాంద్రా' గతేడాది విడుదలైంది. ఈ చిత్రం బాక్సాఫీసు దగ్గర యావరేజీగా నిలిచింది. దాదాపు 20 ఏళ్ల కెరీర్‌లో ఆమెకు ఇది తొలి మలయాళ చిత్రం కావడం విశేషం. అలాగే ప్రణీతా సుభాష్ కథానాయికగా నటించిన 'తంకమణి' చిత్రం గతనెల్లో విడుదలైంది.



జర్నలిస్ట్ మాస్ నంబర్



నారా రోహిత్ హీరోగా నటించిన 'ప్రతినిధి 2' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ప్రముఖ జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కుమార్ రజాబత్తుల, అంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మాతలు. ఈ సినిమా నుంచి 'గల్లా యెత్తి' అనే మాస్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. సమాజంలోని మంచి చెడుల గురించి ఆలోచింపజేసే విధంగా కాసర్ల శ్యామ్ ఈ పాట రాశారు. రామ్ మిరియాల పాడారు. మహతి స్వరసాగర్ సంగీత దర్శకుడు. భాను మాస్టర్ కొరియోగ్రఫీలో నారా రోహిత్ ఉత్సాహంగా డాన్స్ చేశారు. ఇందులో ఆయన న్యూస్ రిపోర్టర్ పాత్ర పోషించారు. సిరీ లెల్లా కథానాయిక.

కన్నడ నటుడు ద్వారకేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ నటుడు ద్వారకేశ్ (81) కన్నుమూశారు. వయోసహజ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ద్వారకేశ్ మంగళవారం ఉదయం తన నివాసంలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు బంగ్లే షామారావు ద్వారకానాథ్. అయితే 'ద్వారకేశ్'గా చిత్ర పరిశ్రమలో ఆయన సుపరిచితులు. ఆయన 1964లో 'వీరసంకల్ప' ద్వారా సినీరంగంలో ప్రవేశించారు. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ సహా ఎందరో ప్రముఖ నటులతో ఆరు దశాబ్దాలపాటు కలసి నటించారు. హాస్యంతోపాటు విభిన్నమైన పాత్రల్లో రాణించారు. 15 సినిమాలకు దర్శకత్వం వహించడమే కాకుండా 50 సినిమాలు నిర్మించారు. ఆయన భార్య అంబుజా సరిగ్గా మూడేళ్లకిందట ఇదే రోజున మృతి చెందారు. ద్వారకేశ్‌కు ఆరుగురు సంతానం. మొదటి భార్యకు ఐదుగురు కుమారులు కాగా రెండో భార్య శైలజకు ఒక కుమారుడు ఉన్నారు. 'నా చిరకాల మిత్రుడిని కోల్పోయాను' అంటూ రజనీకాంత్ ఎక్స్ ఖాతా ద్వారా పేర్కొన్నారు. 'స్వశక్తితో ఎదిగిన గొప్ప నిర్మాత, దర్శకుడు ద్వారకానాథ్. ఆయన జ్ఞాపకాలు నా మదిలో పదిలంగా ఉన్నాయి' అని ఆయన పేర్కొన్నారు. ద్వారకేశ్ పార్థివదేహాన్ని సినీ, రాజకీయ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. అభిమానుల సందర్శన కోసం రవీంద్రకళాక్షేత్రలో బుధవారం ఆయన పార్థివ దేహాన్ని ఉంచి, ఆ తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సినిమా నేపథ్యంలో
రుద్రాక్షపురం



మణి సాయితేజ, వైదూర్య హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రుద్రాక్షపురం'. ఆర్.కె.గాంధీ దర్శకత్వం వహించగా, కొండ్రాసి ఉపేందర్ నిర్మించారు. ప్రముఖ నటుడు నాగ మహేశ్, ఫిల్మ్ జర్నలిస్ట్ సురేశ్ కొండేటి, బి.వీరబాబు, అప్పాజీ కీలక పాత్రలు పోషించారు. సినిమా నేపథ్యంలో సాగే 'రుద్రాక్షపురం' చిత్రం ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ చిత్రానికి ఎడిటర్:డి.మల్లి, కెమెరామెన్: నాగేంద్రకుమార్, సంగీతం: ఎం.ఎల్ రాజా, ఘంటాడి కృష్ణ, జయసూర్య బొంపెం. ఈ కార్యక్రమంలో తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, దర్శకనిర్మాత లయన్ సాయివెంకట్, తదితరులు పాల్గొని సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

జానపద బాణీలతో యాదమ్మ



బాలాచారి కూరెళ్ల దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'భవనమ్'. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహ ఉల్లాల్ ప్రధాన పాత్రలలో నటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో ఆర్.బి.చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సిర్వి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ లుక్, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మంగళవారం ట్రైలర్‌ను, జానపద బాణీలతో సాగే 'యాదమ్మ' పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ఆర్.బి.చౌదరి మాట్లాడుతూ "దర్శకుడు బాలాచారి ఈ సినిమాను అద్భుతంగా తీశారు. ఇందులో ఉన్న అన్ని పాటలు ఆకట్టుకుంటాయి" అని చెప్పారు. దర్శకుడు బాలాచారి కూరెళ్ల మాట్లాడుతూ "దాదాపు 20ఏళ్ల తర్వాత ఈ నిర్మాణ సంస్థతో కలసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొన్నారు.

కొత్త పాయింట్‌తో
మార్కెట్ మహాలక్ష్మి




'కేరింత' మూవీ సినిమాలో కామెడీ టైమింగ్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు పార్వతీశం. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్వికా హీరోయిన్‌గా నటించారు. వియస్ ముఖేశ్ దర్శకత్వం వహించగా, అఖిలేశ్ కిలారు నిర్మించారు. ఈ నెల 19న 'మార్కెట్ మహాలక్ష్మి' విడుదలవుతోన్న సందర్భంగా చిత్ర దర్శకుడు మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమాలో ఆడియెన్స్ ఇప్పటివరకు చూడని ఓ కొత్త పాయింట్‌ను టచ్ చేశాం. ప్యూర్ లవ్ స్టోరీతో వస్తోన్న ఈ సినిమాను కుటుంబసమేతంగా చూసేలా తెరకెక్కించాం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేసే నా ఫ్రెండ్ ఒకరు కూరగాయలు అమ్మే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ సంఘటన స్ఫూర్తితో ఈ సినిమా కథను రాసుకున్నాను" అని చెప్పారు.

సినిమా చూస్తూ నవ్వుతూనే ఉంటారు



చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలు పోషించిన క్రైమ్ కామెడీ 'పారిజాత పర్వం' ఈ నెల 19న విడుదల కానుంది. సోమవారం రాత్రి జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'రెగ్యులర్ సినిమాలు కాకుండా ఇలాంటి డిఫరెంట్ చిత్రాలు రావాలంటే నిర్మాతలకు గట్స్ ఉండాలి. నేను ఎంజాయ్ చేస్తూ నటించిన సినిమా ఇది' అన్నారు. ఒక పది, పదిహేను నిముషాలు తప్ప మిగతా సినిమా చూస్తూ నవ్వుతూనే ఉంటారని సహ నిర్మాత అనంత్ సాయి చెప్పారు. ఏపీ, తెలంగాణ, కర్నాటక ప్రాంతాల్లో ఈ సినిమాను 125కి పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు డిస్ట్రిబ్యూటర్ విశ్వనాథ్ చెప్పారు. దర్శకుడు సంతోష్ కంభంపాటి మాట్లాడుతూ 'కన్ఫ్యూజ్ కిడ్నాప్ డ్రామా ఇది. దానికి ఒక చిన్న థిన్ లైన్ ఉంది. ఆ లైన్ దాటితే ఆడియన్స్ కన్ఫ్యూజ్ అవుతారు. అందుకే నా మీద నమ్మకం ఉంచి సినిమా తీసిన నిర్మాతలకు ధన్యవాదాలు' అన్నారు. సినిమా బాగా వచ్చిందనీ, థియేటర్లలో ఈ నెల 19న చూడండి అని నిర్మాతలు మహీధర్ రెడ్డి, దేవేష్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని హీరో చైతన్యా రావు తెలిపారు.



రామాయణం... వేల సంవత్సరాలుగా కోట్ల మందిని ప్రభావితం చేస్తున్న కావ్యం. దీనిని సులభంగా అందరి దగ్గరకు తీసుకువెళ్లటానికి జరుగుతున్న ప్రయత్నాలెన్నో! అలాంటిదే ఒక ప్రయత్నం చేస్తున్నారు నీలిమ పెనుమర్తి. 'స్టోరీ హవర్' పేరిట ఆడియో బుక్కులు.. తోలుబొమ్మలాట ద్వారా ఆమె చేస్తున్న ప్రయత్నాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. బీబీసీలోనే కాదు... బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఖతార్ ఎయిర్‌వేస్ వంటి సుప్రసిద్ధ వైమానిక సంస్థలు కూడా తమ విమానాలలో ఆమె ఆడియో బుక్స్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చాయి. నేడు శ్రీరామనవమి సందర్భంగా ఆమె తన ప్రస్థానాన్ని 'నవ్య'కు వివరించారు.



మన రామాయణాన్ని విదేశాల్లో వినిపిస్తోంది



"మాది హైదరాబాద్. నేను ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయంలో చదువుకున్నా. అందువల్ల తెలుగుతో పాటుగా నాకు హిందీ, ఇంగ్లీషు భాషలు స్పష్టంగా వచ్చు. ఈ భాషల వల్ల అనేక ప్రయోజనాలున్నాయని.. ఈ భాషలు నా సాంస్కృతిక ప్రస్థానంలో ఒక భాగమవుతాయని చిన్నప్పుడు ఎప్పుడూ అనుకోలేదు. ఉన్నత విద్య కోసం కోసం లండన్ వెళ్లాను. వివాహం తర్వాత అక్కడే స్థిరపడ్డాం. నాకు చిన్నప్పటి నుంచి రామాయణం అంటే చాలా ఇష్టం. అది నా మనస్సులో ఒక చెరగని ముద్ర వేసింది. బ్రిటన్‌లో ఉత్తరాది వారి సంఖ్య ఎక్కువ. ముఖ్యంగా గుజరాతీయులు ఎక్కువ మంది ఉంటారు. ఉత్తర భారతీయుల కోసం- అక్కడి స్కూళ్ల సిలబస్‌లో రామాయణ కథ కూడా ఉంటుంది. దీనిని మా పిల్లలు కూడా చదువుతూ ఉండేవారు. అయితే మన రామాయణానికి.. ఉత్తర భారతీయుల రామాయణానికి మధ్య తేడా ఉంటుంది. పండగలను చేసుకోవటంలో కూడా తేడా ఉంటుంది. ఉదాహరణకు రావణుడిపై రాముడి విజయానికి గుర్తుగా దీపావళి చేసుకుంటారు. మనకు అలాంటి సంప్రదాయం ఉండదు. మా చిన్నవాడు ఆయుర్- నాలుగేళ్ల వయస్సులో రామాయణం స్కిట్ కూడా వేశాడు.



తొలి ప్రయత్నం...

ఒక రోజు మా అబ్బాయి వచ్చి- "రామాయణం చాలా సంక్లిష్టమైన ఇంగ్లీషు భాషలో ఉంటోంది. లేదా బొమ్మల కథల మాదిరిగా ఉంటోంది" అన్నాడు. ఆ మాటలు నాలో ఆలోచన రేకెత్తించాయి. అందరికి సులభంగా అర్థమయ్యే భాషలో.. రామాయణ కథకు ఎక్కడా అన్యాయం జరగకుండా రామాయణాన్ని ఒక ఆడియోబుక్ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఈ మధ్యకాలంలో ఆడియో బుక్‌లను ఎక్కువ మంది వింటున్నారు. వాటికి మంచి ఆదరణ కూడా లభిస్తోంది. దీనితో రామాయణ కథను ఇంగ్లీషులో మా పిల్లల చేత- 'రామాయణ- యాన్ ఏన్షియంట్ ఎపిక్' అనే ఆడియోబుక్ చేయించాను. దీనికి విశేషమైన ఆదరణ లభించింది. 'ది టైమ్స్' పత్రిక వారు దీనిని రివ్యూ చేశారు. ముందు ఈ పుస్తకాల బ్రాండ్‌కు పురాణాస్ అని పెట్టాం. ఆ తర్వాత 2020లో దీనిని 'స్టోరీ అవర్' అని పేరు మార్పు చేశాం. ఒక గంటలో అయిపోయే స్టోరీలు కాబట్టి వీటికి ఆ పేరును పెట్టాం. కేంద్రీయ విద్యాలయానికి చెందిన ఆరుగురు పిల్లలు హిందీలో.. తెలుగులో దేవనగిర్ బ్లైండ్ స్కూలుకు చెందిన ముగ్గురు పిల్లలతో ఆడియో బుక్స్ విడుదల చేశాం. ఇంగ్లీషు ఆడియో పుస్తకాన్ని- బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఖతార్ ఎయిర్‌వేస్ వైమానిక సంస్థలు తమ ప్రయాణికుల సౌకర్యార్థం - ఆడియోబుక్ సెక్షన్‌లో ఉంచారు. ఒక వైపు ఈ ప్రయత్నాలు జరుగుతుండగానే- ఈ పుస్తకాన్ని అందరికి తెలియజేయటానికి వీలుగా- రామాయణంపై ఒక తోలుబొమ్మలాటను రూపొందించాను. నా దృష్టిలో ఒక ఉద్వాతమైన కథను.. హృద్యంగా అందరి మనస్సులో చొచ్చుకుపోయే రీతిలో చెప్పగల సామర్థ్యం తోలుబొమ్మలాటకు ఉంది. అందుకే దానిని ఎంచుకున్నాను. అయితే



లండన్‌లో ఇలాంటి సృజనాత్మక కళల ప్రదర్శలను అయ్యే నిర్వాహణ వ్యయం చాలా ఎక్కువ ఉంటుంది. అందుకే తోలుబొమ్మలాటను 15 నిమిషాలకు కుదించి- మూడు భాగాలుగా చేశాం. దీనికి కూడా మంచి ఆదరణ లభించింది. దీనికి కొన్ని పాటలు.. సంగీతాన్ని కూడా జోడించాం. ఆ తర్వాత ఇది 25 నిమిషాలకు చేరుకుంది. లండన్‌లో నెహ్రూ సెంటర్‌లో ఈ తోలుబొమ్మలాటను అనేక ప్రాంతాల్లో ప్రదర్శించాం. దీనిని ఒక ఫిల్మ్‌గా రూపొందించాం. ప్రతి చోట దీనికి మంచి ఆదరణ లభించింది.

స్వాతంత్ర్య పోరాటంపై...

ఆ తర్వాత కోవిడ్ వచ్చింది. ఆ సమయంలో మా అమ్మనాన్నలతో 'తాతమ్మ కథలు' అనే కథలు రాయించాను. వాటిని మేమే ఆడియో పుస్తకాల రూపంలో తీసుకువచ్చాం. మా పిల్లలిద్దరికి చరిత్ర అంటే చాలా ఇష్టం. బ్రిటిష్‌వారిపై జరిపిన స్వాతంత్ర్యపోరాటానికి సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అయితే మొఘలుల కాలం నుంచి మనకు స్వాతంత్ర్యం పూర్తయ్యే దాకా జరిగిన ముఖ్యమైన విషయాలన్నింటినీ పూసగుచ్చి చెప్పే కథల కొరత అయితే ఉంది. దీనిని గుర్తించి మా అబ్బాయి ఆయుర్.. వాళ్ల స్నేహితుడు ఆయుష్ కలిసి- 'ఫ్రమ్ ది మొఘల్స్ టూ మహాత్మ' అనే ఆడియో బుక్‌ను తయారుచేశారు. దీనికి కూడా మంచి ప్రశంసలు వచ్చాయి. ఈ ఆడియో బుక్ ప్రముఖ దౌత్యవేత్త, పార్లమెంట్ సభ్యుడు శశి థరూర్ రివ్యూ కూడా రాశారు. ఈ పుస్తకాన్ని హిందీలో బ్లైండ్ రిలీఫ్ అసోషియేషన్ ద్వారా ఇద్దరు అంధ బాలల ద్వారా అనువాదం చేయించాం.

చివరగా...

రామాయణం ఆడియో పుస్తకాలకు ఇంగ్లీషులో విపరీతమైన ఆదరణ లభించింది. అయితే ఇంగ్లీషులో లభించినంత ప్రోత్సాహం ప్రాంతీయ భాషల్లో లభించటం లేదు. వాస్తవానికి పిల్లలపై మాతృభాష ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో తెలుగు మాట్లాడుతుంటే- వారికి తెలుగు సులభంగా వచ్చేస్తుంది. అంతే కాకుండా ఒక భాష వచ్చిన వారికి ఇతర భాషలు రావటం సులభం అవుతుంది కూడా! మాతృభాషలో సంస్కృతిని నేర్చుకున్నవారు సంస్కారవంతులు అవుతారనటంలో ఎటువంటి సందేహం కూడా లేదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

శ్రీరామనవమికి ముస్తాబవుతున్న అయోధ్య రామమందిరానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని రామ్‌ఘాట్ ప్రాంతంలో... నిరాడంబరంగా కనిపిస్తుంది శ్రీ రామ్ జానకీ మందిర్. అక్కడ పూజాదికాలు, నిర్వహణ... ఇలా సమస్త బాధ్యతలూ నిర్వర్తించేది మహిళలే. 150 సంవత్సరాల ఈ సంప్రదాయం మాయీవాడ ఆశ్రమం ఆధ్వర్యంలో కొనసాగుతోంది. దాదాపు 120 మందికి ఆశ్రయం ఇస్తున్న మాయ్‌వాడ గురించి, ఆలయ నిర్వహణ గురించి ప్రధాన అర్చకురాలు కృష్ణదాసి మాటల్లో...

అయోధ్యలో... ఈ రాముడికి మహిళలే పూజారులు

"అయోధ్య ప్రాంతంలో ఆధ్యాత్మికతకు అంకితమై, మోక్షాన్ని కోరుతూ, వైరాగ్యంతో జీవించే మహిళలకు కొదవలేదు. స్థానికంగా వినిపించే ఒక కథ ప్రకారం... శ్రీరాముడితో వివాహం అయ్యాక... సీతమ్మ మొదటిసారి అయోధ్యకు వచ్చినప్పుడు ఆమెతో పాటు వచ్చిన మహిళా పరివారం ఒక చోట విడిది చేసింది. ఆ తరువాత దాన్నే తమ నివాస ప్రాంతంగా మార్చుకుందట. ఆ ప్రాంతం 'జానకీ బాగ్'గా ప్రసిద్ధి చెందింది. కాలక్రమేణా అదే 'మాయీవాడ' అయిందంటారు. అప్పటి నుంచి వివిధ కారణాల వల్ల కుటుంబాలకు దూరమై లేదా భౌతిక బంధాలపై విరక్తి చెంది.. ఆధ్యాత్మిక మార్గంలో జీవించాలని నిర్ణయించుకున్నవారికి ఇది గమ్యంగా మారిపోయింది. ఆధునిక కాలానికి వస్తే... 150 ఏళ్ళ క్రితం... పద్దెనిమిదో శతాబ్దం చివర్లో... మహిళా సన్యాసినులకు, సాధువులకు నిలువ నీడలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో వారు సరయూనదీ తీరాన ఒక గుడారాన్ని ఏర్పాటు చేసుకొని, అందులో నివసించేవారు. తరువాత విరాళాలతో కొంత డబ్బును పోగు చేసి, ఆలయాన్ని నిర్మించారు. అదే శ్రీ రామ జానకీ మందిర్. నాటి నుంచీ బాధ్యతలన్నీ మహిళలే నిర్వహిస్తున్నారు.



ఆహారం, వసతి, ఆధ్యాత్మికత...

నా స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని రేవా. నలభై రెండేళ్ళ క్రితం నేను భక్తి మార్గానికి మళ్ళాను. ఆధ్యాత్మిక ఉన్నతి కోసం అయోధ్యకు చేరుకున్నాను. మాయీవాడ ఆశ్రమంలో చేరాను. 2017లో ప్రధాన పూజారిణిగా బాధ్యతలు చేపట్టాను. మేమందరం రామానంది సంప్రదాయానికి చెందినవాళ్ళం. అయోధ్యలో ఎక్కువ ఆలయాలు ఈ సంప్రదాయం ప్రకారమే నడుస్తాయి. పూజా కార్యక్రమాలు నిర్వహించే పురుషులను పిలిచినట్టే.. మమ్మల్ని కూడా 'మహంత్'లని వ్యవహరిస్తారు. మాయ్‌వాడ అంటే 'తల్లుల ప్రాంగణం' అని అర్థం. ఇక్కడ మూడు ఆలయాలున్నాయి. సుమారు 45 మంది మహిళా మహంత్‌లు, సంరక్షకులు ఉన్నారు. ఆ ఆలయాలన్నీ వేటికవే స్వతంత్రంగా నడుస్తున్నాయి.



వితంతువులు, అనాథలు, అభాగ్యులు, కుటుంబానికి దూరమైన మహిళలు... దాదాపు 120 మంది వరకూ ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. వారిలో... ఇంతకుముందు మహంత్‌గా ఉన్న రేష్మాదాసి దత్తత తీసుకున్న పదిహేనేళ్ళ బాలిక నుంచి... తొంభయ్యేళ్ళ రామ్‌స్నేహిదాసి వరకూ అన్ని వయసులవారూ ఉన్నారు. వారికి రెండు పూటల భోజనం, వసతి అందిస్తున్నాం. అందరూ సన్యాసినులుగా... భక్తి మార్గంలో జీవనం గడుపుతున్నారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో పేదరికం ఎక్కువ. అలాగే మహిళలపై పురుషుల అఘాయిత్యాలూ ఎక్కువే. భర్తలు వదిలేసినవారికి, గృహహింస భరించలేక ఇల్లు వదిలి వచ్చినవారికి మేము అండగా నిలుస్తున్నాం. వారి ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదం చేస్తున్నాం. వైష్ణవ సంప్రదాయాలు పాటించే ఆలయాల్లో సాధారణంగా పూజారులందరూ పురుషులే ఉంటారు. కానీ మా ఆలయాల్లో అన్ని కార్యకలాపాలూ మహిళల చేతుల మీదుగానే సాగుతాయి. పూజలకు పురుషులను అనుమతించం. తెల్లవారుజామునే ధ్యానం, పూజ, ఉదయం వేళలో హోమం, ప్రసాద నివేదన, రోజూ సాయంత్రం భజన కార్యక్రమాలు ఉంటాయి.

మాకు ఆహ్వానం లేదు...

అయోధ్యలో మా గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. ఈ ఏడాది అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి ఎక్కడెక్కడివారినో పిలిచారు. కానీ మాకు ఆహ్వానం అందలేదు. ఇదే కాదు... రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్న ఏ ఆధ్యాత్మిక కార్యక్రమంలోనైనా... మగ సాధువులకు, మహంత్‌లకు తప్ప మాకు ఆహ్వానం రావడం చాలా అరుదు. ఆఖరుకు నిధులు, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ సహాయాలన్నీ పురుషుల ఆధిపత్యంలో ఉన్న సంస్థలకే అందుతూ ఉంటాయి. ఎందరికో ఆశ్రయం కల్పిస్తూ... ప్రస్తుతం దుస్థితికి చేరుకుంటున్న మాయ్‌వాడ లాంటివాటిని ఎవరూ పట్టించుకోరు. మాయ్‌వాడను, ఆలయాలను ఒక ట్రస్టుగా రిజిస్టర్ చెయ్యాలనే ప్రతిపాదనలు, వత్తిడులు వచ్చాయి. కానీ దాని వల్ల... మా ముందు తరాలవారు ఎంతో కష్టపడి సమకూర్చుకున్న భూమిని కోల్పోతామేమోననే భయంతో... వాటిని తిరస్కరించాం. భక్తులు ఇచ్చే దక్షిణలు, కొందరు దాతలు ఇచ్చే విరాళాలతో నెలవారీ సరుకుల కొనుగోలు, బిల్లుల చెల్లింపు చేస్తున్నాం. ఇప్పుడు నా వయసు డెబ్బై నాలుగేళ్ళు. సేవలోనే మోక్షం దొరుకుతుందనేది జీవితం నాకు నేర్పిన పాఠం. అందుకే... ఓపిక ఉన్నంత వరకూ అభాగ్యులకు సేవ చేస్తాను. మానవ సేవే మాధవ సేవ కదా!"

రక్తహీనత తగ్గించే దానిమ్మ

పండ్లలో దానిమ్మ కథే వేరు. ముఖ్యంగా దానిమ్మలో పోషకాలు, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలం. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదో పోషక విలువల గని. యాపిల్‌కు సమానమైన పండు అని పరిశోధకులు చెబుతారు. దానిమ్మను తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

- ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ ఉండటం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. దీని ఫలితంగా దగ్గు, జలుబు లాంటివి దరిచేరవు.
- దానిమ్మ గింజలు తినటం వల్ల కడుపు నిండినట్లు ఉంటుంది. వీటిని డైట్‌లో చేర్చుకుంటే కచ్చితంగా బరువు తగ్గుతారు.
- ఇందులోని పీచుపదార్థం వల్ల తిన్న ఆహారం సులువుగా జీర్ణమవుతుంది. జీర్ణప్రక్రియ సాఫీగా జరుగుతుంది.
- దానిమ్మ పండు లేదా దానిమ్మ రసం తాగినా డీహైడ్రేషన్ నుంచి కోలుకోవచ్చు.
- ఈ పండులో ఐరన్ ఎక్కువగా ఉండటం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుంది. ముఖ్యంగా రక్తం సాఫీగా ప్రసరించటంతో పాటు రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇందువల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది దానిమ్మపండు.



- కండరాలు, నరాలు ఆరోగ్యంగా ఉంటాయి. ముఖ్యంగా ఈ గింజలను తింటే వాపులు రావు.
- మధుమేహగ్రస్తులకు ఈ పండు ఎంతో మేలు చేస్తుంది. దానిమ్మ గింజలు తినాలి. ఒకవేళ జ్యూస్ చేస్తే అందులో పంచదార కలపకుండా తాగేయాలి.
- దానిమ్మ గింజలను తినటం వల్ల నోటిలో బ్యాక్టీరియా నశిస్తుంది. దంతాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.
- చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఎర్ర రక్తకణాలను పెంచుతుంది. ముఖ్యంగా చెప్పాలంటే మెదడు ఆరోగ్యానికీ మంచిది.
- ఫ్రీరాడికల్స్ నుంచి రక్షణ కల్పించి వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా చేస్తాయివి.
- దానిమ్మ గింజలే కాదు తొక్క కూడా మేలు చేస్తుంది. జుట్టు ఆరోగ్యంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని రక్షించే గుణం దానిమ్మ తొక్కకు ఉంది.

ఫ్యాషన్

దంచే ఎండల్లో ఒంటికి మెత్తగా తగులుతూ, చమటను పీల్చేసే కాటన్ చుడీదార్‌లు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. తేలికగా, అనువుగా ఉండే అలాంటి కొన్ని లేటెస్ట్ కాటన్ చుడీదార్ల మీద ఓ లుక్కేద్దామా!

ఎండల్లో చలచల్లగా...











యాక్సెసరీస్

కాటన్ చుడీదార్‌తో ఫ్లాట్స్ ధరించాలి. కొల్హాపురి చెప్పులు కూడా చాలా బాగుంటాయి. అలాగని వెడ్జెస్, పెన్సిల్ హీల్స్ ధరించకూడదని అనుకోకూడదు. ఈవినింగ్ పార్టీలకు ఇలాంటి ఫుట్ వేర్ బాగుంటుంది. ఫ్యాన్సీ జ్యువెలరీ, చేతికి వాచ్ ధరించడం కూడా తప్పనిసరి.

స్టైలింగ్ ఇలా...

చుడీదార్ పాత ఫ్యాషన్ అని కొట్టి పారేయడానికి వీల్లేదు. వేసవిలో సౌకర్యవంతమైన వస్త్రధారణలో చీరల తర్వాతి స్థానం ఎప్పటికీ కాటన్ చుడీదార్లదే! కాబట్టి కొత్త హంగులు జోడించి, కాటన్ చుదీదార్లలోనే ఫ్యాషనబుల్‌గా కనిపించే ప్రయత్నం చేయాలి. అందుకోసం డోరీలు, లట్‌కాన్‌లను డ్రెస్‌కు జోడించాలి. అలాగే కుట్టించేటప్పుడు డ్రెస్ డిజైనింగ్ చేయించాలి. కాంట్రాస్ట్ కలర్స్ ఎంచుకోవాలి. చున్నీ, డ్రెస్‌కు పూర్తి భిన్నంగా ఉండేలా చూసుకోవాలి.

జైపూర్ కాటన్

రంగులు వెలిసిపోకుండా, కుంచించుకుపోకుండా ఉండే జైపూర్ కాటన్‌ను అందరూ ఇష్టపడతారు. ప్రింటెడ్ కాటన్ జైపూర్ చుడీదార్‌లు రెడీమేడ్‌గా దొరుకుతాయి. వీటికి బదులుగా నచ్చిన మోడల్‌లో కుట్టించుకోవాలనుకుంటే, మెటీరియల్‌ను కూడా ఎంచుకోవచ్చు. అయితే సాదాసీదా చుడీదార్‌లకు బదులుగా మోడర్న్‌గా ఉండే మోడల్స్ ఎంచుకుంటే అటు ఆఫీసులకూ, ఇటు ఈవినింగ్ గెట్ టు గెదర్స్‌కూ సూటవుతాయి.

జుట్టు ఆరోగ్యం కోసం...

వేసవిలో జుట్టు సంరక్షణ కోసం మంచి పోషకాహారం తీసుకోవాలి. దీంతో పాటు కొన్ని హెయిర్ ప్యాక్స్‌నూ వేసుకొంటే... మంచి ఫలితం ఉంటుంది.



- వేపాకును మెత్తగా నూరి.. ఆ రసాన్ని మాత్రం జుట్టు కుదుళ్లతో పాటు వెంట్రుకలకు పట్టించాలి. బాగా ఆరిన తర్వాత తక్కువ గాఢత కలిగిన షాంపూతో కడిగేయాలి. దీని వల్ల జుట్టులో మంటల కలగవు. నొప్పులు, ఇన్‌ఫెక్షన్లు దరిచేరవు.
- టేబుల్ స్పూన్ పొట్టు మినపగుళ్ల మిశ్రమం.. అంతే పరిమాణంలో మెంతిపొడి, ఉసిరి పొడిని సమపాళ్లలో తీసుకోవాలి. దీనికి రెండు టేబుల్ స్పూన్ల పెరుగును చేర్చి పల్చటి మిశ్రమంగా చేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించాలి. అరగంట తర్వాత జుట్టును శుభ్రంగా కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు పెరుగుతుంది.
- ఒక బౌల్‌లో టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు, టేబుల్ స్పూన్ శీకాయపొడిని కలపాలి. ఇందులో అవసరం అనుకుంటే కొద్దిగా నిమ్మరసం వేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత మంచి నీటితో శుభ్ర పరచుకోవాలి. శీకాయ ఉంది కాబట్టి షాంపూతో కడగాల్సిన అవసరం లేదు. ఇలా తరచూ చేస్తుంటో జుట్టు గట్టిగా ఉంటుంది. తలలో చుండ్రు సమస్య తగ్గిపోతుంది.

సివిల్స్‌లో స్వీయ కృషి!

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సర్వీసు(సివిల్స్) ఫలితాల్లో రాష్ట్రానికి చెందిన పలువురు ర్యాంకులు సొంతం చేసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది ఇంట్లోనే ఉండి సొంతగా ప్రిపేర్‌కావడం.. తొలి ప్రయత్నంలోనే ర్యాంకు సాధించడం విశేషం. అదేవిధంగా గత ఏడాది గ్రూప్-1లో తొలి ర్యాంకు సాధించి ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ప్రత్యూష సివిల్స్‌లో 198వ ర్యాంకు సాధించారు.

మెరిసిన మెకానిక్ కుమారుడు.. 202వ ర్యాంకు


ఓంకార్

పార్వతీపురం జిల్లా కేంద్రంలో కొత్తవలస మణికంఠ కాలనీకి చెందిన బండి ఓంకార్ సివిల్స్ తొలి ప్రయత్నంలోనే ఆలిండియా 202వ ర్యాంకు సాధించారు. ఆయన తండ్రి బండి వీర్రాజు మెకానిక్ షాపు నిర్వహిస్తున్నారు. తల్లి చంద్రకళ గృహిణి. పార్వతీపురంలోని ఓ కళాశాలలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీ చదువుతూనే సివిల్స్‌కు సిద్ధమయ్యారు. ఢిల్లీలో మెయిన్స్ కోచింగ్ తీసుకున్నారు.

ఇంట్లోనే చదివి.. 493వ ర్యాంకు కొట్టి..!


పృథ్వీ రాజ్‌కుమార్

పార్వతీపురం పట్టణానికి చెందిన పృథ్వీ రాజ్‌కుమార్ సివిల్స్ రెండో ప్రయత్నంలో 493వ ర్యాంకు సాధించారు. రాజ్‌కుమార్‌తండ్రి దొనక విజయ్‌కుమార్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం. తల్లి వెంకటరత్నం అదే పాఠశాలలో రికార్డు అసిస్టెంట్. పృథ్వీ ఇంటి వద్దే ఉండి సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. తొలి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లిన ఆయన రెండో ప్రయత్నంలో మాత్రం ర్యాంకు సాధించారు.

ఐఏఎస్ లక్ష్యం!


బాన్న వెంకటేశ్

శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామానికి చెందిన బాన్న వెంకటేశ్ సివిల్స్ ఫలితాల్లో 467వ ర్యాంకు తెచ్చుకున్నారు. వెంకటేశ్ తండ్రి చంద్రరావు ధాన్యం వ్యాపారి. తల్లి రోహిణి గృహిణి. 2019లో తమిళనాడు తిరుచిరాపల్లిలో ఎన్‌ఐటీ పూర్తిచేసి.. రెండేళ్లు కోల్ కంపెనీలో పనిచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. రెండో ప్రయత్నంలో విజయం సాధించారు. ఐఏఎస్ తన లక్ష్యమని తెలిపారు.

ఇంట్లోనే చదివి.. తొలిసారే మెరిసి!


రాహుల్

బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన జగన్నాథం రాహుల్ సివిల్స్ తొలి ప్రయత్నంలోనే 873వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. తల్లిదండ్రులు బాబూరావు, ప్రభావతి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. రాహుల్ ఎలాంటి శిక్షణ లేకుండా ఇంట్లోనే చదువుకుని 873వ ర్యాంక్ సాధించారు. మొదటి ప్రయత్నంలోనే ర్యాంకు రావడంపై రాహుల్‌కు మాదిగ ఉద్యోగుల రాష్ట్ర కన్వీనర్ కందుల గంగాధర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

యూపీఎస్సీలో 'నారాయణ' సత్తా!



హైదరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే సివిల్స్‌లో తమ విద్యార్థులు సంచలన విజయం సాధించినట్టు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణలు తెలిపారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో 3వ ర్యాంకుతో పాటు, 493వ, 545వ, 919వ ర్యాంకులను సాధించారని వెల్లడించారు. సివిల్స్ ఫలితాల్లో దోనూరు అనన్యరెడ్డి 3వ ర్యాంకు, దొనక పృథ్వీరాజ్ కుమార్ 493వ ర్యాంకు, నరేంద్ర పడాల్ 545వ ర్యాంకు, ధరావత్ సాయిప్రకాష్ 919వ ర్యాంకులను సాధించినట్టు తెలిపారు. సివిల్స్ కష్టతరమైన లక్ష్యంగా నేటి తరం భావిస్తోందని, పట్టుదల, నిరంతర కృషి ఉంటే సాధించలేనిదేమీ లేదని పేర్కొన్నారు. ఐఏఎస్ కలను నెరవేర్చేందుకు తమ సంస్థ ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ అకాడమీని తీర్చిదిద్దామని, ఇప్పుడు సాధించిన విజయమే అందుకు సాక్ష్యమని డైరెక్టర్లు చెప్పారు.

అనన్య ప్రతిభ

(మొదటి పేజీ తరువాయి)

ఆరుగురు మహిళలే ఉన్నారు.

1,016 మంది ఎంపిక

ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ సహా వివిధ శాఖల్లోని 1,105 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. గత ఏడాది మే 28న ప్రిలిమ్స్ నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన వారు సెప్టెంబరులో మెయిన్స్‌కు హాజరయ్యారు. డిసెంబరు 8న మెయిన్స్ ఫలితాలు వెల్లడించారు. ఇందులో ప్రతిభ చూపినవారికి జనవరి 2- ఏప్రిల్ 9న మధ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. 1,016 మందిని ఎంపిక చేశారు. జనరల్ అభ్యర్థులు 347, ఈడబ్ల్యూఎస్ నుంచి 115, ఓబీసీ 303, ఎస్సీలు 165, ఎస్టీలు 86 మంది సివిల్ సర్వీసులకు ఎంపికయ్యారు. 15 రోజుల్లో మార్కులను వెబ్‌సైట్ ‍టీటీటీ.ఉటీఛి.జౌరి.జీ లో అందుబాటులో ఉంచుతామని యూపీఎస్సీ ప్రకటించింది. కాగా, 2022లో తెలంగాణకే చెందిన ఉమా హారతి మూడో ర్యాంకు సాధించారు. తాజా ఫలితాల్లో టాప్-25లో పది మంది మహిళలున్నారు. ఈ 25 మందిలోనూ ఐఐటీ, ఐఐఎం, ఎన్‌ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి డిగ్రీలు పొందిన పలువురు ఉన్నారు. సివిల్స్ విజేతలకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. వారి శ్రమ, పట్టుదల, అంకితభావం కారణంగానే ప్రజా సేవకు అవకాశం లభించిందని కొనియాడారు. 'మీ కృషి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని' పేర్కొన్నారు. కాగా, సివిల్స్‌లో ప్రతిభ చూపి తెలుగు రాష్ట్రాల అభ్యర్థులను ప్రశంసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. 50 మందిపైగా ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనన్యరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నిరుడు ఐపీఎస్.. ఇప్పుడు ఐఏఎస్

సివిల్స్ టాపర్ ఆదిత్య శ్రీవాత్సవ యూపీలోని లఖ్‌నవూకు చెందినవారు. గతేడాది 236 ర్యాంకుతో ఐపీఎస్‌కు ఎంపికై హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అకాడమీలో శిక్షణ పొందారు. బెంగాల్‌లో ట్రైనీ ఐపీఎస్‌గా ఉన్న శ్రీవాత్సవ ఐఐటీ కాన్పూర్‌లో బీటెక్, ఎంటెక్ చదివారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఆప్షనల్ సబ్జెక్టుగా ఈసారి సివిల్స్ రాసి టాపర్‌గా నిలిచారు.

అమ్మ చనిపోయిన బాధను అధిగమించి..

రెండో ర్యాంకర్ అనిమేష్ ప్రధాన్‌ది ఒడిశాలోని అంగుల్ జిల్లా తల్చార్ పట్టణం. కేంద్రీయ విద్యాలయంలో చదివారు. రూర్కెలా ఎన్‌ఐటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పూర్తిచేశారు. సోషియాలజీ ఆప్షనల్‌గా సివిల్స్ సాధించారు. అనన్యలాగానే ఎలాంటి కోచింగ్ లేకుండా తొలి ప్రయత్నంలోనే సివిల్స్ కొట్టారు. 2022లో సాధన మొదలుపెట్టానని, రోజుకు 5 నుంచి 6 గంటలు చదివానని ఆయన తెలిపారు. కాగా, గత నెలలో సరిగ్గా అనిమేష్ ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో ఆయన తల్లి మృతిచెందారు. తండ్రి 2015లోనే చనిపోయారు. అయినా మనోధైర్యంతో ముందుకెళ్లి అనుకున్నది సాధించారు. సొంత రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు సేవ చేయడమే తన లక్ష్యమని వివరించారు.

ఐపీఎస్ శిక్షణలో ఉంటూ.. అమ్మానాన్నకు చెప్పకుండా

కేరళకు చెందిన పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్ చిన్నప్పటి నుంచి ఆటలు, చదువులో ప్రతిభావంతుడు. ఐఏఎస్ సాధించాలన్న లక్ష్యం పెట్టుకున్నా.. గత ఏడాది 121వ ర్యాంకులో నిలిచారు. దీంతో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. కానీ, తన లక్ష్యాన్ని మాత్రం మరువలేదు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో శిక్షణలో ఉంటూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. అయితే, ఇదంతా అతడు తల్లిదండ్రులకు ఏమాత్రం చెప్పలేదు. తాజాగా ఫలితాల్లో సిద్ధార్థ్ 4వ ర్యాంకు సాధించాడని తెలిసి, టీవీలో ఫొటో, పేరు చూసి వారు అమితాశ్చర్యానికి గురయ్యారు. సిద్ధార్థ్ బీఆర్క్ చదివారు. ఆంత్రోపాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకున్నారు.

సేవ లక్ష్యం.. అది సివిల్స్ ద్వారానే సాధ్యం

నా చిన్ననాటి కల నెరవేరింది: అనన్య

"సమాజానికి సేవ చేయాలనేది నా చిన్ననాటి కల. అది సివిల్ సర్వీసెస్ ద్వారానే సాధ్యమని గట్టిగా నమ్మాను. అలా బలంగా నాలో నాటుకున్న కోరిక నెరవేరింది. మా ఇంట్లో సివిల్ సర్వీసెస్‌లో ఉన్నవారు ఎవరూ లేరు. అయినా లక్ష్యాన్ని ఆత్మవిశ్వాసంతో అందుకున్నా. ఎంతో గర్వంగా ఉంది" అని తెలిపారు అనన్యరెడ్డి. ఇంటర్వ్యూ తర్వాత మంచి ర్యాంకు వస్తుందని భావించానని, మూడో స్థానంలో ఉంటానని అసలు ఊహించలేదని వివరించారు. కాగా, అనన్య గత సంవత్సరమే డిగ్రీ పూర్తి చేశారు. ఏడాది వ్యవధిలోనే సివిల్స్‌లో ప్రతిభ చూపారు. "రోజుకు 12 నుంచి 14 గంటలు చదివా. సిలబస్ మొత్తం కవరయ్యేలా సన్నద్ధత వ్యూహాన్ని రూపొందించుకున్నాను. సివిల్స్‌లో నా ఆప్షనల్ ఆంత్రోపాలజీ. దీనికి మాత్రమే కోచింగ్ తీసుకున్నా. సొంత నోట్స్ ఆధారంగానే పరీక్షలకు హాజరయ్యాను. మా అమ్మ మంజులత గృహిణి, నాన్న సురేష్‌రెడ్డి సెల్ఫ్ ఎంప్లాయి. చాలా ప్రోత్సహించారు" అని వివరించింది. అనన్య సాధించిన ఘనత పట్ల పాలమూరుకు చెందిన విద్యావేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన తొలి వ్యక్తి కావడం విశేషం.

వెన్నులో ఇన్ఫెక్షన్‌తో కాళ్లు చచ్చుబడినా..



ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన అనిత వేములపాటి సివిల్స్ నాలుగో ప్రయత్నంలో 887 ర్యాంక్ సాధించారు. ఖరగ్‌పూర్ ఐఐటీలో రెండో సెమిస్టర్ చదువుతుండగా వెన్నులో ఇన్ఫెక్షన్ రావడంతో రెండు కాళ్లు చచ్చుబడి వీల్‌ఛైర్‌కు పరిమితమయ్యారు. అయినా నిరాశ చెందకుండా డిగ్రీ పూర్తి చేసి అమ్మానాన్నల ప్రోత్సాహంతో సివిల్స్ సాధించారు. అనిత తండ్రి రామచంద్రరావు రైల్వేశాఖలో ఉన్నతాధికారిగా, తల్లి ఇందిరాదేవి ఐసీడీఎస్‌లో అధికారిగా పనిచేస్తున్నారు.

ఇక.. ఎండ ప్రచండమే!

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు మరింత మండనున్నాయి. రానున్న నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు మరింత పెరుగుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా కోస్తా ప్రాంతంలో 44నుంచి 46డిగ్రీలు, రాయలసీమ ప్రాంతంలో 42 నుంచి 44 డిగ్రీలు, కొన్ని చోట్ల 39 నుంచి 42డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కాకినాడ, ఎన్టీఆర్, పల్నాడు, నంద్యాల జిల్లాల్లో 44-46 డిగ్రీలు, అల్లూరి, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 42 నుంచి 43 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అలాగే 175 మండలాల్లో వడగాడ్పులు వీయనుండగా, 46 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ఉంటాయని హెచ్చరించింది. ఈవిధంగా ఈ నెల 18,19,20 తేదీల్లో ఎండ, వడగాడ్పులు ప్రభావం చూపుతాయని స్పష్టం చేసింది. కాగా, మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాలు నిప్పుల కొలిమిని తలపించాయి. శ్రీకాకుళం జిల్లా కోవిలంలో 45.4, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 45.2, కొత్తవలసలో 45.2, అనకాపల్లి జిల్లా రావికమతంలో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 88 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచగా, 89 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. నిత్యం జనసమ్మర్దంగా ఉండే పలు కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనులపై బయటికి వచ్చినవారు ఎండకు ఠారెత్తారు.

మా డబ్బులు మా దగ్గరే: ఆర్టీసీ

» 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) ద్వారా ఇంకో రూ.7,000 కోట్లు అప్పు తెచ్చుకునేందుకు జగన్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల నిధులను మళ్లించబోతోందని 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంపై ఏపీఎస్ఆర్టీసీ స్పందించింది. ఉద్యోగులకు సంబంధించిన నిధులన్నీ తమ వద్దే ఉన్నాయని వెల్లడించింది. 'ఆర్టీసీ సొమ్ముకు ఎసరు' శీర్షికన ఈ కథనంలో.. పీఎఫ్‌సీ ద్వారా జారీ చేసే బాండ్లను ఆర్టీసీ నిధులు ఉపయోగించి ప్రభుత్వం కొనుగోలు చేయనుందని.. ఈ మేరకు రుణానికి గ్యారెంటీ ఇచ్చేందుకు ఆర్థిక శాఖ సిద్ధమైందని తెలిపింది. రేపో మాపో సంతకాలు కూడా జరిగిపోయే అవకాశాలున్నట్లు పేర్కొంది. ఆర్టీసీ వద్ద దాదాపు రూ.3,500-రూ.4,000 కోట్ల నిధులున్నాయని, ఇవి ఉద్యోగులకు సంబంధించినవని, వీటిని మళ్లించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసినట్లు 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది.

గ్రూప్ 1 టాపర్‌కు 198వ ర్యాంకు

సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజం


ప్రత్యూష

సివిల్స్ ఫలితాల్లో పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన గణేశ్న భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష 198వ ర్యాంక్ సాధించారు. ఆమె గత ఏడాది గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో తొలిస్థానం సాధించి ప్రస్తుతం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. గణేశ్న వెంకట రామాంజనేయులు, ఉషా దంపతులకు ఏకైక సంతానం ప్రత్యూష. ఆమె మొదట నుంచి చదువుపై ఎంతో ఆసక్తి కనబరిచేవారు. తల్లి గృహిణి. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో ఈ ర్యాంకు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొక్కవోని ఆత్మ విశ్వాసంతో ప్రణాళికాబద్ధంగా చదివారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ బి. లావణ్యవేణి అభినందించారు.

శాసన మండలి చైర్మన్ కుమారుడికి 833వ ర్యాంకు


కొయ్యే చిట్టిరాజు

శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కుమారుడు చిట్టిరాజు సివిల్స్‌లో సత్తా చాటారు. తొలి ప్రయత్నంలోనే 833వ ర్యాంకు సాధించారు. చిట్టిరాజును పలువురు అభినందించారు.

సీఐ అవమానించడంతో ఉద్యోగానికి రాజీనామా

సివిల్స్ 780వ ర్యాంక్

నాలుగో ప్రయత్నంలో కానిస్టేబుల్ ఉదయ్‌కృష్ణారెడ్డి విజయగాథ


ఉదయ్ కృష్ణారెడ్డి

చిక్కడపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): "నా తప్పు లేకున్నా.. వ్యక్తిగత కక్షతో అరవై మంది పోలీసుల ముందు సీఐ నన్ను అవమానించాడు. దీంతో ఆ రోజే కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేశా. ఐఏఎస్ సాధించాలని కసితో దీక్ష తీసుకున్నా. ఆ ఏడాది నుంచే సన్నద్ధత ప్రారంభించా. నాలుగో ప్రయత్నంలో 780వ ర్యాంక్ సాధించా" అని ఏపీలోని ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. తన చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారని, నానమ్మ రమణమ్మ పెంపకంలో పెరిగానని వివరించారు. కష్టపడి చదివి కానిస్టేబుల్ కొలువు సాధించానని, 2013-18 మధ్య కానిస్టేబుల్‌గా గుడ్లూరులో కానిస్టేబుల్‌గా పనిచేశానని చెప్పారు. ఆ సమయంలో సీఐ చేసిన అవమానమే సివిల్స్ సాధించేందుకు దోహదపడిందన్నారు. ఐఆర్‌ఎస్ వస్తుందని.. ఆ జాబ్‌లో చేరి ఐఏఎస్ సాధించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. తనకు జంతువులంటే ఎంతో ప్రేమ అని.. వాటికోసం దేశవ్యాప్తంగా 109 సర్వీసు ప్రారంభించేలా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న బాయ్ రాష్ట్ర చైర్మన్ నాగమల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు

బాయ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

చిట్టినగర్, ఏప్రిల్ 16: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం జరిగింది. సంఘ జాతీయ అధ్యక్షుడు కె.విశ్వనాథన్, మాజీ అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి హాజరయ్యారు. సంఘ జాతీయ ఉపాధ్యక్షుడిగా డి. పంకజ్‌రెడ్డి, రాష్ట్ర శాఖ చైర్మన్‌గా అత్తలూరి నాగమల్లేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యదర్శిగా కేవీఎస్ బుచ్చిరాయుడు, కోశాధికారిగా శేషగిరిరావు, ఉపాధ్యక్షులుగా కె.వెంకట నాగిరెడ్డి, ఎన్.నాగేశ్వరరావు, టి.భాస్కరరావు, ఎం.ఆంజనేయరెడ్డి, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కొండా రమేష్, సంయుక్త కార్యదర్శిగా టి.వంశీకృష్ణ, బి.మాల్యాద్రిరెడ్డి, పీఆర్వోగా పి.త్రిమూర్తిరాజు, సలహా కమిటీ సభ్యులుగా సీహెచ్ రామకోటయ్య, వల్లభనేని వెంకటేశ్వరరావు, పి.రాజాబాబు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.శీనయ్య, హెచ్ఎస్ రఘువారెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, యు.సురేంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించని అధికారులను తొలగించాలి

● రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎన్నికల అధికారికి బొండా ఫిర్యాదు



వన్‌టౌన్, ఏప్రిల్ 16: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించని అధికారులను విధుల నుంచి తొలగించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు మంగళవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నార్త్ ఏసీపీ డీఎస్‌వీ ప్రసాద్, పాయకాపురం సీఐ కే దుర్గాప్రసాద్‌ను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా 63, 64 డివిజన్ల వైసీపీ కార్పొరేటర్లు బిగ్గరగా నినాదాలు చేస్తూ వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారన్నారు. దీనిపై నార్త్ ఏసీపీ, నున్న సీఐకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారన్నారు. విజిల్ యాప్, ఎన్నికల సంఘం సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

విజయవంతంగా శ్లాస్ పరీక్ష

వన్‌టౌన్, ఏప్రిల్ 16: విద్యా సంవత్సరం ముగింపు దశలో 4వ తరగతి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు నిర్వహించిన స్టూడెంట్ లెర్నింగ్ ఎచీవ్‌మెంట్ సర్వే (శ్లాస్) పరీక్ష విజయవంతంగా ముగిసింది. మంగళవారం ఈ పరీక్షను నిర్వహించారు. పటమటలంక వీఎంసీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులను సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు వి.శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖాధికారి యు.వి సుబ్బారావు పరిశీలించారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం: పీఎస్‌ఎఫ్ఐ

ధర్నాచౌక్, ఏప్రిల్ 16: ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పీఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రతిభా భారతి, సీపీ నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం మంగళవారం జరిగింది. ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ ఆలం, సహాయ కార్యదర్శిగా శివతో పాటు సభ్యులుగా రవి, సాయి ఎన్నుకోబడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

ఆటోనగర్ స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయిస్తాం

● టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్

భారతీనగర్, ఏప్రిల్ 16: జగన్ అధికారంలోకి వచ్చాక తెచ్చిన జీవో నెంబర్ 5,6తో ఆటోనగర్ ఆటోమొబైల్ కార్మికులు, యజమానులు చాలా అయోమయానికి గురై తీవ్ర అవస్థలు పడ్డారని, ప్రమాదకరమైన ఈ జీవోతో కార్మికులు ఉపాధి కోల్పోతారని, కార్మికులకి, ఆటోనగర్ మనుగడకు ప్రమాదకరమైన ఈ జీవోలను చంద్రబాబు అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని, బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక గురునానక్ రోడ్డులోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో ఆటోనగర్ అనుబంధ సంఘాల సభ్యులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయకత్వంలో ఐలా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఆటోమొబైల్ కార్మికుల నైపుణ్యం పెంపొందించుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆటోనగర్‌లో వాటర్ సమస్య పరిష్కరిస్తామన్నారు. గుంట తిప్ప డ్రైయిన్, సాల్వెంట్ రోడ్డు సమస్య పరిష్కరిస్తామన్నారు. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డుకి కనెక్టివిటీ ఏర్పాటు చేస్తామన్నారు. పాత పద్ధతుల్లో నడుస్తున్న ఆటోనగర్‌ను అప్‌గ్రేడేషన్ చేసే విషయం లోకేశ్‌తో మాట్లాడి ఆటోనగర్‌ను అప్‌గ్రేడేషన్ ఎలా చేయాలో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, మోటార్ కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.లక్ష్మీనారాయణ, ఆటోనగర్ మెకానిక్ యూనియన్ కార్యదర్శి దస్తగిరి, పెయింట్ అసోసియేషన్ కార్యదర్శి వీరాచారి, ఏపీ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వి.ఈశ్వరరావు, అమరావతి కారు అసోసియేషన్ అధ్యక్షుడు దివాకర్, ఐలా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బోడే ప్రసాద్, టీడీపీ నేతలు బొప్పన భవకుమార్, ఎంఎస్ బేగ్, చెన్నుపాటి వజీర్, జనసేన జిల్లా సమన్వయ కర్త అమ్మిశెట్టి వాసు, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, బీజేపీ తూర్పు కన్వీనర్ పోతంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేశినేని శివనాథ్

క్రైస్తవులకు నిరంతరం అండగా ఉంటాం

● పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో సుజనా చౌదరి, కేశినేని శివనాథ్

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 16: పశ్చిమలో క్రైస్తవుల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం అండగా ఉంటానని పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వై. సుజనా చౌదరి హామీ ఇచ్చారు. జిల్లా క్రిస్టియన్స్ సెల్ అధ్యక్షుడు మోహన్‌రావు ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఊర్మిళానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌తో పాటు సుజనా చౌదరి పాల్గొని మాట్లాడారు. క్రిస్టియన్ల సంక్షేమానికి, అభివృద్ధికి అధికారంలోకి రాగానే తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కూటమిని గెలిపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, సృజనా ట్రస్ట్, కేశినేని ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవలను అందిస్తామన్నారు. జిల్లా క్రిస్టియన్ సెల్ నేతలు కామా దేవరాజ్, పరిశపోగు రాజేష్, ఇత్తడి చార్లెస్, టీడీపీ నేతలు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్.బేగ్, టీడీపీ అధికార ప్రతినిధి ఎస్‌కే నాగూల్ మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన నేత రజనీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి


వినూత్న ప్రాజెక్టుల ఆవిష్కరణ



ఉంగుటూరు, ఏప్రిల్ 16: విద్యార్థులు తమలోని సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానానికి మరింత పదును పెట్టితే వినూత్నమైన ప్రాజెక్టులు రూపొందించి, ప్రదర్శించేందుకు ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు వేదికగా నిలుస్తాయని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో సీఎస్ఈ విభాగాధిపతి కేపీఎన్‌వీ సత్యశ్రీ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఎక్స్‌పోను నిర్వహించారు. ఇందులో డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్‌కు సంబంధించి క్రోనికల్ డిసీజెస్, ట్యూమర్స్ ప్రిడిక్షన్స్, డైలీ డొమిస్టిక్ నెసెస్సిటీస్ ఎవల్యూషన్ ఇమేజ్ క్లాసిఫికేషన్ అనే అంశాలపై కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు 38 ప్రాజెక్ట్ అప్లికేషన్స్ ప్రొటోటైప్స్‌ను రూపొందించి ప్రదర్శించారు. చైర్మన్ సుంకర రామబ్రహ్మం, డైరెక్టర్ కె.రాజశేఖరరావు, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, డీన్ ఆఫ్ అకడమిక్స్ సీహెచ్ శాంతిరాణి, ప్రాజెక్ట్ ఎక్స్‌పో పర్యవేక్షకులుగా బీవీ ప్రవీణ్‌కుమార్, ఎం.సాంబశివరావు, టి.నాగమౌనిక వ్యవహరించారు.

స్థిరాస్తి రంగ సమస్యల పరిష్కారానికి కృషి

● నార్కెడ్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ



అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేషనల్ రియల్ ఎస్టేట్ డవలప్‌మెంట్ కౌన్సిల్ (నార్కెడ్) పురోగతికి ప్రయత్నిస్తానని సంస్థ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ అన్నారు. జోన్ అధ్యక్షుడిగా మాలక్ష్మీ గ్రూపు సీఈవో సందీప్ మండవ ఏకగ్రీవంగా ఎన్నిక అయిన నేపథ్యంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న విభిన్న సమస్యలకు ఆయా ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించే క్రమంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, భీమవరం ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధికి సెంట్రల్ జోన్ నేతృత్వం వహిస్తోందన్నారు. గౌరవ చైర్మన్‌గా గద్దె రాజలింగం, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడిగా ఎం.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా సాదినేని వెంకటరమణ, కోశాధికారి పోట్ల వెంకట కృష్ణ ఎన్నికైనట్టు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఎం. గణేష్‌కుమార్, జి. హరిప్రసాదరెడ్డి, కార్యదర్శులుగా సీహెచ్. శరత్‌కుమార్, పి. రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరావు, శ్రీనివాస్‌మెహర్, సురేష్, శ్రీనివాస్, కృష్ణకిశోర్, వేణుమాధవ్, చైతన్య వ్యవహరించనున్నారన్నారు.

23న మద్రాసు రెజిమెంట్ అవగాహన సదస్సు

కృష్ణలంక: ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్రాసు రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువుల సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో ఏప్రిల్ 23న అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు ఉమ్మడి జిల్లాల సైనిక సంక్షేమ అధికారిణి సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ కె.కల్యాణవీణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఉమ్మడి జిల్లాల్లో మద్రాసు రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువులు తమ డిశ్చార్జ్ బుక్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్, ఐ కార్డ్, ఆధార్ కార్డు తీసుకొని ఏప్రిల్ 23న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో మద్రాసు రెజిమెంట్ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరుకావాలని కోరారు.

నేడు రేషన్ సరుకుల పంపిణీ

కృష్ణలంక: నిత్యావసరాలను ప్రతి కార్డుదారుడికి అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కొంతమంది వినియోగదారులు రేషన్ సరుకులు పొందలేకపోతున్నారనే విషయం దృష్టిలో పెట్టుకొని ప్రతినెల 17న మధ్యాహ్నం వరకు పంపిణీ చేస్తున్నట్టుగానే ఈ నెల 17న బుధవారం మధ్యాహ్నం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద మిగిలిన కార్డుదారులకు సమాచారం ఇచ్చి నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని జేసీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైస్ కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కోడిగుడ్డు ప్రశ్న వేయించండి

● ఏపీ హేతువాద సంఘం

అజిత్‌సింగ్‌నగర్: సీఎం వైఎస్ జగన్‌పై రాయి వేసిన దండగులను పట్టుకునేందుకు కోడిగుడ్డు ప్రశ్న వేయించాలని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య ఎద్దేవా చేశారు. చిన్నపాటి సంఘటనలోనూ నిందితులను పట్టుకోలేకపోవడంపై మంగళవారం ఆయన ఓ ప్రకటనలో చమత్కరించారు. గతంలో ఇళ్లల్లో దొంగతనాలు జరిగినప్పుడు ఎవరు చేశారో తెలియక దెయ్యాలు చేశాయని భావించి పూర్వం మంత్రగాళ్ల దగ్గరకు వెళ్లి కోడిగుడ్డు ప్రశ్న వేయించేవారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అదే పరిస్థితి తలెత్తిందన్నారు. సీఎం పర్యటిస్తుంటే చెట్లు నరికివేయడం, విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఎక్కడా చూడలేదన్నారు.

జగన్‌రెడ్డి రాజకీయ జీవితమంతా నాటకాలమయం: సుచిత్ర

విద్యాధరపురం: జగన్‌రెడ్డి రాజకీయ జీవితం మొత్తం నాటకాలమయమని తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అన్నారు. మంగళవారం ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి గులకరాయి డ్రామాకు జగన్ తెరతీశాడని ఆక్షేపించారు. 2014 ఎన్నికల్లో తండ్రి శవాన్ని పక్కన పెట్టుకొని అధికారం కోసం సంతకాల డ్రామా, 2019 ఎన్నికల్లో కోడికత్తి డ్రామా, సొంత బాబాయి హత్య, తాజాగా గులకరాయితో దెబ్బ వంటి సంఘటనలను తెరపైకి తెచ్చాడన్నారు. చంద్రబాబు, లోకేశ్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి భయపడిన జగన్ గులకరాయి సంఘటనతో కొత్త నాటకానికి తెరతీశాడన్నారు.

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి జూలై నెల కోటాను టీటీడీ గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

'మద్యం మాస్టర్' వాసుదేవ రెడ్డిపై వేటు!

- బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీపై ఈసీ చర్యలు
- ఆయనను పక్కకు తప్పించాలని ఆదేశం
- డిప్యూటేషన్‌పై రాష్ట్రానికి రప్పించిన జగన్
- గడువు ముగిసినా కొనసాగింపు
- మద్యం సేల్స్ బాధ్యతలు అప్పగింత
- డిస్టిలరీలు, డిపోలు, షాపులపై ఆజమాయిషీ
- తొలి నుంచీ వైసీపీ సేవలోనే ఎన్నికల వేళ మరింత బరితెగింపు
- అధికార పార్టీకి అడిగినంత మద్యం
- ఈసీకి ఫిర్యాదులతో చర్యలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటువేసింది. ఆది నుంచీ జగన్ సేవలో తరిస్తూ... ఎన్నికల వేళ మరింత బరితెగిస్తున్న ఆయనకు షాక్ ఇచ్చింది. కొత్త ఎండీ నియామకానికి వీలుగా ముగ్గురు ఐఏఎస్‌ల పేర్లు ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం గమనార్హం. వాసుదేవ రెడ్డి ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసు అధికారి. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ ఏరికోరి ఆయనను రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. కీలకమైన మద్యం అమ్మకాల బాధ్యతను ఆయన చేతుల్లో పెట్టారు. అంతే... ఆ రోజు నుంచి జగన్ ఆదేశాలే శిరోధార్యంగా వాసుదేవ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన బేవరేజెస్ కార్పొరేషన్ పనితీరును మార్చేశారు. మద్యం వ్యాపారంపై జగన్ మార్కు వేయించారు. కోడ్ అమల్లోకి వచ్చాక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీ శ్రేణులకు మద్యం ధారాళంగా అందేలా చేయడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఎన్నికల్లో ప్రభావం చూపే కీలకమైన మద్యాన్ని వాసుదేవరెడ్డి అధికార పార్టీకి అడిగినంత ఇస్తున్నారంటూ ఇటీవల ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. దీనిపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఆయనను పక్కకు తప్పించాలని ఆదేశించింది. దీంతో... ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవ రెడ్డిని తప్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. కార్పొరేసన్ ఎండీగా ఎంకెవరినో కాకుండా... ఐఏఎస్‌నే నియమించాలని ఈసీ నిర్ణయించుకోవడం గమనార్హం. దీనికోసం ఈసారి ముగ్గురు ఐఏఎస్ అధికారుల పేర్లు ప్రతిపాదించాలని ఈసీ ఆదేశించింది. ఆ మేరకు ముగ్గురు యువ ఐఏఎస్ అధికారుల పేర్లను ఈసీకి పంపింది.

టీడీపీ హయాంలో మద్యం విధానంపై ఫిర్యాదు చేసిందీ, చంద్రబాబుపై కేసు పెట్టించిందీ వాసుదేవ రెడ్డే. స్వయంగా ఆయనే సంతకాలు చేసి ఫిర్యాదును సీఐడీ చేతుల్లో పెట్టారు. చంద్రబాబును మరిన్ని రోజులు జైల్లో ఉంచాలని వైసీపీ చేసిన కుట్రకు సహకరించారు.

అధికార పార్టీకే మద్యం...

మొదటినుంచీ వైసీపీతో అంటకాగుతున్న వాసుదేవరెడ్డి ఈ ఎన్నికల్లోనూ అధికార పార్టీకి మద్యం విషయంలో ఢోకా లేకుండా చూస్తున్నారు. షాపులు ఎలాగూ ప్రభుత్వానివే కావడంతో పలు చోట్ల వైసీపీ నేతలకు పెద్దఎత్తున మద్యం సరఫరా చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక మద్యం అమ్మకాలపై నియంత్రణ రావడంతో, 'ఒక వ్యక్తికి ఒక్క సీసానే అమ్ముతున్నారు. గతేడాది ఈ తేదీన ఎంత అమ్ముతున్నారో ఇప్పుడూ అంతే అమ్మాలి. ఒకరికి ఒక సీసా చొప్పునే అమ్ముతున్నా గతేడాది కోటాను ప్రామాణికంగా తీసుకుంటే మధ్యాహ్నానికే షాపుల్లో మందు ఖాళీ అవుతోంది. గతేడాది ఒక రోజంతా అమ్మిన మద్యం... ఇప్పుడు సగం రోజులోనే ఎలా అమ్ముడవుతుందో బేవరేజెస్ కార్పొరేషన్‌కే తెలియాలి. కాగా మద్యం డిపోల నుంచే నేరుగా వైసీపీ నేతలకు మద్యం పంపుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది.

వైసీపీతో సాన్నిహిత్యం

2008 బ్యాచ్‌కు చెందిన వాసుదేవరెడ్డి గతంలో గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పనిచేశారు. అప్పట్లో ఆయనకు సీఎం కార్యాలయంలో పనిచేసే కేఎస్‌ఆర్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటినుంచీ ఆయన రైల్వేకు సంబంధించి విషయాల్లో వైసీపీకి సమాచారం చేరవేస్తూ, పార్టీ నేతలకు సన్నిహితంగా ఉంటూ వచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మానుకోటలో జగన్ కుటుంబంపై జరిగిన రాళ్ల దాడి ఘటనకు సంబంధించిన సమాచారం ముందుగానే జగన్‌కు ఇచ్చారనే ప్రచారం ఉంది. ఇలా తొలినుంచీ వైసీపీతో పలు రకాలుగా సన్నిహితంగా ఉంటూ వచ్చిన వాసుదేవరెడ్డిని అధికారంలోకి వచ్చిన వెంటనే డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చారు. మొదటి మూడేళ్ల డిప్యుటేషన్ గడువు ముగిసినా పైస్థాయిలో సిఫారసు చేయించి మరీ మరో మూడేళ్లకు కొనసాగించేలా కేంద్రం నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు.


ఆంధ్రజ్యోతి
బుధవారం 10-4-2024
వైసీపీ 'మద్యం' దారి!
డిపోల నుంచి నేరుగా నేతలకు
మద్యం షాపులూ ప్రభుత్వం చేతిలోనే
(అమరావతి-ఆంధ్రజ్యోతి) ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం అధికార పార్టీ వైసీపీ 'మద్యం దారి' పట్టింది. వైసీపీ

ఈ నెల పదవ తేదీన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం

సర్వం ఆయనే....

వాస్తవానికి గతంలో బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ పోస్టుకు ప్రత్యేకంగా అధికారిని నియమించేవారు కాదు. ఎక్సైజ్ కమిషనరే ఇన్‌చార్జ్ ఎండీగా వ్యవహరించేవారు. అప్పట్లో మద్యం పాలసీ రూపొందించడం, వేలం నిర్వహించడం, ఆదాయం వ్యవహారాలను కార్పొరేషన్ చూసేది. కానీ మద్యం విషయంలో పక్కా ప్లాన్ రూపొందించిన వైసీపీ ప్రభుత్వం వ్యాపారాన్ని పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుంది. అప్పుడు వాసుదేవరెడ్డిని ఎండీగా నియమించి, మొత్తం వ్యాపారాన్ని ఆయన చేతుల్లో పెట్టింది. వైసీపీ ప్రభుత్వం పైకి 'ప్రభుత్వ మద్యం షాపుల' పాలసీని ప్రకటించినా అంతర్గతంగా కమీషన్ల పాలసీని ప్రవేశపెట్టింది. కంపెనీలకు ఆర్డర్ ఇవ్వాలంటే, ప్రతి కేసుకు రూ.200 నుంచి రూ.250 వైసీపీ పెద్దలకు కమీషన్ చెల్లించాలి. ఈ ప్రక్రియలో కంపెనీలకు ఆర్డర్లు వాసుదేవరెడ్డి ఇస్తే, షాపుల్లో ఏం అమ్మాలనేది ఎక్సైజ్‌లో ఓ డిప్యూటీ కమిషనర్ చూసుకున్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా ఎడాపెడా అప్పులు చేసిన జగన్ ప్రభుత్వం, బేవరేజెస్ కార్పొరేషన్‌నూ వదల్లేదు. మద్యం ఆదాయాన్ని చూపించి రూ.14వేల కోట్లు అప్పులు చేసింది. ఈ ప్రక్రియలో ఎండీ వాసుదేవరెడ్డి కీలకంగా వ్యవహరించారు.

జగన్ సేవలో జవహర్!

(మొదటి పేజీ తరువాయి)

పట్టించుకోలేదు. ప్రభుత్వ ఉద్యోగినని మరిచిపోయి.. జగన్ కోసం 'పొలిటికల్' ప్రచారంలోకి దిగిన సచివాలయ ఉద్యోగ సంఘం నేత వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేయాలని ఈసీ ఆదేశించినా జవహర్‌రెడ్డి వినిపించుకోలేదు.

పంపించమన్నా... వినని సీఎస్

ఐఆర్ఎస్ అధికారిగా ఆదాయపు పన్నుశాఖలో పని చేస్తున్న చిలకల రాజేశ్వరరెడ్డిని జగన్ సర్కారు రాష్ట్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ స్పెషల్ కమిషనర్‌గా నియమించింది. 2021 ఆగస్టులో... ఐదేళ్ల డిప్యుటేషన్‌పై ఆయన రాష్ట్రానికి వచ్చారు. ఇటీవల ఆయన వ్యవహార శైలి మరింత వివాదాస్పదంగా మారింది. విపక్ష నేతలు, సానుభూతిపరులే ఆయన లక్ష్యం. మంగళగిరిలో చేనేత వస్త్ర వ్యాపారులపై దాడులు చేసినా... చీమకుర్తి, చిలకలూరిపేటలో గ్రానైట్ పరిశ్రమల్లో సోదాలు చేసినా అంతే! ఇటీవల టీడీపీ నేత పత్తిపాటి పుల్లారావు తనయుడిపై కేసులు పెట్టి అరెస్టు చేయించింది ఈయనే. టీడీపీ నేతలే కానక్కర్లేదు... ఆ పార్టీ సానుభూతిపరులైనా, మద్దతుదారులైనా రాజేశ్వర్‌రెడ్డి ఊరుకోరు. 'జగన్‌కు మద్దతు పలికితే ఈ సమస్యలు ఉండవు కదా' అని నేరుగానే వ్యాపారులకే ఉచిత సలహాలు ఇచ్చిన చరిత్ర ఆయనది. ఆయన నిర్వాకాలపై విపక్షాలు సాక్ష్యాధారాలతో సహా కేంద్రానికి ఫిర్యాదు చేశాయి. స్పందించిన కేంద్రం... తక్షణం ఆయనను ఢిల్లీకి పంపించాలని సీఎస్ జవహర్‌రెడ్డిని ఆదేశించింది. తమకు అధికారుల కొరత ఉందని మాత్రం తెలిపింది. డిప్యుటేషన్ కాలం ముగియడానికి ఏడాదిన్నర ముందే ఆయనను తిరిగి పంపించాలని ఆదేశించింది. కానీ... 'కీలకమైన సమయం'లో రాజేశ్వర్ రెడ్డిని వదులుకునేందుకు సీఎస్ ఇష్టపడలేదు. ఆయనను ఈ సమయంలో పంపడం కుదరదని సదరు ఫైలు పక్కన పెట్టారు. ఈ నెల 10 నుంచి అలాగే పెండింగ్‌లో ఉంచారు. రాష్ట్రంలో ఇతర అధికారులే లేరా అన్నట్టు రాజేశ్వర్ రెడ్డి సేవలే కావాలని ఎందుకు అడుగుతున్నట్లు?

సమస్యలపైనే చర్చించారట!

వైసీపీ తరపున ఎన్నికల ప్రచారం చేసి అడ్డంగా దొరికిపోయిన వెంకట్రామి రెడ్డి బుకాయింపులు మొదలుపెట్టారు. బద్వేలు, మైదుకూరు, కడపలో ఆర్టీసీ ఉద్యోగులను కలిపి కేవలం వారి సమస్యలపై మాత్రమే చర్చించానని, ఎలాంటి ప్రసంగాలు చేయలేదని మంగళవారం సీఈవో మీనాకు వినతిపత్రం ఇచ్చారు. సస్పెండ్ చేసిన 11 మంది ఆర్టీసీ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. తనను సస్పెండ్ చేయాలంటూ ఈసీ ఇచ్చిన ఆదేశాలను తొక్కిపెట్టి, ఇప్పటికే సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలంటూ వివరణ ఇప్పించడమే ఇక్కడ విశేషం.

సంఘం గుర్తింపు రద్దు చేయాలి

రోసా నిబంధనలు 2 ఏ (8) ప్రకారం ఏ సంఘం నాయకుడైనా ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా మాట్లాడితే ప్రభుత్వం ఆ సంఘం గుర్తింపు ఉపసంహరించుకోవాలి. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత సూర్యనారాయణకు ఈ నిబంధనను వర్తింపజేసిన ప్రభుత్వం వెంకట్రామిరెడ్డికి ఎందుకు వర్తింపజేయడం లేదు?

వెంకట్రామిరెడ్డికి సీఎస్ రక్షణ



ఆయన పేరు వెంకట్రామి రెడ్డి. పేరుకే ఉద్యోగ సంఘం నాయకుడు! తీరు మాత్రం... వైసీపీ సేవకుడు! ఎన్నికల షెడ్యూలు వచ్చిన తర్వాత కూడా ఆయన పద్ధతి మార్చుకోలేదు. మార్చి 31న కడప, బద్వేలు, మైదుకూరు ఆర్టీసీ డిపోల్లో వెంకట్రామిరెడ్డి ఏకంగా ఎన్నికల ప్రచారమే చేశారు. 'ప్రజారవాణా శాఖ మిత్రులారా! ప్రభుత్వ రుణం తీర్చుకోండి' అంటూ తన పేరిట ముద్రించిన రెండు పేజీల కరపత్రాలను పంచిపెట్టారు. దీనిపై ఈసీ తీవ్రంగా స్పందించింది. వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేయాలంటూ ఈ నెల 8న ఆదేశాలిచ్చింది. ఈసీ ఆదేశించిందంటే... అమలు చేయాల్సిందే. ముందు సస్పెండ్ చేయాలి. ఆ తర్వాతే సంజాయిషీలు, వివరణలు! తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించి అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీశ విషయంలోనూ ఇదే జరిగింది. ముందుగా ఆయనను సస్పెండ్ చేసి, వివరణ కోరారు. ఆ వివరణపై సీఎస్, సీఈవో స్పందనల ఆధారంగా తిరిగి ఆయన్ను విధుల్లోకి తీసుకున్నారు. కానీ... వెంకట్రామి రెడ్డికి స్వయంగా సీఎస్ అండగా నిలిచారు. ఈ నెల 8 నుంచి 13 వరకు ఆ ఫైలు జీఏడీలోని వివిధ అధికారుల మధ్య తిరిగింది. 14న సీఎస్‌కు చేరింది. వెంకట్రామిరెడ్డిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. వైసీపీకి వీరవిధేయుడు వెంకట్రామిరెడ్డిని కాపాడుతూ వస్తున్నారు. కొసమెరుపు ఏమిటంటే... బస్ డిపోల్లో వెంకట్రామిరెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారంటూ తిరుపతి డిపో అసిస్టెంట్ మేనేజర్ చంద్రయ్య సహా మరి కొందరిని ఆర్టీసీ యాజమాన్యం 4వ తేదీనే సస్పెండ్ చేసింది. వెంకట్రామిరెడ్డిని మాత్రం సీఎస్ కాపాడుతున్నారు.

తోట త్రిమూర్తులుకు జైలు

మరో ఎనిమిది మందికి కూడా...

- దళితుల శిరోముండనం కేసులో 27ఏళ్ల తర్వాత ప్రత్యేక కోర్టు తీర్పు

విశాఖపట్నం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో 27 ఏళ్ల క్రితం సంచలనం కలిగించిన దళితుల శిరోముండనం కేసులో విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. కోనసీమ జిల్లా వెంకటాయపాలేనికి చెందిన దళితులను తిట్టి, కొట్టి, శిరోముండనం చేశారనే ఆరోపణలపై వైసీపీ ఎమ్మెల్సీ, ప్రస్తుత మండపేట అసెంబ్లీ అభ్యర్థి తోట త్రిమూర్తులు(ఏ-1)తో పాటు మరో తొమ్మిది మందిపై 324, 342, 506, తదితర సెక్షన్ల కింద 1996 డిసెంబరు 12న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 27 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణలు, వాదనల అనంతరం న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ప్రధాన ఆరోపణలను కొట్టివేసి, స్వల్పంగా గాయపరిచి, దూషించారనే నేరంపై నిందితులకు ఏడాదిన్నర జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ.42వేలు చొప్పున జరిమానా విధించింది. ఈ కేసులో ఇద్దరు బాధితులకు చెరో రూ.1.5లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు త్రిమూర్తులు కాగా ఆయనతో పాటు తోట బాబులు, తోట రాము, పుండరీకాక్షుడు(బేబీ); పుండరీకాక్షుడు(డాక్టర్ బాబు), దవళ కిశోర్, తోట శ్రీను, మోహన ప్రకాశ్, అనంత రమా సత్యనారాయణ ఉన్నారు. మరో నిందితుడు మురళీకృష్ణ మరణించారు. ఈ కేసును వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ మూర్తి అందించిన వివరాల ప్రకారం... తోట త్రిమూర్తులు, తదితరులపై వెంకటాయపాలేనికి చెందిన కోటి చినరాజు, డి.వెంకటరత్నం, కె.గణపతి, పువ్వల వెంకటరమణ, సీహెచ్ పట్టాభిరామయ్యలు ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదటి ఇద్దరిని కొట్టి, శిరోముండనం చేశారనేది ప్రధాన ఆరోపణ. దూషించి, స్వల్పంగా గాయపరిచారనే నేరాలు రుజువు కావడంతో న్యాయాధికారి లాలం శ్రీధర్ వారిని దోషులుగా తేల్చి... 18నెలల జైలు శిక్ష విధించారు. ఈ కేసులో హైకోర్టులో అప్పీలు చేసుకుంటామని, గడువు కావాలని కోరడంతో వారికి తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు. అనంతరం తోట త్రిమూర్తులు మీడియాతో మాట్లాడారు. కోర్టు తీర్పును గౌరవిస్తున్నామని, దీనిపై హైకోర్టులో అప్పీల్ చేసుకుంటామని తెలిపారు.


తీర్పు అనంతరం కోర్టు నుంచి బయటకు వస్తున్న తోట త్రిమూర్తులు

శిరోముండనం కేసు.. అన్నీ సంచలనాలే!

- న్యాయం కోసం కాళ్లరిగేలా తిరిగిన బాధితులు
- 27 ఏళ్ల తర్వాత ఫలించిన నిరీక్షణ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన దళిత యువకుల శిరోముండనం కేసులో ఎట్టకేలకు బాధితుల నిరీక్షణ ఫలించింది. అనేక మలుపులు, సంచలనాల తర్వాత ఇన్నేళ్లకు విశాఖపట్నంలోని ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ కేసు పూర్వాపరాలు ఇవీ.. ఉమ్మడి రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రపురం నియోజకవర్గానికి 1994లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో ఇక్కడినుంచి తోట త్రిమూర్తులు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో బీఎస్పీ తరపున పోలింగ్ ఏజెంట్లుగా ఉన్న ఇద్దరితో త్రిమూర్తులు కుటుంబానికి వివాదం చోటుచేసుకుంది. బూత్‌లోకి చొరబడి త్రిమూర్తులు కుటుంబీకులు రిగ్గింగ్ చేయడానికి ప్రయత్నిస్తే తాము అడ్డుకున్నామని అప్పట్లో బాధితులు పేర్కొన్నారు. ఈ వివాదం నేపథ్యంలో రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన దళిత యువకులు చల్లపూడి పట్టాభి, కనికెళ్ల గణపతి, పువ్వల వెంకటరమణ, కోటి చినరాజు, దడాల వెంకటరత్నంను తనకు వ్యతిరేకంగా అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేశారన్న కక్షతో త్రిమూర్తులు, మరికొంతమంది కలసి హింసించారని అభియోగం. అందులో చినరాజు, వెంకటరత్నంకు శిరోముండనం చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అప్పటి జిల్లా ఎస్పీ వెంకటాయపాలెం వచ్చి కేసును విచారించారు. అనంతరం 1997 జనవరి 4న ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో 1/1997 ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద అప్పటి ఎమ్మెల్యే త్రిమూర్తులుపై కేసు నమోదు చేశారు. అనంతరం 7న ఆయన్ను పోలీసులు అరెస్టు చేయడం అప్పట్లో సంచలనం రేపింది. త్రిమూర్తులుకు మద్దతుగా, వ్యతిరేకంగా ఆందోళనలు జరిగాయి. ఆ తర్వాత జనవరి 18న కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. దీంతో త్రిమూర్తులు, మరికొందరు సహా నిందితులను 87 రోజుల పాటు రిమాండ్ నిమిత్తం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఆ తర్వాత వీరు బెయిల్‌పై విడుదలయ్యారు. 1997 అక్టోబరు 15న కేసును రాజమండ్రి నుంచి విశాఖలోని ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేశారు.

పుట్టుస్వామి కమిషన్‌తో రగడ...

ఈ కేసుపై 1998లో అప్పటి ప్రభుత్వం పుట్టుస్వామి కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేసును ఉపసంహరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా అప్పట్లో న్యాయవాది బొజ్జాతారకం తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఆదేశాలతో కేసు విచారణ మళ్లీ ప్రారంభమైంది. 2006లో నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా స్పెషల్ లీవు పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకాల్లో అభ్యంతరాలు, వివాదాలు నడిచాయి.

కుల ధ్రువీకరణ పత్రాల జారీపైనా అభ్యంతరాలు

కేసు విచారణలో బాధితుల కుల ధ్రువీకరణ పత్రాల జారీపైనా అభ్యంతరాలు వచ్చాయి. బాధితులు అసలు దళిత సామాజికవర్గానికి చెందినవారు కాదని, క్రైస్తవ మతం స్వీకరించారని, వారు బీసీ వర్గం కిందకు వస్తారంటూ ఫిర్యాదులు వచ్చినా న్యాయస్థానాల్లో నిలబడలేదు. కాగా ఈ కేసులోని ఐదుగురు బాధితుల్లో ఒకరైన పువ్వల వెంకటరమణ 2023లో మృతిచెందారు. పది మంది నిందితుల్లో ఒకరైన తలాటం మురళీకృష్ణ కూడా మరణించారు. 2019 నాటికి ఈ కేసు 146సార్లు వాయిదా పడుతూ వచ్చింది. 27ఏళ్లు దాటినా తీర్పు రాకపోవడంతో బాధితుల్లో నిరాశ ఆవహించింది. అయినా పట్టు వదలకుండా వాయిదాలకు తిరుగుతూ వచ్చారు. ఎట్టకేలకు తీర్పు వచ్చినా ప్రధాన నిందితుడైన తోట త్రిమూర్తులుకు విధించిన శిక్ష చాలా చిన్నదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోస్ వర్సెస్ తోట...

శిరోముండనం కేసు విషయమై 2020లో వైసీపీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసును తిరగదోడటంలో బోస్ ప్రమేయం ఉన్నట్లు చర్చ జరిగింది. ఈ కేసులో విచారణ వేగవంతం చేయాలని 2020 నవంబరులో ఆయన రాష్ట్ర హోంమంత్రికి లేఖ రాయడం కలకలం రేపింది. కేసులో ఏ-1గా ఉన్న త్రిమూర్తులు తన పలుకుబడితో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, తద్వారా కేసు నుంచి బయటపడేందుకు తెలివిగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దళితులకు అన్యాయం చేసిన నేపథ్యంలో సొంత పార్టీ అయినా సరే త్రిమూర్తులును వదిలిపెట్టేది లేదని అప్పట్లో బోస్ ప్రకటించారు. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో అనేకసార్లు ప్రత్యర్థులుగా తలపడిన వీరిద్దరూ ప్రస్తుతం వైసీపీలోనే కొనసాగుతుండడం విశేషం.

ఎన్నో కష్టాలు అనుభవించా

శిరోముండనం కేసులో బాధితుడిగా 27ఏళ్లుగా ఎన్నో కష్టాలు అనుభవించాను. కుల ధ్రువీకరణ పత్రాలు కూడా మంజూరు చేయలేదు. సంక్షేమ పథకాలు ఆపేశారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ తరఫున ఏజెంటుగా ఉండి, దొంగ ఓట్లు వేయకుండా అడ్డుకోవడంతోనే శిరోముండనం చేశారు. ప్రస్తుత తీర్పుతో న్యాయం జరిగిందని భావించడం లేదు. దీనిపై హైకోర్టులో పోరాడతాను.

- కోటి చినరాజు, శిరోముండనం బాధితుడు

మూసివేత దిశగా విశాఖ ఉక్కు

- రెండు కోక్ ఓవెన్లలో జీరో ఉత్పత్తి
- 3 బ్లాస్ట్ ఫర్నేసుల్లో రెండు మూసివేత పోర్టు కార్మికుల ఆందోళన ఫలితం

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

వచ్చే నెలలో ఎన్నికయ్యేలోగానే విశాఖపట్నం స్టీల్ ప్లాంటును మూసివేయించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్టున్నాయి. ఈసారి చేతికి మట్టి అంటకుండా భారీ స్థాయిలో కుట్ర చేస్తున్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ఆనుకొని ప్రభుత్వం నిర్మించిన గంగవరం పోర్టును అదానీ గ్రూపు పూర్తిగా హస్తగతం చేసుకున్న సంగతి తెలిసిందే. వారం రోజులుగా ఆ పోర్టులో కార్మికులు న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆందోళన చేస్తున్నారు. ఆపరేషన్లన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. వీరితో పలు దఫాలుగా యాజమాన్యం చర్చలు జరిపినా అవి ఫలప్రదం కాలేదు. కోకింగ్ కోల్ తయారీకి అవసరమైన విదేశీ బొగ్గును ఈ పోర్టు ద్వారానే స్టీల్‌ప్లాంటు దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం 1.5 లక్షల టన్నుల బొగ్గుతో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన రెండు నౌకలు అదానీ గంగవరం పోర్టులో ఐదు రోజులుగా నిలిచిపోయాయి. బొగ్గు సరఫరా లేకపోవడంతో స్టీల్‌ప్లాంటులోని ఐదు కోక్ ఓవెన్ బ్యాటరీల్లో రెండింటిలో ఉత్పత్తిని జీరో చేశారు. అలాగే మూడు బ్లాస్ట్ ఫర్నేసుల్లో ఇప్పటికే ఒకటి మూసేయగా, తాజాగా మరొకటి మూసేస్తున్నారు. ఇక మిగిలింది ఒక్కటే. రోజుకు 20 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా 14 వేల నుంచి 15 వేల టన్నుల ఉత్పత్తి చేస్తూ వస్తున్నారు. ఇకపై ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌పై ఐదు నుంచి ఆరు వేల టన్నుల కంటే ఎక్కువ ఉత్పత్తి రాదు. కోక్ ఓవెన్ బ్యాటరీలను షట్‌డౌన్ చేయడం వల్ల భారీ నష్టం జరగనుంది. వాటిని మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.వందల కోట్ల వ్యయం అవుతుంది. తక్షణమే బొగ్గు సరఫరా పునరుద్ధరించకపోతే మిగిలిన మూడు కోక్ ఓవెన్ బ్యాటరీలను ఒక్కొక్కటిగా షట్ డౌన్ చేయాల్సి ఉంటుంది.

స్పందించని అదానీ యాజమాన్యం

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ముడి సరకులన్నీ కన్వేయర్ బెల్ట్ ద్వారా అందించడానికి అదానీ గంగవరం పోర్టు ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు దానిని పాటించడం లేదు. కార్మికుల ఆందోళనను సాకుగా చూపుతోంది. మరోవైపు దీనివల్ల భారీ నష్టం ఎదుర్కొంటున్న స్టీల్ ప్లాంటు కార్మికులు అంతా ఏకమై ప్లాంటుని కాపాడాలంటూ మంగళవారం జిల్లా కలెక్టర్ మల్లికార్జునను కలిశారు. అదే సమయంలో స్టీల్‌ప్లాంటు యాజమాన్యం మంగళవారం ఉదయం కార్మిక సంఘాలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. బొగ్గు కొరత వల్ల ఉత్పన్నమైన సమస్యలను ఏ విధంగా ఎదుర్కొనాలనే దానిపై సలహాలు ఇవ్వాలని కోరింది.

పోర్టు కార్మికులకు స్టీల్‌ప్లాంటు సమస్య పట్టదా?

విశాఖ స్టీల్‌ప్లాంటులో శాశ్వత, కాంట్రాక్టు ఉద్యోగులు 30 వేల మంది పనిచేస్తున్నారు. మరో 50 వేల మంది పరోక్షంగా ఆధారపడి బతుకుతున్నారు. వేయి మంది కూడా లేని పోర్టు కార్మికుల ప్రయోజనాల కోసం లక్ష మంది ఆధారపడిన స్టీల్‌ప్లాంటుకు నష్టం జరుగుతుంటే ఎవరూ స్పందించక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు ఇలా ఆకస్మిక సమ్మె చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గంగవరం పోర్టు నుంచి నౌకలన్నీ మళ్లింపు

అదానీ గంగవరం పోర్టులో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఇక్కడి కార్మికులు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వారం రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశ, విదేశాల నుంచి ఈ పోర్టుకు వచ్చే నౌకలను ముందుచూపుతో ఇతర పోర్టులకు మళ్లిస్తున్నారు. కాగా, గంగవరం పోర్టులో కంటెయినర్ కార్గో రవాణాకు ప్రత్యేకంగా టెర్మినల్ నిర్మించారు. బుధవారం నుంచి విదేశీ (ఎగ్జిమ్) కంటెయినర్ కార్గో హ్యాండ్లింగ్ చేయాలని రెండు నెలల క్రితమే ముహూర్తం పెట్టుకున్నారు. ఆ మేరకు ఓ నౌక కంటెయినర్లతో బయలుదేరి 16వ తేదీన ఇక్కడికి రావలసి ఉంది. అయితే ఆ కార్గోని హ్యాండిల్ చేసే పరిస్థితి లేకపోవడంతో నౌకను చెన్నై పోర్టుకు మళ్లించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మృతి

కావలి, ఏప్రిల్ 16: బంధుమిత్రులతో కలిసి శ్రీరామనవమిని ఆనందంగా జరుపుకొనేందుకు ఆ కుటుంబం స్వగ్రామానికి చేరుకుంది. పూజాసామగ్రి కొనుగోలుకు బయలుదేరిన వారిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. నెల్లూరు జిల్లా కావలి మండలం గౌరవరం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఆగి ఉన్న లారీని కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దావులూరి శ్రీనివాసులు (50), దావులూరి వరమ్మ (45), దావులూరి లక్ష్మమ్మ (52), గంటా నీలిమ (24), గంటా గౌసిక్‌నంద్ (3) అక్కడికక్కడే మృతి చెందారు. జలదంకి మండలం చామదలకు చెందిన శ్రీనివాసులు 25 ఏళ్ల క్రితం హైదరాబాదుకు వెళ్లి బిల్డర్‌గా స్థిరపడ్డారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా స్వగ్రామంలో జరిగే తిరునాళ్ల కోసం ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి కారులో సోమవారం బయలుదేరి మంగళవారం ఉదయానికి చామదల చేరుకున్నారు. తిరునాళ్లలో శ్రీరాముడి కల్యాణం కోసం పూజా సామగ్రిని తీసుకువచ్చేందుకు అదే కారులో శ్రీనివాసులుతోపాటు ఆయన భర్య వరమ్మ, కుమార్తె నీలిమ, మనుమడు గౌసిక్ నంద్, వదిన లక్ష్మమ్మ కావలికి బయలుదేరారు. బిట్రగుంట మీదుగా కావలికి వస్తూ చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. కారులో ఉన్న ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను వెలుపలకు తీసి, కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

రామతీర్థంలో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

నెల్లిమర్ల, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం ముస్తాబయింది. బుధవారం శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం వెనుక వైపున ఉన్న సువిశాల మైదానంలో నిర్మించిన ప్రత్యేక వేదికపై సీతారాములను ఉంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఈ ఏడాది ఉత్సవాలు అధికారుల ఆధ్వర్యంలో జరగనున్నాయి.

రోగులకు తప్పుడు ప్రిస్క్రిప్షన్లు!



- టాప్ ఇన్‌స్టిట్యూట్‌ల్లో 45% మంది డాక్టర్ల తీరు ఇదీ
- వీరందరూ 4- 18ఏళ్ల సర్వీసు ఉన్నవారే: ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్‌లలో సేవలందిస్తున్న కొందరు వైద్య నిపుణుల తీరుపై ఐసీఎంఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వీరి తీరు రోగుల పాలిట ప్రాణాంతకంగా మారుతోందని ఆ సంస్థ ఇటీవల నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఢిల్లీలోని ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి సహా 13 ప్రముఖ వైద్యసంస్థల్లో నిర్వహించిన ఈ సర్వేలో 45% మంది వైద్యులు తమ రోగులకు ఇస్తున్న ప్రిస్క్రిప్షన్లు అసంబద్ధంగా ఉంటున్నాయని తేలింది. అధ్యయనంలో భాగంగా ఈ వైద్యసంస్థల్లో మొత్తం 7,800 మంది రోగుల నుంచి ప్రిస్క్రిప్షన్లు సేకరించి పరిశీలించారు. ఆ తర్వాత వారిలో 4,838 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 2,171 ప్రిస్క్రిప్షన్లలో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అందులోనూ 475 (9.8%) పూర్తి తప్పులతడకలు కాగా, మరో 102 ప్రిస్క్రిప్షన్లలో ఒకటి కంటే ఎక్కువ రోగ నిర్ధారణలు జరిగాయి. మరికొన్నింటిలో రోగానికి అసలు సంబంధమే లేని మందులు రాశారు. ఇలాంటి లోపభూయిష్ఠమైన ప్రిస్క్రిప్షన్లు ఇచ్చిన డాక్టర్లు అందరూ ఆయా విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేట్లు కావడంతో పాటు సగటున 4 నుంచి 18 ఏళ్లుగా ప్రాక్టీసు చేస్తున్నవారే కావడం విశేషం.

మీరు అమాయకులేం కాదు



- వారంలో బహిరంగ క్షమాపణలు చెప్పండి.. రాందేవ్‌బాబాకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుడు రాందేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణపై సుప్రీంకోర్టు మంగళవారం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. వారు గత ఉత్తర్వుల్లో కోర్టు ఏం చెప్పిందో తెలుసుకోలేనంత అమాయకులేం కాదని.. వారంలోగా బహిరంగ క్షమాపణలు చెబుతూ ప్రకటన ఇవ్వాలని మంగళవారం జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. అల్లోపతి గురించి పతంజలి సంస్థ తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేసిందంటూ గత ఏడాది నవంబరులో ఐఎంఏ పిటిషన్ వేసింది. దీనిపై అప్పుడే సంస్థను కోర్టు మందలించింది. ఆ తర్వాతా ఆ సంస్థ కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడంతో ఇద్దరూ కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. ఏప్రిల్ 2న రాందేవ్ బాబా, బాలకృష్ణ కోర్టులో హాజరయ్యారు. రాందేవ్ క్షమాపణలు చెప్పగా అంగీకరించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఏప్రిల్ 10న మళ్లీ హాజరై క్షమాపణలు చెప్పినా అంగీకరించలేదు. మంగళవారం మాత్రం పరిశీలిస్తామని తెలిపింది. అయితే ఇప్పుడే వారిని వదిలిపెట్టినట్లు కాదని స్పష్టం చేసింది. తదుపరి విచారణను 23న చేపడతామని తెలిపింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	43.0	28.3
రెంటచింతల	42.0	25.0
తిరుపతి	40.5	25.3
విజయవాడ	40.4	25.6

తుపాకులతో బెదిరించి... 'కాకినాడ సీపోర్టు'లో వాటాలు కొట్టేశారు

- లాభాల్లో ఉన్న కంపెనీ వాటాలు కారుచౌకగా లాక్కొన్నారు: ఆనం

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టులో వాటాలు చేతులు మారడంపై తెలుగుదేశం పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. సీపోర్టు యాజమాన్యాన్ని సీఎం జగన్ బృందం తుపాకులతో బెదిరించి బలవంతంగా వాటా చేజిక్కించుకొందని, లాభాల్లో ఉన్న పోర్టులో వాటాను కారు చౌక ధరకు కొట్టేశారని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు. పోర్టు యాజమాన్యాన్ని బెదరగొట్టడానికి రూ.965 కోట్ల పన్ను బకాయిలు ఉన్నట్లు రికార్డులు సృష్టించారని, తమకు వాటా రాగానే ఆ పన్నును రూ.9కోట్లకు తగ్గించేసి సీఎం జగన్‌రెడ్డి పచ్చి మోసానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాకినాడ సీపోర్టు కంపెనీ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడు శరత్‌చంద్రారెడ్డికి చెందిన అర్బో ఇన్ఫ్రాకు వాటాలను అమ్మించారని తెలిపారు. ఈ పోర్టును చేజిక్కించుకోవడానికి జగన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని వివరించారు. రాబోయే ప్రజా ప్రభుత్వంలో ఈ మొత్తం దోపిడీని వెలికితీసి దోషులను జైలుకు పంపిస్తామన్నారు.

'జగనన్న విద్యాదీవెన' జమకాలేదని.. విద్యార్థిని తల్లి ఆత్మహత్యాయత్నం

- హాల్ టికెట్ ఇవ్వని కళాశాల యాజమాన్యం
- మెడకు చున్నీ బిగించుకుని కళాశాల వరండాలోనే అఘాయిత్యం
- అడ్డుకున్న విద్యార్థులు, సిబ్బంది.. విశాఖ పీఎం పాలెంలో సంఘటన

కొమ్మాది (విశాఖపట్నం), ఏప్రిల్ 16: జగనన్న విద్యాదీవెన పథకం కింద నగదు బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో ఓ విద్యార్థిని తల్లి ఆవేదనతో ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన విశాఖ నగరం సమీపంలోని పీఎం పాలెంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. నగరంలో నివసిస్తున్న నిరుపేద దంపతులు తమ కుమార్తెను పీఎం పాలెంలోని ఓ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో చదివిస్తున్నారు. ఈ విద్యార్థినికి నెల రోజుల కిందటే జగనన్న విద్యా దీవెన పథకం కింద బ్యాంకులో నగదు జమ కావాల్సి ఉన్నప్పటికీ పడలేదు. ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి ఈ నెల 19 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట హాల్‌టికెట్ కోసం కళాశాలకు వెళ్తే.. ఫీజు బకాయి రూ.25 వేలు చెల్లించాల్సి ఉందని, ఆ మొత్తం జమ చేస్తేనే హాల్‌టికెట్ ఇస్తామని సిబ్బంది తేల్చి చెప్పారు. దీనిపై విద్యాశాఖాధికారులను సంప్రదించగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిధులు రాలేదని తేల్చేశారు. అసలే కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో మంగళవారం ఆ తల్లి తన కుమార్తెను తీసుకుని కళాశాలకు వెళ్లింది. జగనన్న విద్యా దీవెన పథకం కింద డబ్బు జమ కాలేదని, బ్యాంకులో పడగానే ఫీజు మొత్తం చెల్లిస్తానని కాళ్లావేళ్లా పడింది. లేదంటే అప్పు చేసి అయినా కొద్దిరోజుల్లో కట్టేస్తానని విన్నవించినప్పటికీ హాల్ టికెట్ ఇచ్చేందుకు కళాశాల యాజమాన్యం ససేమిరా అంది. దీంతో ఆమె తన కుమార్తె ఆవేదన చూడలేక కళాశాల వరండాలోనే చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన అక్కడి విద్యార్థులు, కళాశాల సిబ్బంది ఆమెను వారించి కాపాడారు. తల్లి ఆత్మహత్యకు యత్నించడంతో ఆందోళనకు గురైన ఆమె కుమార్తె డయల్ 100కు కాల్ చేయడంతో పీఎం పాలెం పోలీసులు కళాశాల వద్దకు చేరుకుని ఘటనపై విచారణ జరిపారు. రెండు వారాల్లో రూ.12 వేలు చెల్లిస్తామని ఆమె నుంచి హామీ పత్రం తీసుకుని విద్యార్థినికి హాల్‌టికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. కాగా, సమయానికి జగనన్న విద్యాదీవెన డబ్బు పడితే తమకు ఈ ఇబ్బందులు తప్పేవని బాధితురాలు వాపోయింది.

వైసీపీ అనుకూల అధికారులను బదిలీ చేయాలి

- కేంద్ర ఎన్నికల సంఘానికి ఎన్‌డీఏ నేతల ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్న రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఏపీ ఎన్‌డీఏ నేతలు విజ్ఞప్తి చేశారు. సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కె.రఘురామిరెడ్డి, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రతిపక్షాలపై వేధింపులకు పాల్పడుతూ జగన్ పార్టీకి వంతపాడుతున్నారని, వారిని వెంటనే బాధ్యతల నుంచి తప్పించి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో బోగస్ ఓట్లు, ప్రతిపక్షాలపై వేధింపులు, ఎన్నికల్లో అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు బీజేపీ జాతీయ కార్యదర్శి అరుణ్‌సింగ్ నేతృత్వంలో జనసేన నేత నాదెండ్ల మనోహర్, టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, తదితర ఎన్‌డీఏ నేతలు మంగళవారం ఈసీఐ ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను కలిశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జగన్‌రెడ్డీ... మీరెంత నొక్కేశారో చెప్పండి: రాధా

నర్సీపట్నం, ఏప్రిల్ 16: పేద ప్రజల సంక్షేమం కోసం బటన్ నొక్కాను అంటున్న జగన్‌రెడ్డి... ఆయనెంత నొక్కేశారో చెప్పాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు వంగవీటి రాధా అన్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని బలిఘట్టంలో మంగళవారం నిర్వహించిన 'యువశక్తి' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ... 'తన పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని చెబుతున్న జగన్‌రెడ్డి... ఆయన కుటుంబానికి ఎంత లబ్ధి కలిగిందో చెప్పాలి. సొంత మీడియాకు ఈ ఐదేళ్లలో ఎన్ని రూ.వేల కోట్లు దోచిపెట్టారో చెప్పాలి. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం ప్రజా విజయం. యువత తలుచుకుంటే బస్సుయాత్రనే కాదు.. ఏయాత్రనైనా తరిమికొడుతుంది' అని రాధా అన్నారు.

కోడ్ ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్న అధికారులు, వైసీపీ అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతల బృందం ఎన్నికల సంఘాన్ని కోరింది. మంగళవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేశ్‌కుమార్‌మీనాను కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. అనంతరం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ 'ముఖ్యమంత్రిని చంపేయడానికి గులకరాయి విసిరారంట! గులకరాయితో సీఎంని చంపేస్తారా? డ్రామా ఆడటానికి సిగ్గు ఉండొద్దు. నాడు కోడి కత్తి డ్రామా.. నేడు గులకరాయి డ్రామా. సానుభూతి కోసం డ్రామా అని తేలిపోయింది' అని మండిపడ్డారు.

గులకరాయి ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలి

- డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను బదిలీ చేయాలి: జనసేన

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై గులకరాయి దాడి ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని జనసేన పార్టీ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ వేసి, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, విద్యుత్ సరఫరా ఎండీలను విచారించి, నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి ఇవ్వాలని సూచించింది. అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేశ్‌కుమార్ మీనాకు జనసేన పార్టీ నేతలు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు మీడియాతో మాట్లాడుతూ గులకరాయి దాడిలో వాస్తవాలు బయటికి రావాలంటే ఉన్నత స్థాయిలో కమిటీ వేసి, దర్యాప్తు జరపాలని, డీజీపీ, ఇంటిజెన్స్ చీఫ్‌ను బదిలీ చేయాలని కోరినట్లు చెప్పారు. పార్టీ చేనేత విభాగం అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కోడికత్తి కేసులా, గులకరాయి కేసులో సతీష్ అనే సామాన్యుడిని బలి చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

29 మంది నక్సల్స్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఐ.కళ్యాణ్ ఎలిసెల కథనం ప్రకారం.. ఈ నెల 19న మొదటి దశ లోక్‌సభ పోలింగ్‌లో భాగంగా బస్తర్ రీజియన్‌లో ఎన్నికలు జరగనున్నాయి. రెండో దశ ఎన్నికల్లో భాగంగా కాంకేర్‌లో ఈ నెల 26న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎన్నికలను బహిష్కరించాలని కొన్ని రోజులుగా మావోయిస్టులు కరపత్రాలు, లేఖలను విడుదల చేస్తున్నారు. సోమవారం దండకారణ్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఎన్నికల రోజు కుట్రలు పన్నారనే సమాచారంతో చోటాబేటియా రాణా పరిధిలోని బినాగుడ, చోటాబేటియా అడవుల్లో సోమవారం నుంచి బీఎస్ఎఫ్, డీఆర్జీ బలగాలతో కూంబింగ్ ప్రారంభించినట్లు ఈ ఆపరేషన్‌ను ముందుండి నడిపించిన సీనియర్ ఎస్పీ కల్యాణ్(తెలుగు అధికారి) తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 1.30 సమయంలో అబుజ్‌మడ్ ప్రాంతంలో పోలీసులపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో.. పోలీసులు ఎదురుకాల్పులకు దిగారు. "సాయంత్రం 5.30 వరకు.. సుమారు 4 గంటల పాటు ఇరువైపులా కాల్పులు కొనసాగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు ఆగిపోవడంతో.. మా బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో.. మొత్తం 29 మంది మావోయిస్టుల మృతదేహాలను కనుగొన్నాం" అని ఆయన వివరించారు. వీరిలో శంకర్‌రావు, సుమన, లలిత, వినోద్‌బావ్డే, మాధవి, లలిత, రాజు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనాస్థలి నుంచి ఒక ఏకే-47, ఒక ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, పాయింట్-303 రైఫిళ్లు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నక్సల్స్ కాల్పుల్లో బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ చౌదరి మోకాలికి, డీఆర్జీ కానిస్టేబుల్ సూర్యకాంత్ రెండు తొడల్లో తూటాలు దూసుకుపోయాయి. వారిద్దరినీ మెరుగైన వైద్యం కోసం హెలికాప్టర్‌లో రాయ్‌పూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు వెల్లడించారు. "మాకు ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం.. ఈ ఎన్‌కౌంటర్‌లో 50 మంది దాకా నక్సల్స్ పాల్గొన్నారు. ఘటనాస్థలి నుంచి పరారైన వారి కోసం అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేశాం. చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను బేస్‌క్యాంప్‌నకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో మృతదేహాల తరలింపు ఆలస్యమవుతోంది" అని బస్తర్ రీజియన్ ఐజీ పి.సుందర్‌రాజ్ విలేకరులకు తెలిపారు.

తొలిసారి భారీ ప్రాణనష్టం

నక్సల్స్ చరిత్రలోనే ఇది అతి భారీ ప్రాణనష్టంగా తెలంగాణకు చెందిన గ్రేహౌండ్స్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎక్కడ భారీ ఎన్‌కౌంటర్ జరిగినా.. గ్రేహౌండ్స్ ఉనికి ఉండేదని, మంగళవారం నాటి కాల్పుల్లో బీఎస్ఎఫ్, డీఆర్జీ మాత్రమే పాల్గొన్నట్లు వివరించాయి. "2016లో ఏవోబీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు చనిపోయారు. అంతకు ముందు గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 26 మంది నక్సల్స్ మృతిచెందారు" అని పేర్కొన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2008లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత ఇదే అతిపెద్దదని సీఆర్పీఎఫ్ వర్గాలు చెబుతున్నాయి. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు స్వస్థలం జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామం. స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలోనే.. పీపుల్స్‌వార్ గ్రూప్(ప్రస్తుతం మావోయిస్టు పార్టీ) సిద్ధాంతాలకు ఆకర్షితుడై.. సానుభూతిపరుడిగా పనిచేసేవారు. ఆయన తల్లిదండ్రులు సిరిపెల్లి ఓదెలు, రాజపోచమ్మ. ఓదెలు 15 ఏళ్ల క్రితం మృతిచెందారు. ఎన్‌కౌంటర్‌లో శంకర్‌రావు మృతిచెందినట్లు తెలిసిన రాజపోచమ్మ కన్నీరుమున్నీరవుతున్నారు. చల్లగరిగలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఈ ఏడాది 79 మంది మృతి

ఈ ఏడాది మావోయిస్టులకు ప్రతికూలంగా ఉన్నట్లు తాజా ఘటనలు చెబుతున్నాయి. మంగళవారం నాటి ఘటనతో కలిపి.. ఈ మూడున్నర నెలల్లో మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 79 మంది మావోయిస్టులు చనిపోయారు. గడిచిన నెల వ్యవధిలోనే నక్సల్స్ తరఫున భారీ ప్రాణనష్టం(54 మంది) నమోదైంది. దండకారణ్యంలో మావోయిస్టులను గుర్తించేందుకు డీఆర్జీ, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలకు చెందిన 80 వేల మంది జవాన్లు జల్లెడపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరిన్ని సంఘటనలు చోటుచేసుకునే ప్రమాదముందని ఆదివాసీలు బిక్కుబిక్కుమంటున్నారు.



ఎన్‌కౌంటర్‌లో గాయపడిన భద్రతా అధికారికి ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ పరామర్శ

భద్రత బలగాలకు అమిత్ షా అభినందన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం నక్సలైట్లకు వ్యతిరేకంగా విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించినందుకు భద్రత బలగాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభినందించారు. నక్సలైట్ల సమస్య నుంచి ఛత్తీస్‌గఢ్‌ను, దేశాన్ని విముక్తి చేసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

సుమన మృతిపై అధికారిక ప్రకటన చేయని పోలీసులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మావోయిస్టు దళ సభ్యురాలు, శంకర్‌రావు భార్య దాసర్వర్ సుమన అలియాస్ రజిత మృతిచెందినట్లు తెలుస్తోంది. అయితే.. జిల్లా పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. బజార్‌హత్నూర్ మండలం డేడ్రా గ్రామానికి చెందిన సుమన 30 ఏళ్ల క్రితం నక్సల్స్ ఉద్యమం పట్ల ఆకర్షితురాలయ్యారు. అలా అజ్ఞాతంలోకి వెళ్లిన ఆమె మళ్లీ స్వస్థలానికి తిరిగి రాలేదని తెలుస్తోంది. సుమనపై రూ.5 లక్షల రివార్డు ఉంది.

బ్యాలెట్ పత్రాలంటే మళ్లీ పాత రోజులే

- అప్పటి అక్రమాలను ఎలా మరిచిపోతాం.. మానవ జోక్యం ఉంటే లోపాలే
- వీవీప్యాట్ స్లిప్‌ల లెక్కింపుపై సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: ఓట్ల నమోదు, లెక్కింపులో పారదర్శకత సాధించే విషయమై మంగళవారం సుప్రీంకోర్టులో ఆసక్తికరమైన వాదనలు సాగాయి. తాము వేసిన ఓటు అనుకున్న అభ్యర్థికే పడిందని, దాని లెక్కింపు కూడా జరిగిందన్న నమ్మకం ఓటర్లలో కలిగించేందుకు ఈవీఎంలలో నమోదైన ఓట్లతో పాటు, వీవీప్యాట్ మిషన్లలోని పేపర్ స్లిప్‌లన్నింటినీ లెక్కించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై వాదనలు జరిగాయి. ప్రస్తుతం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కేవలం అయిదు వీవీప్యాట్ల స్లిప్‌లను లెక్కిస్తుండగా, దానికి బదులుగా అన్ని పేపర్ స్లిప్‌లను లెక్కించాలని పిటిషనర్లు కోరారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)తో పాటు సామాజిక ఉద్యమకారుడు అరుణ్‌కుమార్ అగర్వాల్ ఈ వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం విచారణ జరిపింది. ఏడీఆర్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. కావాల్సిన విధంగా ఫలితాలు వచ్చేలా ఈవీఎంలలో చిప్స్‌ను అమర్చడం, మాల్‌వేర్ ప్రోగ్రాంల ద్వారా మాన్యుపులేట్ చేయడం వంటివి జరగడానికి అవకాశం ఉందన్నారు. దీనిని నివారించడానికి మునుపటి బ్యాలెట్ పత్రాల ఓటింగ్ విధానానికి వెళ్లడం, వీవీప్యాట్ ద్వారా వచ్చిన పేపరు స్లిప్‌ను ఓటరే బ్యాలెట్ బాక్సులో వేయడం, వీవీప్యాట్‌లోని స్లిప్ బాక్సులో పడే విధానం ఓటరుకు కనిపించేలా గాజు పరికరాన్ని ఏర్పాటు చేయడం వంటివి పరిశీలించాలని కోరారు. ఈవీఎంలో లెక్కించిన ఓట్లకు, వీవీప్యాట్‌ల ద్వారా లెక్కించిన స్లిప్‌లకు తేడా వస్తే స్లిప్‌లనే ప్రామాణికంగా తీసుకోవాలని.. స్లిప్‌లను లెక్కించడానికి ఒక్క రోజు సమయం పట్టినా పెద్ద నష్టమేమీ లేదని అన్నారు. ఇలాంటి కారణాల వల్లనే జర్మనీ, ఇతర ఐరోపా దేశాలు బ్యాలెట్ పేపర్లను వాడుతున్నాయని చెప్పారు. జస్టిస్ ఖన్నా స్పందిస్తూ గతంలో బ్యాలెట్ పేపర్ల ద్వారా కలిగిన సమస్యలను గుర్తు చేశారు. బూత్‌లను స్వాధీనం చేసుకోవడం వంటి సంఘటనలు జరిగాయని తెలిపారు. వాటిని మీరు మరిచిపోయారేమోగానీ తాము మరిచిపోలేదని అన్నారు. మానవ జోక్యం, పక్షపాతం వల్లనే సమస్యలు వస్తాయని, మానవ జోక్యం లేకపోతే యంత్రాలే కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని వ్యాఖ్యానించారు. జస్టిస్ దీపాంకర్ దత్తా మాట్లాడుతూ.. జర్మనీ జనాభా 6 కోట్లని, తన సొంత రాష్ట్రం బెంగాల్ జనాభా అంతకన్నా ఎక్కువని అన్నారు. "ఎవర్నో ఒకర్ని మనం నమ్మాలి. ఈ విధంగా వ్యవస్థను తక్కువ చేసి చూపొద్దు" అని వ్యాఖ్యానించారు. 'మానవ జోక్యం ఉంటేనే సమస్యలు వస్తాయి. లేకపోతే యంత్రమే సరైన ఫలితాన్ని చెబుతుంది" అని జస్టిస్ ఖన్నా అన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కఠిన శిక్షలు విధించేలా ప్రత్యేకంగా ఎలాంటి నిబంధనలు లేకపోవడం తీవ్రమైన విషయమని, శిక్షిస్తారన్న భయం ఉండాలి కదా అని వ్యాఖ్యానించారు. విచారణను గురువారానికి వాయిదా వేశారు.

అర్ధరాత్రి పోలీసుల జులుం

- తనిఖీల పేరుతో గోడలు దూకి టీడీపీ కార్యకర్త నివాసంలో హడావుడి
- గ్రామస్థులనూ భయభ్రాంతులకు గురిచేసిన వైనం
- ప్రశ్నించిన వారికి దురుసు సమాధానాలు
- నాలుగు గంటలపాటు సోదాలు... 3.44 లక్షలు స్వాధీనం
- తీసుకెళ్లిన సొమ్ముకు రశీదు ఇవ్వని వైనం
- ఎన్నికల్లో పంపిణీకేనంటూ బలవంతంగా సంతకాలు
- వైసీపీ నేత ఫిర్యాదుపై పోలీసుల ఓవరాక్షన్
- మండిపడుతున్న మేదరమెట్ల గ్రామ వాసులు

మేదరమెట్ల, ఏప్రిల్ 16: సోమవారం అర్ధరాత్రి పోలీసులు బాపట్ల జిల్లా మేదరమెట్ల గ్రామంలో ప్రజలను భయభ్రాంతులను చేశారు. ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 50 మందికిపై పోలీస్ సిబ్బంది, ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో గ్రామంలోని ఓ టీడీపీ కార్యకర్త ఇంటిని చుట్టుముట్టారు. గోడలు దూకి, తలుపులు బాదుతూ హంగామా సృష్టించారు. ఆ ఇంటికి 100 మీటర్ల వరకూ తమ అధీనంలోకి తీసుకున్నారు. ఎవరూ అటువైపు తొంగి చూడకుండా కట్టడి చేశారు. ప్రశ్నించిన వారికి పోలీస్ దురుసు సమాధానమే దిక్కయింది. ఇంటి యజమాని, సామాన్య టీడీపీ కార్యకర్త బోయపాటి శివశంకర్‌ను తమదైన పోలీసు భాషలో డబ్బులు ఎక్కడ దాచిపెట్టావో చెప్పు అంటూ బెదిరించారు. వారి భాషకు, పోలీస్ ప్రవర్తనకు వణికిపోతున్న మహిళలను ఓ మూల కూర్చోమంటూ కట్టడి చేశారు. ఇంట్లో అణువణువూ సోదా చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు మొదలైన హంగామా, తెల్లవారు ఝాము 4 గంటల వరకూ కొనసాగింది. మొత్తం కలిపి రూ.3,44,00 స్వాధీనం చేసుకున్నారు.

కుమార్తె బీటెక్ కోసం తెచ్చిన సొమ్మన్నా...

కుమార్తె బీటెక్ సీటు కోసం డబ్బులు సిద్ధంగా ఉంచినట్లు ఎంత చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. ఓటర్లకు పంచడానికి సొమ్ము తెచ్చినట్లు పంచనామా రాసివ్వాలంటూ శివశంకర్‌ను బెదిరించారు. సోమవారం తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.37 లక్షలు డ్రా చేశానని, స్థలం అమ్మగా రూ.2 లక్షలు బయానాగా ఇచ్చారని, అందుకు సంబంధించి అగ్రిమెంట్ కూడా ఉందని శివశంకర్ చెప్పారు. భార్య డ్వాక్రా గ్రూపు లీడర్ కావడంతో వాటికి సంబంధించిన డబ్బులు కూడా ఉన్నాయని తెలిపారు. పోలీసులు శంకర్ చెప్పే వివరణను వినడానికి సిద్ధపడలేదు. ముందుగానే నిర్ణయించుకుని వచ్చిన ప్రకారమే శంకర్‌ను బెదిరించారు. శంకర్ ససేమిరా అనడంతో 'మీ ఆవిడను, కూతురిని స్టేషన్‌కు తీసుకుపోతాం' అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. దీంతో చేసేది లేక శంకర్ సంతకం పెట్టారు. అనంతరం శంకర్ తనను కలసిన మీడియాతో మాట్లాడుతూ, ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారంతో తనను, తన భార్యా, పిల్లలను పోలీసులు భయభ్రాంతులకు గురిచేసి, నగదు స్వాధీనం చేసుకున్నారంటూ విలపించారు. కనీసం రసీదు కూడా ఇవ్వలేదని వాపోయారు. మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ దీనిపై స్పందిస్తూ... 'మాకు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించాం. ఆధారాలు లేని సొమ్మును స్వాధీనం చేసుకున్నాం. కేసు నమోదు చేశాం' అని తెలిపారు. కాగా, ఇది వైసీపీ వారి పన్నాగమేనని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. మేదరమెట్లలో కార్యకర్త ఇంట్లో పోలీసులు ఊహించినట్లుగా ఎమ్మెల్యే రవికుమార్ రూ.5 కోట్లు ఉంచుతారంటే ఎవరూ నమ్మరని చెప్పారు. గ్రామానికే చెందిన పెద్ద వైసీపీ నేత ఇచ్చిన సమాచారం మేరకు భారీ బలగాలతో సోదాలకు వచ్చారని అందరూ అనుమానిస్తున్నారు. మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువుకు, ఆసుపత్రి ఖర్చుల కోసం దాచుకున్న డబ్బులను పోలీసులు సోదాల పేరుతో ఎత్తుకెళ్లడం అన్యాయమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సోదాలపై పోలీసులు పత్రికలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

గులకరాళ్లు వేయండి.. అంతం చేయండి అంటున్న బాబు

- నాలుగేళ్లకు ఒకరు చొప్పున భార్యలను, నియోజకవర్గాలను మారుస్తున్న పవన్
- భీమవరం సిద్ధం సభలో జగన్ విసుర్లు
- ప్రసంగం మొదలైన పావుగంటకే జనం పరార్

భీమవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): "గులకరాళ్లు వేయండి.. అంతం చేయండి' అని టీడీపీ అధినేత చంద్రబాబు అంటున్నారు. కుట్రలు, మోసాలు, పొత్తులతో ఎన్నికలకు వస్తున్నారు" అని సీఎం జగన్ తన అక్కసు వెళ్లగక్కారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన 'మేం సిద్ధం' సభలో జగన్ మాట్లాడారు. "చంద్రబాబు రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తామన్నారు. అద్భుత నగరాన్ని నిర్మిస్తామన్నారు. చేశారా? పెళ్లికి ముందు పిల్లలు కనడం, ఆ తర్వాత పెళ్లి చేసుకోవడం. నాలుగేళ్లకు వదిలేయడం....ఇలా కార్లు మార్చినట్లుగా భార్యలను జనసేన అధినేత పవన్ కల్యాణ్ మారుస్తున్నారు. అదే మాదిరిగా నియోజకవర్గాలనూ మారుస్తున్నారు" అంటూ వ్యక్తిగత దూషణలకు దిగారు. ఐదేళ్లపాటు ప్రత్యేకహోదా ఊసెత్తని జగన్.. తెలుగుదేశం హయాంలో హోదా తెచ్చారా అని సభలో ప్రశ్నించారు. చంద్రబాబుకు ఓటేస్తే పథకాలు మునిగిపోతాయన్నారు. కాగా, సభకు జిల్లా నలుమూలల నుంచి జనాన్ని తరలించారు. అయితే, ఆయన ప్రసంగం మొదలైన పావుగంటకే జనం తిరుగుముఖం పట్టారు. సభా ప్రాంగణం 75 శాతం ఖాళీ అయింది. ఆర్టీసీ బస్సుల్లో జనాన్ని తరలించడంతో భీమవరంలో ట్రాఫిక్ స్తంభించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురంలో రాత్రి బస చేసిన జగన్ ఉదయం బస్సు యాత్ర కొనసాగించారు. భీమవరం సభ అనంతరం భీమవరం నుంచి గరగపర్రు- పిప్పర- రావిపాడు, తణుకు మండలం తేతలికి చేరుకుంది. మరోవైపు.. సభకు జనాన్ని తరలించేందుకు మొత్తం 939 బస్సులను వినియోగించారు. పెద్ద సంఖ్యలో ఆర్టీసీ సర్వీసులను రద్దు చేసి భీమవరం సభకు పంపించడంతో ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఓ వైపు శుభకార్యాలు ఉండడంతో బస్టాండ్‌లకు వచ్చి గంటల తరబడి నిరీక్షించారు. మరో వైపు ఎండ వేడి.. ప్రయాణం సాగక పిల్లలు, మహిళలకు చుక్కలు కనిపించాయి.



నిడమర్రులో ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్ర

ఆహా.. ఏం చెప్పారు?

- అందరూ సౌమ్యులే.. మనసున్న వారేనట!
- వైసీపీ అభ్యర్థులకు జగన్ పొగడ్తలు

'ఆయన విలువలున్న వ్యక్తి. ఈయన మనసేమో వెన్న, ఇంకొకాయన లోకల్ హీరో' అంటూ తమ పార్టీ అభ్యర్థులను జగన్ పరిచయం చేస్తుంటే వారి చరిత్ర తెలిసిన జనం విస్తుబోయారు. భీమవరం సభలో తన ప్రసంగం పూర్తయ్యాక నరసాపురం ఎంపీ అభ్యర్థిని, ఏడు అసెంబ్లీ అభ్యర్థులను సీఎం పరిచయం చేస్తూ పొగడ్తలతో ముంచెత్తారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను లోకల్ హీరో అంటూ ఆకాశానికి ఎత్తేశారు. కానీ, ప్రత్యర్థులను రాజకీయంగా అణగదొక్కడం.. ఆర్థిక మూలాలను దెబ్బ తీయడం.. ప్రతిపక్షాలపై దాడులకు ఉసిగొల్పడంతోపాటు, బెదిరింపులకు పాల్పడుతుంటారని శ్రీనివాస్‌పై ఆరోపణలున్నాయి. తాడేపల్లిగూడెం సిట్టింగ్ ఎమ్మెల్యే, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను మాట కటువుగా ఉన్నా.. మంచి వాడిగానూ, విలువలున్న వ్యక్తిగా జగన్ పరిచయం చేశారు. కానీ ఆయన నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ప్రతిపక్షాలకు ఇప్పుడవే అస్త్రాలయ్యాయి. తణుకు నియోజకవర్గానికి ప్రాతినిత్యం వహిస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మనసు వెన్న అంటూ జగన్ పొగిడారు. కానీ తన మాట వినని అధికారులపైనా, కార్యకర్తలపైనా ఒంటి కాలిపై మంత్రిలేస్తారంటూ తణుకులో నానుడి. ఉండి అభ్యర్థి పీవీఎల్ నరసింహ రాజును మంచి వ్యక్తిగా అభివర్ణించారు. నర్సాపురం అభ్యర్థి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు మంచి చేస్తాడు. నాకు మంచి స్నేహితుడు. మళ్లీ గెలిపిస్తే ఇంకా మంచి చేస్తాడంటూ జగన్ సభకు వివరించారు. ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు కూడా మంచివాడు, సౌమ్యుడని పొగడ్తలతో ముంచెత్తారు.

సలహాదారులకూ కోడ్ వర్తిస్తుంది: ఈసీ

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారులకు కూడా ఎన్నికల కోడ్ వర్తిస్తుందని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తేల్చిచెప్పింది. దీంతో.. రాష్ట్రంలో కార్యనిర్వాహక ఉత్తర్వులతో నియమితులై కేబినెట్ మంత్రి హోదాలో ఉంటూ ప్రభుత్వ ఖజానా నుంచి జీతభత్యాలు పొందుతున్న దాదాపు 40 మంది ప్రభుత్వ సలహాదారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తించనుంది. మంగళవారం ఈ మేరకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సహా పలువురు అడ్వయిజర్లు ప్రభుత్వ వేతనాలు తీసుకుంటూ పాలక పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని.. విలేకరుల సమావేశాలు పెట్టి విపక్షాలపై విమర్శలు చేస్తున్నారని.. పార్టీ ప్రచారం కూడా చేస్తున్నారని విపక్షాలు పలు సార్లు ఈసీకి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనావళిని (కోడ్) మరింత కఠినంగా అమలు చేయనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కొరడా ఝుళిపిస్తామని తెలిపింది. పౌరహక్కుల ఉల్లంఘనలకు సంబంధించి సీ-విజిల్, కమిషన్ వెబ్‌సైట్‌లకు దేశ వ్యాప్తంగా మొత్తం 2,68,080 ఫిర్యాదులొచ్చాయని, వీటిలో 2,67,762 కేసుల్లో చర్యలు తీసుకున్నట్టు పేర్కొంది.

'ఎలక్షన్ వాచ్' పునరుద్ధరణ

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతంలో కొంతకాలం అములులో ఉన్న ఎలక్షన్ వాచ్ మెకానిజాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సిటిజెన్స్ ఫర్ డెమొక్రసీ.. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ)ను సంప్రదించింది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల నిఘా యంత్రాంగాన్ని రూపొందించాలని ప్రతిపాదించింది. సీఎఫ్‌డీ నేతృత్వంలో ఎన్నికలను పరిశీలించడానికి ప్రజా జీవితంలోను, క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై స్పందించే ప్రముఖులను షార్ట్ లిస్ట్ చేసినట్లు సీఎఫ్‌డీ కార్యదర్శి, రాష్ట్ర మాజీ ఎన్నికల ప్రధాన అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తెలిపారు. జిల్లాల్లో ఎలక్షన్ వాచ్ ద్వారా విస్తృత స్థాయిలో సేకరించిన ఇన్‌పుట్‌ను జిల్లాల్లో ఎన్నికల అధికారులకు, ఏపీ సీఈవో, కేంద్ర ఎన్నికల కమిషన్ ద్వారా నియమితులైన పరిశీలకుల దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు మీడియాకు అందుబాటులో ఉంటుందని వివరించారు.

'మన్యం'లో 24 మంది వలంటీర్లపై ఎఫ్ఐఆర్

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 16: పార్వతీపురం మన్యం జిల్లాలో పలువురు వలంటీర్లపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పార్వతీపురం మండలం నర్సిపురం, పెద్ద బొండపల్లి గ్రామాలకు చెందిన 24మంది వలంటీర్లపై రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ నెల 14న వైసీపీ అభ్యర్థి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన ఇంటి వద్ద నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి పలువురు వలంటీర్లు వెళ్లినట్టు అధికారులకు ఫిర్యాదు అందడంతో 24 మంది వలంటీర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

మాచర్లలో ఎమ్మెల్యే అరాచకాలను అరికట్టండి: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలు మితిమీరిపోయాయని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తమ్ముడు వెంకటరామిరెడ్డిల దౌర్జన్యకాండ పెరిగిపోయిందన్నారు. మంగళవారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను కలసి ఫిర్యాదు చేశారు.

గులకరాయి డ్రామాతో బీసీ బిడ్డల్ని బలిస్తారా?: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ గులకరాయి డ్రామాకు బీసీ బిడ్డలను బలి చేయాలని చూస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. 'అధికారమే పరమావధిగా సాగుతున్న జగనాసుర రక్తచరిత్రలో తన, మన అనే తేడా లేదు. సానుభూతితో సీఎం సీటు దక్కించుకోవాలని బాబాయిని లేపేశాడు. అదే సమయంలో కోడికత్తి డ్రామాతో దళితులను వేధించాడు. తీవ్రమైన ప్రజావ్యతిరేకతలో ఓటమి ఖాయమై, గులకరాయి డ్రామాతో బీసీ బిడ్డలను బలి చేయాలని చూస్తున్నాడు. జగన్ 'నా..' అన్నాడంటే నాశనం చేసేస్తాడని అర్థం' అని 'ఎక్స్'లో లోకేశ్ హెచ్చరించారు.

జగన్ అధికార దాహానికి మరో అమాయకుడు బలి: వర్ల

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జగన్ అధికార దాహానికి మరో అమాయకుడు జైలుపాలు కాబోతున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'గతంలో చిన్న కోడి కత్తితో గుచ్చితే.. ఐదేళ్ల పాటు ఒక అమాయకుడిని జైల్లో పెట్టించిన ఘనత జగన్‌రెడ్డిది. ఇప్పుడు గులకరాయి డ్రామాలో విజయవాడ సీపీ రాణా ఒక అర్భకుడిని, అమాయకుడిని బలిచేయబోతున్నారు' అని వర్ల అన్నారు.

తోట త్రిమూర్తులును బహిష్కరించాలి: జవహర్

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపైన, అంబేడ్కర్ రాజ్యాంగంపైన సీఎం జగన్‌రెడ్డికి ఏ మాత్రం గౌరవం ఉన్నా.. శిరోముండనం కేసులో 18 నెలలు జైలు శిక్ష పడిన వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును జగన్‌రెడ్డి పార్టీ నుంచి వెంటనే బహిష్కరించాలని మాజీ మంత్రి కేఎస్ జవహర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. త్రిమూర్తులును కొనసాగిస్తే.. శిరోముండనాన్ని జగనే ప్రోత్సహిస్తున్నట్లవుతుందని, ఆయన్ని బహిష్కరిస్తే తప్ప దళితులు జగన్‌ను నమ్మరని అన్నారు.

అభ్యర్థుల కేసుల వివరాలు అందజేశాం

» పోలీసుల తరపున హైకోర్టుకు నివేదించిన ఎస్‌జీపీ

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పలువురు రాజకీయ నాయకుల(పిటిషనర్ల)పై నమోదైన కేసుల వివరాలను వారికి అందజేశామని పోలీసుల తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది మహేశ్వరరెడ్డి మంగళవారం హైకోర్టుకు నివేదించారు. కేసుల వివరాలు ఇవ్వాలని కోరుతూ టీడీపీ నేత వర్ల రామయ్య డీజీపీకి వినతిపత్రం అందజేశారని, ఈ నేపథ్యంలో సమాచారాన్ని వారికి అందజేశామని వివరించారు. పిటిషనర్ల తరపు న్యాయవాదులు సైతం.. వివరాలు అందాయని కోర్టుకు తెలిపారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయస్థానం వ్యాజ్యాలను పరిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో తమపై నమోదైన కేసుల వివరాలు అందజేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం.. కేసుల వివరాలిచ్చే అంశంలో డీజీపీ స్పందించకపోడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పిటిషనర్లపై నమోదైన కేసుల వివరాలు ఈనెల 16లోగా వారికి అందజేయాలని డీజీపీకి, పోలీసులకు మౌఖిక ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఇదే వ్యవహారంపై మాజీ ఎంపీ సుజనా చౌదరి, మాజీ మంత్రి పరిటాల సునీత, గంటా శ్రీనివాసరావు, గన్నవరం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. వీటిపై న్యాయస్థానం విచారణ జరిపింది. పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి వ్యాజ్యాలపై తదుపరి విచారణను ఈనెల19కి వాయిదా వేశారు.

డ్వాక్రాలను ప్రభావితం చేసే కార్యక్రమాలు వద్దు: మీనా

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ-డ్వాక్రా) సభ్యులను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి కార్యక్రమాలూ చేపట్టవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో పని చేసే సంబంధిత అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది ఎవరూ స్వయం సహాయక బృందాల సభ్యులను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి కార్యక్రమాలూ నిర్వహించకూడదని స్పష్టం చేశారు.

సేవా యాప్‌లో మార్పులు, చేర్పులు: పోలీసు శాఖ

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ఏపీ పోలీస్ సేవా యాప్‌లో మార్పులు, చేర్పులు చేస్తున్నందునే తాత్కాలికంగా ఆ యాప్ పనిచేయట్లేదని టెక్నికల్ సర్వీసెస్ ఐజీ కార్యాలయం మంగళవారం తెలిపింది. రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా యాప్ పనిచేయట్లేదంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తపై స్పందిస్తూ.. యాప్ ద్వారా అందే సేవలకు ఆటంకం కలగకుండా ఏపీ పోలీస్ సిటిజన్ వెబ్‌సైట్ అందుబాటులో ఉందని వివరించింది.

ఎల్లుండి పురందేశ్వరి నామినేషన్

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి (ఎన్డీయే)గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈనెల 19న నామినేషన్ దాఖలు చేయనున్నారు. తూర్పుగోదావరి కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం 1.30కు ఆమె నామినేషన్ దాఖలు చేస్తారని బీజేపీ రాష్ట్ర కార్యాలయం తెలిపింది. ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వస్తున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి. అలాగే, అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్‌కి రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ రానున్నారు.

రేపటి నుంచే నామినేషన్లు

» రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జారీ కానున్న నోటిఫికేషన్

» జిల్లా ఎన్నికల అధికారులు సిద్ధం కావాలి: సీఈవో మీనా

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు అసలైన ఘట్టం గురువారం (18న) ప్రారంభమవుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ జారీతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఆ రోజు మొదలు కానుంది. ఇది 25వ తేదీతో ముగుస్తుంది. 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఉపసంహరణకు చివరి తేదీ ఈ నెల 29. పోలింగ్ మే 13, ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతాయి. నోటిఫికేషన్ జారీతో ప్రారంభమయ్యే ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారులు అందరూ సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా నిర్వహించాలని.. రోజూ క్రమం తప్పకుండా తమకు నివేదికలను పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారమిక్కడ అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 18న నోటిఫికేషన్ జారీనుంచి నివేదికలను రోజూ కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ)కి పంపాల్సి ఉంటుందని, ఈ విషయంలో అలసత్వం వహించకుండా క్రమం తప్పకుండా నివేదికలు పంపాలన్నారు. ఓటర్ల గుర్తింపుకార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని.. కార్యాలయాల్లో గానీ, పోస్టాఫీసుల్లో గానీ పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. ఎపిక్ కార్డుల పంపిణీపై మే 4న ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తుందని, ఆలోపే పెండింగ్‌లో ఉన్న కార్డుల పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. సీ-విజిల్ ఫిర్యాదులను సంతృప్తికర స్థాయిలో డీఈవోలు అందరూ పరిష్కరిస్తున్నారని అభినందించారు. కౌంటింగ్ పరిశీలకుల నియామకంలో మార్గదర్శకాలు పాటించాలని, అదనంగా కావలసిన పరిశీలకులు, ఏఆర్‌వోల ప్రతిపాదనలు సాధ్యమైనంత త్వరగా తమకు పంపాలని ఆదేశించారు.



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంకే మీనా

ప్రచారం హోరు...

ఇప్పటికే రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తమ అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులను ప్రకటించేశాయి. పోటీకి అసలు సిసలైన ప్రక్రియ నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతున్నాయి. ఇందుకు అవసరమైన పత్రాలన్నిటినీ అభ్యర్థులు సిద్ధం చేసుకున్నారు.

నోటరీలతో జాగ్రత్త!

» ఆ అడ్వకేట్ల లైసెన్స్ కాలం ముగిసి ఉండొచ్చు!!

» రెన్యువల్ రాకముందే మళ్లీ నోటరీ చేస్తుండొచ్చు

» ఇలాంటివి సమర్పిస్తే చిక్కులే

» నామినేషన్లు తిరస్కరించే ప్రమాదం

అమరావతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల నామినేషన్ల కోలాహలం రేపటి నుంచి మొదలుకాబోతోంది. అభ్యర్థులంతా తమ పత్రాలు సిద్ధం చేసుకుంటారు. ఇందులో వారిపై ఆదాయం, ఆస్తులు, వారిపై ఉన్న కేసులు, వారి విద్యార్హతలు తదితర వివరాలు పేర్కొంటారు. వీటిని ధ్రువీకృత అడ్వకేట్‌తో నోటరీ చేయించి ఆ పత్రాలను నామినేషన్‌కు జతచేస్తారు. అభ్యర్థులు పేర్కొన్న వివరాలన్నిటినీ ఆ నోటరీ ధ్రువీకరిస్తారు. కానీ నోటరీతోనే అభ్యర్థులకు పెద్ద చిక్కొచ్చే ప్రమాదం ఉంది. చాలామంది నోటరీల లైసెన్సు గడువు ముగిసిపోయి ఉంటుంది. మరికొంతమంది రెన్యువల్ చేసుకోరు. ఇంకొందరు దరఖాస్తు చేసినా, అది రాకముందే నోటరీలు చేసేస్తుంటారు. ఇవన్నీ చెల్లవు. వీటిని ఇన్‌వ్యాలిడ్ నోటరీలుగా పరిగణిస్తారు. నంద్యాల ఉపఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి దాఖలు చేసిన నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్‌పై నోటరీ లైసెన్సు గడువు ముగిసిపోయిందని, స్టాంప్ వెండర్ లైసెన్సు రెన్యువల్ కాలేదని.. అందుచేత అవి చెల్లవని అప్పటి టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అభ్యంతరం చెప్పారు. అయితే అఫిడవిట్ లేకున్నా నామినేషన్ పత్రాలు ఆమోదం తెలుపవచ్చంటూ ఆనాటి రిటర్నింగ్ అధికారి, కర్నూలు జేసీ ప్రసన్న వెంకటేశ్ ఆమోదం తెలిపారు. ఈసీ ఆమోదంతో ఆమోదించినట్లు తెలిపారు. కానీ లైసెన్సు తీరిపోయిన నోటరీతో దాఖలు చేసిన నామినేషన్ పత్రాలు కొన్ని రాష్ట్రాల్లో తిరస్కరణకు గురయ్యాయి. దీనిపై ఇప్పటి వరకు ఈసీకి స్పష్టమైన విధానం లేదు. అందుకే రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి దీనిపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను సంప్రదించారు. లైసెన్సు ఉన్న నోటరీల జాబితా కావాలని కోరారు. ఈ వివరాలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఆ ప్రకారమే మంగళవారం వెబ్‌సైట్‌లో నోటరీ వివరాలు ఉంచారు. అభ్యర్థులు తమ పత్రాలు నోటరీ చేసిన వారి పేర్లు ఆ జాబితాలో ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని.. లేదంటే నామినేషన్ చెల్లుబాటులో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆయా పార్టీల నాయకత్వాలు తమ అభ్యర్థులకు సూచిస్తున్నాయి.

గులకరాయి కేసులో హైడ్రామా!

(మొదటి పేజీ తరువాయి)

ఒక బాలుడు సీఎంపై దాడిచేశాడని, మిగతా నలుగురూ అతడి పక్కనే ఉన్నారని పోలీసులు లీకులిస్తున్నారు. అధికారికంగా మాత్రం పెదవివిప్పడం లేదు. ఆ మైనర్ల తల్లిదండ్రులు మాత్రం తమ బిడ్డలకు ఏమీ తెలియదని, పోలీసులు అన్యాయంగా ఇరికిస్తున్నారని వాపోతున్నారు. ఇది మరో కోడికత్తి కేసు అవుతుందేమోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బలిపశువును చేస్తున్నారా?

జగన్‌పై ఈ నెల 13న గులకరాయి దాడి జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితుల అరెస్టుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వడ్డెర కాలనీ నుంచి సోమవారం అర్ధరాత్రి కొంతమందిని, మంగళవారం తెల్లవారుజామున ఇంకొందరిని.. మొత్తం 11 మందిని బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. విచారణ అనంతరం వారిలో ఆరుగురిని ఇళ్లకు పంపేశారు. మిగిలిన ఐదుగురూ వారి అదుపులోనే ఉన్నారు. పోలీసులు ఏదో ఒక రకంగా కేసును ఛేదించామని చెప్పుకొనేందుకే తమ బిడ్డలపై నెపం మోపుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలన్నీ చూస్తుంటే ఆ ఐదుగురు మైనర్లలో ఒకరిని బలిపశువును చేయబోతున్నారా అన్న సందేహం కలుగుతోంది. వారి తండ్రులు కూలీ పనులకు వెళ్తుంటారు. తల్లులు విజయవాడ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తుంటారు. పిల్లలు కూడా రోజూ ఏదో ఒక పనికి వెళ్తుంటారు. పనుల నుంచి వచ్చిన తర్వాత ఇంటి నుంచి కదలరని.. అలాంటి వారిపై దాడి అభియోగం మోపుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. సోమవారం రాత్రి పిల్లలను తీసుకెళ్లిన పోలీసులు.. మరుసటి రోజు ఉదయం వచ్చి ఐదుగురి కుటుంబాల నుంచి ఒక్కో జత బట్టలు తీసుకెళ్లారు. అదుపులో ఉన్నవారిలో ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఉన్నారు. బాలుర తల్లిదండ్రులు చెప్పిన వివరాల ప్రకారం.. జగన్ బస్సుయాత్రతో వచ్చినప్పుడు.. రోడ్డుకు రెండు వైపులా నిలబడి జెండాలు ఊపితే ఒక్కొక్కరికీ రూ.200 చొప్పున ఇస్తామని స్థానిక వైసీపీ నేతలు వడ్డెర కాలనీ వాసులతో బేరం మాట్లాడుకున్నారు. మహిళలకు రూ.200.. పురుషులకు, యువకులకు రూ.200తోపాటు క్వార్టర్ మందు బాటిల్ ఇస్తామని హామీ ఇచ్చారు. డాబా కొట్లు సెంటర్ నుంచి వడ్డెర కాలనీ ఆర్చ్ ప్రాంతం వరకు వారిని నిలబడమన్నారు. 'పురుషులకు, యువకులకు క్వార్టర్ బాటిల్ ఇచ్చారు. డబ్బులు మాత్రం ఇవ్వలేదు. డబ్బులొస్తాయన్న ఉద్దేశంతో మాతోపాటు మా పిల్లలనూ తీసుకెళ్లాం. కానీ మేం గానీ, మా పిల్లలు గానీ కాలనీ వద్ద ఉన్న ఆర్చ్ దాటి ముందుకు వెళ్లలేదు' అని బాలుర తల్లులు స్పష్టం చేస్తున్నారు. వివేకానంద స్కూల్ వరకు జగన్ వెళ్లినప్పుడు ఎంతోమంది జనం ఉన్నారని, అంతమందిలో తమ పిల్లలే దాడి చేశారని ఎలా గుర్తించారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. 'కేసును బ్రేక్ చేశాం' అని మాత్రమే ముక్తసరిగా జవాబిస్తున్నారు. ఐదుగురిలో ఒక అబ్బాయి దాడి చేయగా, మిగిలినవారు పక్కన ఉన్నారని వారు చెప్పారంటూ మైనర్ల తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. జెండాలు పట్టుకుంటే డబ్బులు ఇస్తామని చెప్పిన వైసీపీ నేతలు.. తమ పిల్లలను పోలీసులు తీసుకెళ్తే ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీస్తున్నారు. తమ పిల్లలను విడుదల చేయాలని మధ్యాహ్నం నుంచి కాలనీవాసులు రోడ్డెక్కారు. డాబా కొట్లు సెంటర్ నుంచి మాకినేని బసవపున్నయ్య స్టేడియంకు వెళ్లే రహదారిపై సుమారు 20 నిమిషాల పాటు నిరసన తెలిపారు. రోడ్డుకు అడ్డంగా క్రాస్ పాయింట్ కేబిన్‌లను పెట్టి ధర్నా చేశారు. పోలీసులు వచ్చి ఎన్నికల కోడ్ ఉందని, కేసులు పెడతామని బెదిరించడంతో ఆందోళన విరమించారు.



విజయవాడలో ఆందోళన చేస్తున్న వడ్డెర కాలనీ వాసులు

సొల్యూషన్ తాగుతున్నారని చెప్పారు

పోలీసులు సోమవారం రాత్రి మా ఇంటికొచ్చారు. మా అబ్బాయిని తీసుకెళ్తామని చెప్పారు. ఎందుకని ప్రశ్నిస్తే.. మత్తు కలిగించే సొల్యూషన్ తాగుతున్నారని, విచారణ చేసి పంపేస్తామన్నారు. మీ పిల్లాడికి ఏమీకాదని చెప్పారు. రెండుసార్లు వెళ్లినా, స్టేషన్‌లో మా అబ్బాయి లేడు. మీ అబ్బాయి జగన్‌పై రాయితో దాడి చేశారని చెబుతున్నారు. మరో కోడికత్తి కేసుగా మార్చేస్తారని భయంగా ఉంది.

- వేముల వెంకటరమణ, దాడి చేశాడని చెబుతున్న బాలుడి తల్లి

మేమే తీసుకొచ్చి వదిలేస్తామన్నారు

మంగళవారం తెల్లవారుజామున పోలీసులు ఇంటికొచ్చారు. మీ పిల్లలు సొల్యూషన్స్ తీసుకుంటున్నారని.. రోజుకు ఇద్దరిని తీసుకెళ్తున్నామని చెప్పారు. విచారణ చేసి గంటలో పంపించేస్తామన్నారు. ఇప్పుడు జగన్‌పై ఒక అబ్బాయి రాయి విసిరితే, అతడి పక్కన మిగిలినవాళ్లు ఉన్నారని అంటున్నారు. జగన్ సింగ్‌నగర్ వచ్చినప్పుడు మా అబ్బాయి నా దగ్గరే ఉన్నాడు. మా పిల్లలు కాలనీ ఆర్చ్ దగ్గరే ఆగిపోయారు. జగన్‌పై దాడి జరిగిన ప్రదేశానికి వెళ్లలేదు.

- వేముల భవాని (మరో బాలుడి తల్లి)

జగన్.. ఇక నీ ఆటలు సాగవు

» వైసీపీ హయాంలో దళితులు, మైనార్టీలపై దాడులు

» 12 లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. ఖర్చుపెట్టింది 2.5 లక్షల కోట్లు

» మిగిలిన సొమ్మంతా ఏమైంది..? ప్రచారానికి 1600 కోట్లా..?

» ఎమ్మిగనూరు స్వర్ణాంధ్ర సాకార యాత్రలో బాలకృష్ణ

కర్నూలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): "వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విధ్వంస పాలన సాగుతోంది. టీడీపీ ప్రభుత్వంలో నవ్యాంధ్ర ప్రపంచపటంలోకి ఎక్కితే.. నేడు ఆ పేరు లేకుండా పోయింది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. జగన్.. ఇక నీ ఆటలు సాగవు" అని సినీ హీరో, హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా మంగళవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఆయన పర్యటించారు. బాలయ్య రోడ్‌షోలకు జనం పోటెత్తారు. ఎమ్మిగనూరు, కోసిగిలో జరిగిన రోడ్‌షోలో బాలకృష్ణ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ విధానాలు, సీఎం జగన్ సాగిస్తున్న అకృత్యాలపై విమర్శలు గుప్పించారు. అదేక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం ఎన్టీఆర్, చంద్రబాబు ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. రాయలసీమలో సాగునీరు ఇచ్చింది ఎన్టీఆర్, చంద్రబాబులేనని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత రూ.6వేల కోట్ల అప్పుతో ఏర్పడిన రాష్ట్రాన్ని చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని చెప్పారు. జగన్ ఒక్క చాన్స్ అని వేడుకుంటే ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారని, కానీ, ఆయన అందర్నీ నిలువునా ముంచారని అన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపించినందున.. ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలన్నారు. అభివృద్ధి కావాలో..? అరాచకం కావాలో..? కూల్చేవాళ్లు కావాలో.. నిర్మించే వాళ్లు కావాలో..? స్వర్ణయుగం కావాలో.. చీకటి రాజ్యం కావాలో..? ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రూ.12 లక్షల కోట్లు అప్పుచేసిన జగన్.. నవరత్నాలకు చేసిన ఖర్చు రూ.2.50 లక్షల కోట్లేనని, మిగిలిన సొమ్మంతా ఏం చేశారని ప్రశ్నించారు. ప్రచార హోర్డింగ్‌ల కోసం రూ.1600 కోట్లు ఎవడబ్బ సొమ్మని ఖర్చు చేశామని నిలదీశారు. సీపీఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులను మోసం చేసిన జగన్‌కు బుద్ది చెప్పాల్సిన సమయం ఇదేనన్నారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు.



ఎమ్మిగనూరులో స్వర్ణాంధ్ర సాకార సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న బాలకృష్ణ

టీడీపీలో చేరిన ఎమ్మెల్యే ఎర్రకోట కుటుంబ సభ్యులు

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వైసీపీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కుటుంబ సభ్యులు బాలకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ఎర్రకోట స్వయాన సోదరుల కుమారులు కె.విరూపాక్షిరెడ్డి, కె. బాలకృష్ణారెడ్డి, కె. చెన్నారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాళ్లదొడ్డి కె.చెన్నారెడ్డి టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. బాలకృష్ణ వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు, మంత్రాలయం టీడీపీ అభ్యర్థులు బీవీ జయనాగేశ్వరరెడ్డి, మాధవరం ఎన్. రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనకే గాజుగ్లాసు గుర్తు

» హైకోర్టులో పవన్ పార్టీకి భారీ ఊరట

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి హైకోర్టులో భారీ ఊరట లభించింది. జనసేనకు కేంద్ర ఎన్నికల సంఘం గాజుగ్లాసు గుర్తు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. గుర్తు కేటాయింపు విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలు పాటించలేదన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జనసేనకు గుర్తు కేటాయించామని కేంద్ర ఎన్నికల సంఘం సమర్పించిన వివరాలతో ఏకీభవిస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మంగళవారం తీర్పు ఇచ్చారు. జనసేన పార్టీకి గాజుగ్లాసు గుర్తు కేటాయించడంతో పాటు అందుకు సంబంధించిన రికార్డును కోర్టు ముందు ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యులర్) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజమహేంద్రవరానికి చెందిన మేడా శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.వి. రాజారామ్ వాదనలు వినిపించారు. గాజుగ్లాసు గుర్తు కోసం పిటిషనర్ పార్టీ గతేడాది డిసెంబరు 20న దరఖాస్తు చేసుకుందని తెలిపారు. డిసెంబరు 12న జనసేన పార్టీ చేసిన దరఖాస్తు నిబంధనలకు అనుగుణంగా లేదన్నారు. జనసేన పార్టీ తరఫున సీనియర్ న్యాయవాది వేణుగోపాలరావు వాదనలు వినిపిస్తూ... గాజుగ్లాసు గుర్తు కోసం జనసేన గత డిసెంబరు 12న దరఖాస్తు చేసిందన్నారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. గాజుగ్లాసు గుర్తు కోసం మొదట జనసేన పార్టీయే దరఖాస్తు చేసుకుందని, ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో ఆ పార్టీకే ఆ గుర్తు కేటాయించామన్నారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో ఏప్రిల్ 4న తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేస్తూ మంగళవారం నిర్ణయాన్ని వెల్లడించారు.

అంబటి, కొడాలి, పేర్ని, రోజా ఐటెంగాళ్లు

» ద్వారంపూడి దుర్మార్గుడు, గూండా, మాఫియా డాన్

» వైసీపీ నేతలపై విరుచుకుపడ్డ జనసేన నేత నాగబాబు

గొల్లప్రోలు, కొత్తపల్లి, ఏప్రిల్ 16: 'నోటికి వచ్చినట్లు నిత్యం బూతులు మాట్లాడే వైసీపీ నేతలు ఉన్నారు. అంబటి రాంబాబు, కొడాలి నాని, పేర్ని నాని, రోజా ఇలాంటి గ్రూపు ఉంది. వీరంతా ఐటెం గాళ్లు. పక్కనే ఉన్న కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి... దుర్మార్గుడు, గూండా, మాఫియా డాన్' అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు మండిపడ్డారు. ఇలాంటి వారందరికి ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన ఎన్నికల కార్యాలయాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజులతో కలసి ఆయన మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. 'ద్వారంపూడి లాంటివారు చంద్రబాబును, ఆయన కుటుంబ సభ్యులను, ఇంట్లో ఆడవారిని అవమానించినప్పుడు తెలుగు తమ్ముళ్లకు ఎలా ఉందో గాని మా గుండె తరుక్కుపోయింది. చంద్రబాబు కన్నీరు పెట్టుకుంటే తట్టుకోలేకపోయాం. ఇసుక దందాకు అడ్డువస్తే జర్నలిస్టులను తొక్కి చంపించమని చెప్పిన దుర్మార్గుడు ద్వారంపూడి' అని మండిపడ్డారు. పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి సురక్ష ఫంక్షన్ హాల్లో ఉప్పాడ-కొత్తపల్లి మండల చేనేత సంఘాల ఆత్మీయ సమావేశంలో నాగబాబు మాట్లాడారు. చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న నేతన్నల ఆశయాలు నెరవేర్చేందుకు పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని చెప్పారు. దేశంలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జగన్ పాలనలో

రాష్ట్రాభివృద్ధి గుండు సున్నా..!

» ఆయన ఇచ్చిన హామీలకు ఎక్కడా దిక్కులేదు

» సంజీవని లాంటి ప్రత్యేక హోదా ఊసే లేదు

» కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పదేళ్లు ప్రత్యేక హోదా

» ఎవరు డబ్బులిచ్చినా తీసుకోండి.. కాంగ్రెస్‌కే ఓటేయండి: షర్మిల

అన్నమయ్య జిల్లా పీలేరు రోడ్‌షోలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



రాయచోటి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో రాష్ట్రానికి కనీసం రాజధాని కూడా లేదని, రాష్ట్రాభివృద్ధి గుండా సున్నా అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీ డబ్బులిచ్చినా తీసుకుని.. ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని ఆమె ప్రజలను కోరారు. ఏపీ న్యాయయాత్ర పేరుతో మంగళవారం ఆమె అన్నమయ్య జిల్లాలోని పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో బస్సుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలలో షర్మిల మాట్లాడుతూ.. ప్రతిపక్ష హోదాలో రాష్ట్రమంతా పర్యటించిన జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలిచ్చారని, అయితే అవేమీ ఎక్కడా అమలుకాలేదని అన్నారు. 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి.. ప్రత్యేక హోదా తెస్తామన్నారని, 23 మంది ఎంపీలను ఇచ్చినా.. ప్రత్యేక హోదా ఊసేలేకుండా చేశారని విమర్శించారు. సంజీవని లాంటి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే రాష్ట్రంలో వేల సంఖ్యలో పరిశ్రమలు వచ్చి.. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభించేదన్నారు. తాము అధికారంలోకొస్తే.. 2.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి.. రాష్ట్రంలోని నిరుద్యోగులను జగన్ మోసం చేశారన్నారు. నాలుగున్నరేళ్లు కుంభకర్ణుడిలా నిద్రపోయి.. ఆరు నెలల ముందు నిద్రలేచి సిద్ధం అంటూ బయలు దేరారన్నారు. సిద్ధమా అని దేనికి అడుగుతున్నారో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు బీజేపీతో బహిరంగంగా పొత్తు పెట్టుకుంటే.. జగన్ రహస్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని అన్నారు. ప్రతి పేద మహిళకూ ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని, మహిళల పేరు మీద రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. 2.25 లక్షల ఉద్యోగాల భర్తీ మీదే తొలి సంతకం చేస్తామన్నారు. జగన్.. పండుగలాంటి వ్యవసాయాన్ని దండగ చేశారని, ఆయన పాలనలో అప్పు లేని రైతు లేడని విమర్శించారు. వైఎస్ హయాంలో రేషన్ షాపుల్లో 11 రకాల వస్తువులు ఇచ్చేవాళ్లు, ఇప్పుడు బియ్యం తప్ప మిగిలినవేమీ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో అన్ని వస్తువుల ధరలూ పెంచి.. ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో గుంజుకుంటున్నారని విమర్శించారు. మదనపల్లె, పీలేరు, తంబళ్ళపల్లె నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరఫున ఎన్నికల బరిలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు.

జగన్‌కు ఏమని చెప్పావ్ అవినాశ్?



- వివేకాది గుండెపోటు అని చెప్పావా?
- హత్యకు గురయ్యారని చెప్పావా?
- గుండెపోటు అంటే అక్కడి దృశ్యంతో జగన్‌కు విషయం తెలిసిపోవాలి కదా!
- వివేకా కుమార్తె వైఎస్ సునీత వ్యాఖ్యలు

కడప, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): "మీ ఫోన్ తీసుకెళ్లి సీబీఐకి ఇవ్వండి. కడిగిన ముత్యంలా బయటకు వస్తారు కదా. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత తన ఫోన్లను దర్యాప్తు సంస్థకు అప్పగించారు. మీ ఫోన్ ఇచ్చేదానికి ఏమైంది?" అని మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని వైఎస్ సునీత ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం ఆమె కడపలో మీడియా సమావేశంలో మాట్లాడారు. " జగన్‌కు అవినాశ్ ఏమని చెప్పాడు? గుండెపోటుతో వివేకానందరెడ్డి చనిపోయారని చెబితే.. అక్కడి దృశ్యం చూడగానే జగన్‌కు అసలు అక్కడ ఏవి ఎ జరిగిందో తెలిసి ఉండాలి. ఒకవేళ హత్య అని చెబితే వెంటనే అయన డీజీపీని ఎందుకు అప్రమత్తం చేయలేదు" అని సునీత ప్రశ్నించారు. తనకు ఈర్ష్య అంటున్నారని, అవినాశ్‌రెడ్డితో పెద్ద పరిచయం లేని తనకు ఆయనపై ఎందుకు ఈర్ష్య ఉంటుందని ఆమె ప్రశ్నించారు. " నేను 2008లో అమెరికా నుంచి వచ్చాను. ఇక్కడ స్పెషలిస్టుగా పనిచేస్తున్నాను. నాకు రాజకీయ ఆసక్తులు లేవు. అలాంటప్పుడు ఈర్ష్య ఎందుకు ఉంటుంది? పులివెందులలోని రాజారెడ్డి స్ట్రీట్‌లో ఉన్నప్పుడు.. చుట్టపుచూపుగా అవినాశ్‌రెడ్డి ఇంటికి వెళ్లేదాణ్ణి. ఇప్పుడు వారి ఇల్లు ఎక్కడ ఉందో కూడా నాకు తెలియదు. వివేకా హత్య ఘటన తర్వాత ఆయన ఇంటికి ఒక్కసారి వెళ్లాను. అవినాశ్ అంత పరిచయం లేదుగానీ ఆయన చెల్లెలితో పరిచయం ఉంది. అమెరికాలో ఉన్నప్పుడు వారి ఇంటికి వెళ్లేవాళ్లం. కానీ, పెద్ద పరిచయం లేని అవినాశ్ అంటే నాకు ద్వేషం ఎందుకు ఉంటుంది? అధికారానికి దూరంగా ఉండాలనుకన్నా. కానీ, ఇక్కడకు రావాల్సి వచ్చింది"

ఒత్తిళ్లు లేకపోతే హెడ్ కానిస్టేబుల్ సరిపోతాడు..

"వైఎస్ వివేకా హత్య కేసు రాజకీయంగా వెళ్లకుండా ఉంటే ఒక హెడ్‌కానిస్టేబుల్ సాల్వ్ చేసే కేసు. అన్నీ ఆధారాలు ఉన్నాయి. ఐదేళ్లు కావస్తున్నా రాజకీయనేతల వల్ల ఇప్పటికి పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంకా ఎంతకాలం సాగుతుందో తెలియదు కానీ సాగుతూనే ఉంది. అప్రూవర్ స్టేటస్ అనేది చట్టంలో ఒక ప్రాసెస్. కానీ నేను అడిగేది న్యాయం. అప్రూవర్ స్టేటస్ అన్నది కోర్టుకు, సీబీఐకి, అప్రూవర్‌కి మధ్యన ఉండేది. అప్రూవర్ అయినంత మాత్రాన ఆయన నిర్దోషి కాదు. అప్రూవర్‌గా ఆయన చెప్పేది జడ్జి కన్విన్స్ అయితే ఉంటారు.. లేకపోతే మిగిలిన నిందితుల మాదిరిగా జైలుకు వెళ్తారు. అప్రూవర్ తప్పించుకుంటారన్నది ఏదీ లేదు. అప్పటివరకు కోర్టు గురించి తెలియదు. రంగన్న స్టేట్‌మెంట్ తర్వాత దర్యాప్తు ఆలస్యం అవుతూ వచ్చిందని అవినాశ్ అన్నారు. నేను కూడా అదే కదా అడుగుతున్నా.. ఎందుకు ఇన్నేళ్లయినా జాప్యం అయింది? అందువల్లే దయచేసి రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలని కోరుతున్నాం"

ఎవరితో మాట్లాడినా రాజకీయమేనా?

"ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణ సతీమణి చనిపోతే ఆయన నేను ఇంటికి వెళ్లానని చెబుతున్నారు. అవును.. ఆమె నా పేషెంట్ కాబట్టే వెళ్లాను. సజ్జల రామకృష్ణారెడ్డి వాళ్ల అన్న కూడా చనిపోయారు.. అదేవిధంగా వాళ్ల ఇంటికి వెళ్లాను అది ఆయనకు గుర్తుకు రాలేదు. డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చనిపోయినపుడు భారతిని కూడా కలిశాను.. అది గుర్తుకు రాలేదా? ఇది మానవత్వానికి సంబంధించింది"

ఒక్కనాడైనా పరామర్శించారా?

"వైఎస్ వివేకా తమ కోసం చాలా కృషిచేశారని అవినాశ్‌రెడ్డి అన్నారు. వివేకా అంత దారుణంగా హత్యకు గురైతే ఆయన సంగతి, ఆయన కుటుంబం పరిస్థితి ఏమిటని ఎప్పుడైనా అడిగారా? పోలీసుల వద్దకెళ్లి కేసు గురించి ఆరాతీశారా? ఢిల్లీకి అన్నిసార్లు వెళుతుంటారు కదా.. ఒక్కసారైనా సీబీఐ ఆఫీసుకు పోయి కేసు గురించి మాట్లాడారా? ఆయన గురించి ఒక్కరోజు అయినా మంచిగా జగన్ పత్రికలో రాశారా? గూగుల్ టేకౌట్ ఫ్యాబ్రికేటెడ్ అంటారు.. ఈ గూగుల్ టేకౌట్‌ను సీబీఐ కాకుండా, సీఎఫ్ఎస్ఎల్, సర్వే ఆఫ్ ఇండియా అందరు కలిపి తయారు చేసిన రిపోర్టు అన్నారు. అంటే వీళ్లందరు ఫ్యాబ్రికేటెడా? 1000మీటర్లు ఉన్నా కూడా గూగుల్ టేకౌట్ స్పష్టంగా చెబుతుంది. వాట్సప్‌లో కాల్స్ ఉన్నట్లు తేల్చింది.

జగన్‌కు ఏమని చెప్పారు?

"వివేకా చనిపోయిన రోజు.. అవినాశ్‌కు శివప్రకాశ్‌రెడ్డి నుంచి ఫోన్ పోయింది 6 గంటల 26 నిమిషాల 15 సెకండ్లకు. ఫోన్ కాల్ డ్యురేషన్ 24 సెకండ్లు. అవినాశ్‌రెడ్డితో పాటు కొంతమంది మనుషులు ఉన్నారంటున్నారు.. వాళ్లలో ఒకరు గజ్జల ఉదయకుమార్‌రెడ్డి ఏ-6. గూగుల్ టేకౌట్ ప్రకారం అవినాశ్‌రెడ్డి ఇంట్లో గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి 6 గంటల 25 నిమిషాల 25సెకండ్లకు ఉన్నాడని ఇది చార్జిషీట్‌లో ఉంది. మళ్లీ 6గంటల 27నిమిషాల 28 సెకండ్లకు వివేకానందరెడ్డి ఇంటి వద్ద ఉన్నాడు. ఈ సమయాన్ని బట్టి చూస్తే అందరూ ఒకే చోట ఉన్నారు. అవినాశ్ ఎక్కడో దారిలో ఉంటే వివేకా ఇంటికి 47 సెకండ్లలో ఎలా చేరుకున్నాడు? ఇది గూగుల్ టేకౌట్, సీడీఆర్ కంబైన్డ్ డేటా. ఇది చార్జిషీట్‌లో ఉంది. 6.30గంటల ప్రాంతంలో వివేకా ఇంటికి చేరుకున్నాడు. అక్కడి దృశ్యం చూశాడు. అయితే, బయటకు వచ్చి ఏం చెప్పాడు? నవీన్‌కి ఫోన్ చేశాడు. ఓఎస్డీ కృష్ణమోహన్‌కు ఫోన్ చేసి చెప్పాడు.. వాళ్ల ద్వారా జగన్‌కు సమాచారం అందించామని చెప్పాడు. జగన్‌కు వివేకాది గుండెపోటు అని చెప్పారా? లేక హత్య అని చెప్పారా? ఏమని చెప్పారు. గుండెపోటు అని చెబితే.. అక్కడి దృశ్యం చూడగానే జగన్‌కు అసలు ఏమి జరిగిందో తెలిసి ఉండాలి. ఒకవేళ హత్య అని చెబితే వెంటనే ఆయన డీజీపీని ఎందుకు అప్రమత్తం చేయలేదు"

వివేకా చివరి కోరిక ఒక్కటే...

"వివేకాకు ఆస్తుల సమస్య లేదు. ఆయన ఆఖరి కోరిక షర్మిలను ఎంపీగా చేయడమే. హత్య విషయంలో నాకంటే ముందే పులివెందుల ప్రజలందరికీ తెలుసు. కానీ, అవినాశ్‌రెడ్డి ఏమీ తెలియనట్లు ఉంటారు. ఆయన వెనుక ఇంత కుట్ర ఉంటుందని నాకు తెలియదు. ప్రజలు కూడా తెలుసుకుంటారు"

బాబు చేతిలో పావులుగా సునీత, షర్మిల

- సీబీఐ, దస్తగిరి, సునీత మధ్య చీకటి డీల్
- మూడేళ్లుగా వ్యక్తిత్వ హననం: అవినాశ్



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 16: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేతిలో పావులుగా సునీత, షర్మిల పనిచేస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ, దస్తగిరి, వైఎస్ సునీత మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని, మూడేళ్లుగా వ్యక్తిత్వ హననం చేస్తున్నారని అన్నారు. మంగళవారం కడపలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాక్షిగా ఉన్న వాచ్‌మన్ రంగన్న పేర్కొన్న నలుగురిని అరెస్టు చేసి సమాచారం రాబట్టాల్సి ఉండగా, నెలరోజుల పాటు ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేదన్నారు. దస్తగిరి హత్య చేశానని ఒప్పుకొన్నా అరెస్టు చేయకుండా ఇంటికి పంపారనీ, అతడు యాంటిసిపేటరీ బెయిల్ అడిగితే, సునీత అభ్యంతరం చెప్పలేదన్నారు. వివేకా సొంత బామ్మర్ది శివప్రకాశ్ చెబితేనే తాను ఆయన ఇంటికి వెళ్లానన్నారు. ఆ తరువాతే తాను సమాచారం ఇచ్చానని చెప్పారు.

టీడీపీ కూటమికి 20 ఎంపీ సీట్లు!

- వైసీపీకి ఐదే.. ఏబీపీ-సీవోటర్ సర్వే వెల్లడి

అమరావతి/న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమికి ఘన విజయం తథ్యమని మరో సర్వే వెల్లడించింది. ఈ కూటమి 20 ఎంపీ సీట్లను గెలుచుకోబోతోందని తెలిపింది. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 10 మధ్య లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో 'ఏబీపీ' జాతీయ టీవీ చానల్.. సీ-వోటర్ సంస్థతో కలిసి ఈ సర్వే చేపట్టింది. ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ కూటమికి ఇరవై లభిస్తాయని, ఇందులో బీజేపీ ఐదు స్థానాల్లో గెలుస్తుందని.. టీడీపీ-జనసేన 15 స్థానాలను కైవసం చేసుకుంటాయని తెలిపింది. అధికార వైసీపీ ఐదు సీట్లతో సరిపెట్టుకోవలసి ఉంటుందని పేర్కొంది. కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా లభించే అవకాశం లేదని వ్యాఖ్యానించింది. టీడీపీ కూటమికి 46.7 శాతం ఓట్లు, వైసీపీకి 39.9 శాతం ఓట్లు, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమికి 2 శాతం ఓట్లు లభిస్తాయని తెలిపింది. కూటమికి, వైసీపీకి మధ్య 5.8 శాతం ఓట్ల తేడా ఉంటుందని అంచనా వేసింది. గత ఎన్నికల్లో వైసీపీకి 22 ఎంపీ సీట్లు లభించాయని.. దానితో పోలిస్తే ఈసారి ఆ పార్టీకి లభించే సీట్లు (5) నాలుగో వంతుకు లోపేనని సర్వే పేర్కొంది. ఎన్నికల ముంగిట ఆంధ్రప్రదేశ్‌లో రెండు కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయని తెలిపింది. వీటిలో ఒకటి.. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సొంత చెల్లెలు వైఎస్ షర్మిల తన సొంత పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి పీసీసీ అధ్యక్షురాలిగా రంగంలోకి రావడం. రెండోది.. మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అరెస్టు చేసి 53 రోజులపాటు జైల్లో ఉంచడమని ఈ సర్వే అభిప్రాయపడింది.

నా సస్పెన్షన్ చెల్లదు!

- క్యాట్‌లో ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు వాదనలు
- సాక్షులను ఆయన ప్రభావితం చేశారనడానికి ఆధారాలేవీ?
- రాష్ట్రప్రభుత్వానికి క్యాట్ ప్రశ్న.. 23న తీర్పు




హైదరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తన సస్పెన్షన్ చట్ట విరుద్ధమని ఒకసారి సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత మళ్లీ అవే ఆరోపణలతో రెండోసారి కూడా తనను సస్పెండ్ చేశారని ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ) పేర్కొన్నారు. రెండోసారి తనను సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైదరాబాద్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్)లో ఆయన సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. ఏబీవీ తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. అఖిలభారత అధికారుల సర్వీస్ రూల్స్‌లో పేర్కొన్న ప్రకారం ఒక అధికారిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎప్పటికప్పుడు అధికారుల కమిటీ రివ్యూ చేయాలని తెలిపారు. అయితే, అంశంపై లీగల్ పొజిషన్‌ను వెల్లడించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సర్వీస్ రూల్స్ ప్రకారం సమీక్షించలేదు కాబట్టి సదరు సస్పెన్షన్ చెల్లదని తెలిపారు. సస్పెన్షన్‌ను ఏకపక్షంగా కొనసాగించడానికి వీల్లేదన్నారు. ఏపీ ప్రభుత్వం సమర్పించిన కేసు ఫైల్‌ను పరిశీలించిన క్యాట్.. పిటిషనర్ సాక్షులను బెదిరించారన్న ఆరోపణలకు ఆధారం ఎక్కడ ఉందని ప్రశ్నించింది. దీనికి ప్రభుత్వ న్యాయవాది ఎలాంటి సమాధానం చెప్పలేదు. వాదనలు ముగియడంతో తీర్పును ఈ నెల 23న వెలువరించనున్నట్లు క్యాట్ పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 17 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్



హైదరాబాద్‌లోని దక్కన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(డీఎస్ఎం-ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాల)- మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో 42 సీట్లను ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా, మిగిలిన 18 సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తుంది. దరఖాస్తుతోపాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల పత్రాలను జత చేయాలి.

ప్రోగ్రామ్ వివరాలు: కోర్సులో భాగంగా క్లాస్ రూమ్ లెక్చర్స్, ఆన్‌లైన్ లెక్చర్స్, గెస్ట్ లెక్చర్స్, హాస్పిటల్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్న్‌షిప్, డిజర్టేషన్ వర్క్, ఇతర రాష్ట్రాల్లోని హాస్పిటల్స్‌కు స్టడీ టూర్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సమ్మర్ ఇంటర్న్‌షిప్ వ్యవధి ఎనిమిది వారాలు ఉంటుంది. ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేయకుండా రెండో ఏడాది కోర్సులోకి అనుమతించరు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సర పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డాక్టర్స్ పారామెడికల్ ప్రొఫెషనల్స్‌కు ప్రాధాన్యం ఉంటుంది.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ అండ్ యూసేజ్, హెల్త్ అండ్ హాస్పిటల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద హెచ్‌బీ పెన్సిల్‌తో గుర్తించాలి. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మే 30
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు సంబంధించిన ఫ్రీ కోచింగ్ క్లాసెస్:** జూన్ 25 నుంచి 29 వరకు
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూలై 10
- **చిరునామా:** అడ్మిషన్ సెల్, దారుస్సలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్, దారుస్సలాం, అగాపురా, నాంపల్లి, హైదరాబాద్- 500001
- **వెబ్‌సైట్:** www.dshm.co.in, www.osmania.ac.in

ఐఐటీ రోపార్‌లో ఎంటెక్

రోపార్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- 'ఎంటెక్ ఇన్ మెటీరియల్స్ ఇంజనీరింగ్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గేట్ స్కోర్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ముందుగా కామన్ ఆఫర్ యాక్సెప్టెన్స్ పోర్టల్(సీఓఏపీ) 2024లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ ప్రోగ్రామ్‌లో 8 సీట్లు ఉన్నాయి.


అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీటెక్(మెటలర్జీ/మెటీరియల్స్/ మెకానికల్/మైనింగ్/ప్రొడక్షన్/కెమికల్/బయోటెక్నాలజీ/టెక్స్‌టైల్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్) లేదా ఎమ్మెస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మెటీరియల్స్ సైన్స్/ ఎన్విరాన్‌మెంటల్/నానోటెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత కోడ్ పేపర్‌లో గేట్ 2022/2023/2024 అర్హత పొంది ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థులకు గేట్ స్కోర్ అవసరం లేదు.

ఆర్థిక సహకారం: సంస్థ నిబంధనల ప్రకారం నెలకు రూ.12,400 చొప్పున రెండేళ్లపాటు గేట్ ఫెలోషిప్ ఇస్తారు. ఇందుకుగాను అభ్యర్థులు ల్యాబొరేటరీ డిమాన్‌స్ట్రేషన్స్, ట్యుటోరియల్స్, అసైన్‌మెంట్స్, టెస్ట్ పేపర్లు, సెమినార్లు, రీసెర్చ్ ప్రాజెక్టులకు సంబంధించిన వ్యవహారాల్లో వారానికి 8 గంటలు అసిస్టెంట్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది.

- జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 25
- **వెబ్‌సైట్:** iitrpr.ac.in



ఐఐఎస్‌టీలో పీహెచ్‌డీ



తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెగ్యులర్, స్పాన్సర్డ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి.

విభాగాలు: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్, ఫిజిక్స్.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో(ఎంఈ/ఎంటెక్/ఎంఎస్)(ఇంజనీరింగ్/ టెక్నాలజీ)/ మాస్టర్స్ (సైన్స్/హ్యూమానిటీస్/మేనేజ్‌మెంట్/సోషల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంజనీరింగ్ విభాగాలకు కనీసం 7.5 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తి చేసిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాలకు నెట్ స్కోర్ ఉండాలి. డీఎస్‌టీ/ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ లేదా యూజీసీ/సీఎస్ఐఆర్ నెట్ లెక్చరర్‌షిప్ లేదా ఎన్‌బీహెచ్ఎం/జెస్ట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఐఐఎస్‌టీ, ఐఐటీ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ లేదా డ్యూయెల్ డిగ్రీ(ఇంజనీరింగ్) పూర్తిచేసిన అభ్యర్థులను; విదేశీ యూనివర్సిటీల నుంచి కనీసం 8/10 సీజీపీఏ లేదా 3.6/4 సీజీపీఏతో మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇంజనీరింగ్ పూర్తిచేసినవారిని; నెట్/జెస్ట్/ఎన్‌బీహెచ్ఎం స్కోర్ ఉన్నవారిని గేట్ స్కోర్ నుంచి మినహాయించారు. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి 35 ఏళ్లు మించకూడదు. స్పాన్సర్డ్ అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ఎంపిక: అభ్యర్థులను ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. ఫెలోషిప్ అర్హత లేదా నెట్/ఎన్‌బీహెచ్ఎం/జెస్ట్/ గేట్ (2022/2023/2024) స్కోర్ ఉన్న వారిని నేరుగా ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఆప్టిట్యూడ్, ఇంటర్ స్థాయి మేథమెటిక్స్ నుంచి; రెండో సెక్షన్‌లో సంబంధిత స్పెషలైజేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 45 శాతం మార్కులు రావాలి. స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూల్లో మొత్తమ్మీద జనరల్ అభ్యర్థులకు 60 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 55 శాతం మార్కులు రావాలి. ఆన్‌లైన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

రీసెర్చ్ ఫెలోషిప్: స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రవేశం పొందిన అభ్యర్థులకు సంస్థ ఫెలోషిప్ ఇస్తుంది. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; ఆ తరవాత నెలకు రూ.42,000 చెల్లిస్తారు. అభ్యర్థులు ట్యుటోరియల్స్ విభాగాల్లో, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ల్యాబ్స్‌లో, ఇతర అకడమిక్ యాక్టివిటీస్‌లో వారానికి ఆరు గంటలపాటు అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం
- పురుషులకు రూ.700; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.350
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **స్పాన్సర్డ్ అభ్యర్థుల దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మే 10
- **ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, డైరెక్ట్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** రెగ్యులర్ అభ్యర్థులకు మే 16న; స్పాన్సర్డ్ అభ్యర్థులకు మే 21న
- **ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** మే 29న
- **స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూన్ 5న
- **ఇంటర్వ్యూలు:** జూన్ 19 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 1న
- **అభ్యర్థుల రిపోర్టింగ్:** జూలై 23న
- **పీహెచ్‌డీ తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** iist.ac.in

SCHOLARSHIP ALERT

IET India Scholarship Award 2024

Description: The Institution of Engineering and Technology (IET) is inviting applications from undergraduate engineering students to sharpen their creativity, innovation, leadership, and excellence. The scholarship aims to recognise and nurture future engineering leaders in India.

Eligibility: Open for students studying in the 1st, 2nd, 3rd, or 4th year of a full-time regular undergraduate engineering program (in any field) at an AICTE/UGC-approved institution. The scholarship is also open for lateral entry students who join a B.Tech. program in the 2nd year. They must have cleared all regular credit courses in a single attempt. Applicants must have scored at least 60% in aggregate or an equivalent CGPA of at least six on a 10-point scale in the semesters cleared so far.

Prizes & Rewards: Scholarships worth INR 10,00,000

Last Date to Apply: 31-05-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/IET4

Global Scholarship Program AIS 2024

Description: Global Scholarship Program AIS 2024 is an opportunity offered by AIS Technolabs Pvt. Ltd. to undergraduate and postgraduate students. The main objective of this scholarship programme is to provide financial support and leadership opportunities to students in their preferred subjects.

Eligibility: Open for citizens of India or any country/ region. Applicants must have completed secondary school/high school education. Students must have applied for an undergraduate/postgraduate course in any subject from an accredited college/ institution/ university in the world. Candidates must have completed at least one term in the respective course and should not be a college dropout.

Prizes & Rewards: An annual scholarship up to two years and other benefits

Last Date to Apply: 15-05-2024

Application mode: via email only at - sunnyc@aistechnolabs.com

Short Url: www.b4s.in/aj/GSPA6

Kotak Suraksha Scholarship Program

Description: Kotak Securities Limited (KSL) invites applications from students studying in Classes 9 to 12 or pursuing general/professional graduation.

Eligibility: Open to PwD applicants currently studying in Classes 9 to 12 or pursuing general/professional graduation in India. Applicants must have secured at least 55% marks in their previous academic year. PAN India applicants are eligible. Annual family income of the applicants must not exceed INR 3,20,000.

Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year

Last Date to Apply: 30-04-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSP1



buddy4study.com

జాబ్ కార్నర్

ఆర్‌పీఎఫ్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 4,660

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)/రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్ఎఫ్)లో కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

● కానిస్టేబుల్: 4,208 ● సబ్ ఇన్‌స్పెక్టర్: 452

అర్హత: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు 18-28 ఏళ్ల మధ్య, ఎస్ఐ పోస్టులకు 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400; కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, దరఖాస్తునకు చివరి తేదీ: మే 14

నోట్: రీజియన్ల వారీ ఖాళీలు, విద్యార్హత, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలు త్వరలో విడుదలకానున్నాయి. సంక్షిప్త ఉద్యోగ ప్రకటనను ఎంప్లాయిమెంట్ న్యూస్ మేగజైన్(మార్చి 2-8)లో చూడవచ్చు.

వెబ్‌సైట్: https://rpf.indianrailways.gov.in/RPF/

బెల్‌లో టీచింగ్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 30

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

టీచింగ్ పోస్టులు: ఎన్‌టీటీ, పీఆర్‌టీ, జీపీటీ, టీజీటీ, పీజీటీ, పీయూసీ, ఎఫ్‌జీసీ, ఆఫీస్ అసిస్టెంట్ ఇతరాలు.

సబ్జెక్టులు: ఇంగ్లిష్, కన్నడ, హిందీ, సంస్కృత్, మేథమెటిక్స్, జనరల్ సైన్స్, సోషల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బయాలజీ, ఫిజిక్స్ మొదలైనవి.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, బీఈడీ, బీఈ, బీటెక్, ఎంఏ, ఎంటెక్, పీహెచ్‌డీ మొదలైనవి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌లో

చిరునామా: సెక్రటరీ, బీఈఈ, బెల్ హైస్కూల్ బిల్డింగ్, జలహల్లి, పీఓ బెంగళూరు.

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 23

వెబ్‌సైట్: https://bel-india.in/jobnotifications/

ఎలుగు గర్వం



ఒక అడవిలో ఎలుగు బంటి ఉండేది. దానికి రెండు పిల్లలు ఉండేవి. వాటిని బాగా చూసుకునేది. చెట్లనెక్కడం నేర్పించేది.. దగ్గరుండి మరీ వంకల్లో పిల్లలతో పాటు ఈదేది. అయితే ఆ ఎలుగుకు ఓ మానసిక సమస్య ఉంది. అదేంటంటే.. ఇతరుల బాధను చూసి నవ్వటం, సంతోషంగా ఉండటం చేసేది. ఎందుకో ఇతరులు బాధగా ఉంటే అందులో ఆనందాన్ని పొందేది తెలీకుండా. దీంతో ఎలుగుకు పిచ్చిపట్టిందనేవి మిగతా జంతువులు.

తేనెటీగలు ఉన్న పుల్లను విరిచి జింకల దగ్గర వదిలేది. జింకలను తేనెటీగలు కుడుతుంటే సంతోషడేది. ఎగిరెగిరి నవ్వేది. ఒక గంపలాంటి ఆకు తీసుకొచ్చి అందులో కొన్ని కప్పలు వేసి పెద్ద పాము దగ్గర వదిలేసేది. ఆ పాము కప్పలను తింటుంటే.. ఆ కప్పలు పరిగెత్తుతుంటే ఎంతో సంతోషపడేది. ఆ పాముల దగ్గరకు ముంగిసలను పంపించి.. అవి కొట్లాడుతుంటే లోలోపల ఆనందపడేది. కోతుల దగ్గరకు చింపాజీలను పంపి భయపెట్టించేది. చెల్లా చెదురైన కోతులను చేరదీసి బాధలు వినేది. ఇలాంటి సమయంలోనే లోలోపల ఎంతో తెలీని సంతోషాన్ని ఆస్వాదించేది. ఈ చేష్టలు చూసిన ఓ చిలుక ఒక రోజు ఇలా అంది.. 'అయ్యా.. ఎలుగుబంటి గారు. మీకు మీ జాతిలో ఉండే లక్షణాలే లేవు. కోతుల లక్షణాలివి. ఇంత అల్లరి చేస్తుంటే చూస్తున్నా. మీరు ఎలుగుబంటి.. హుందాగా ఉండండి' అనడిగింది. ప్రతి వొక్కరూ నాకు సలహాలు ఇచ్చేవారే అంటూ కోప్పడింది ఎలుగు. ఒక రోజు వేటకు వెళ్లి ఇంటికి వెళ్తానే.. ఎప్పుడూ ఎదురొచ్చే పిల్లలు రాలేదు. అవి ఎక్కడికి వెళ్లాయోనని బాధపడింది. అడవంతా తిరిగింది. పిల్లలు కనిపించక.. మూర్ఛపోయి పడిపోయింది. ఇంతలో రెండు ఎలుగు పిల్లలు వచ్చి దగ్గరగా కూర్చున్నాయి. కన్నబిడ్డల్ని చూస్తుంటే ఏడుపొచ్చింది ఎలుగుకు. 'ఆపమ్మా..' అంటూ ఎలుగుపిల్లలు గట్టిగా అన్నాయి. 'ఇతరులు బాధపడుతుంటే ఆనందపడ్డావు. మేం చూశాం. మేము కనపడకపోయేసరికి బాధపడుతున్నాం. మేం కావాలనే మన ఇంటి వెనకాల రాతికింద దాక్కున్నాం. నీలా మిగతా జంతువులు బాధపడతాయి కదా!' అన్నవి పిల్లలు. దీంతో ఎలుగుకు గర్వం అణగిపోయింది. తప్పు తెలుసుకుంది.




సరైన నీడ ఏది?

దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 283

			4	3	7			
	2				9	7		5
8		3						
2					6	1		
	8						5	
		1	9					7
						9		8
3		4	8				7	
			7	2	5			

సుడోకు - 282 సమాధానం

4	1	8	9	7	5	2	3	6
6	3	7	4	2	1	9	8	5
5	9	2	3	6	8	4	1	7
1	2	9	6	8	7	3	5	4
8	7	4	5	1	3	6	9	2
3	6	5	2	9	4	8	7	1
7	8	6	1	3	2	5	4	9
9	5	3	7	4	6	1	2	8
2	4	1	8	5	9	7	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.